www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..

విజయ్ దేవరకొండ, రష్మిక నిశ్చితార్థం

కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు

ఇద్దరి నడుమ కొన్నేళ్లుగా ప్రేమాయణం.. ఫిబ్రవరిలో పెళ్లి

నిజ జీవితంలోనూ ఒక్కటవనున్న వెండితెర హిట్ పెయిర్

2



శనివారం | 4-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 169 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి సా.5.10 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ధనిష్ఠ ఉ.9.09 తదుపరి శతభిషం; వర్జ్యం: సా.4.00-5.32; దుర్ముహూర్తం: ఉ.6.09-7.43; అమృతఘడియలు: రా.1.09-2.40; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం:6.09; సూర్యాస్తమయం: 5.58 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



697 కోట్లు

దసరా పండుగ నేపథ్యంలో మూడు రోజుల్లో రాష్ట్రంలో జరిగిన మద్యం విక్రయాలు

డిపోల నుంచి దుకాణాలకు చేరిన మద్యమే ఇది

అప్పటికే ఉన్న స్టాకు కలిపితే మరింత ఎక్కువ

సెప్టెంబరులో రికార్డ్ స్థాయిలో 3,048 కోట్ల అమ్మకాలు

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దసరా పండుగ సీజన్‌లో మద్యం విక్రయాలు రికార్డులు సృష్టించాయి. గాంధీ జయంతి రోజున పండుగ రావడంతో దుకాణాలు మూసి ఉంటాయన్న ఉద్దేశంతో ముందే భారీగా కొనుగోళ్లు జరగాయి. సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబరు 1న రూ.86.23 కోట్లు.. కలిపి మూడు రోజుల్లోనే ఏకంగా రూ.697.23 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇదంతా డిపోల నుంచి మద్యం దుకాణాలకు తరలిన సరుకు మాత్రమే. అప్పటికే దుకాణాల్లో ఉన్న స్టాకును కూడా కలిపితే.. మద్యం విక్రయాలు మరింత ఎక్కువే జరిగినట్టు అంచనా. మొత్తంగా ఈ ఏడాది సెప్టెంబరులో రూ.3,048 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన విక్రయాలు రూ.2,839 కోట్లతో పోలిస్తే ఇది 7శాతం ఎక్కువ. అయితే పండుగ ముందు మూడు రోజుల లెక్కలనే పరిశీలిస్తే.. విక్రయాలు 50శాతానికిపైనే పెరిగినట్టు చెబుతున్నారు.

బీర్లకు తగ్గిన డిమాండ్..

రాష్ట్రంలో సెప్టెంబరులో ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎల్) విక్రయాలు పెరగగా.. బీర్ల అమ్మకాలు తగ్గాయి. గత ఏడాది సెప్టెంబరులో ఐఎంఎల్ లిక్కర్ 28.81లక్షల కేసులు అమ్ముడవగా.. ఈసారి 29.92 లక్షల కేసులు విక్రయించారు. గతంలో బీర్లు 39.71లక్షల కేసులు అమ్ముడవగా.. ఈసారి 36.46 లక్షల కేసులకు తగ్గాయి. వరుసగా వానలతో చల్లటి వాతావరణం, బీర్ల ధరల పెరుగదల నేపథ్యంలో అమ్మకాలు తగ్గాయని భావిస్తున్నారు.

ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టుకు..

గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్లేదిలా!

తెలంగాణలోని 2 జిల్లాలు, 40 గ్రామాలు.. ఏపీ పరిధిలోని 3 జిల్లాలు, 60 గ్రామాలు

ప్రాథమికంగా అలైన్‌మెంట్ రూపకల్పన.. డీపీఆర్ కన్సల్టెంట్స్ నియామకానికి కసరత్తు

డిసెంబరుకు పూర్తి అలైన్‌మెంట్ వచ్చే చాన్స్.. 'ఆంధ్రజ్యోతి'కి లభించిన 12 వరుసల హైవే వివరాలు



హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకూ ప్రతిపాదిస్తున్న 12 వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా రూపొందించింది. ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. దాని ప్రకారం రోడ్డును మంజూరు చేసి, నిర్మించాలని కోరుతోంది. ప్రాథమిక అలైన్‌మెంట్, రూట్ మ్యాప్ వివరాలు 'ఆంధ్రజ్యోతి'కి లభించాయి. దాని ప్రకారం.. ప్రతిపాదిత మార్గం 2 రాష్ట్రాలు.. 5 జిల్లాలు, 100 గ్రామాల మీదుగా వెళ్లనుంది. వీటిలో తెలంగాణ పరిధిలో 2 జిల్లాల్లోని 40 గ్రామాలు ఉండగా.. ఏపీ పరిధిలో 3 జిల్లాల్లోని 60 గ్రామాల పక్కనుంచి హైవే వెళ్లనుంది. ఈ మేరకు ఆయా జిల్లాలు, గ్రామాల వారీగా ప్రాథమికంగా అలైన్‌మెంట్ రూపుదిద్దుకుంది. కేంద్రం ఆమోదిస్తే దీని ప్రకారమే హైవే ఉండనుంది. ఇక, అలైన్‌మెంట్‌కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) రూపకల్పన బాధ్యతను ఓ కన్సల్టెన్సీకి అప్పగించాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది. అక్టోబరు మూడో వారానికి కన్సల్టెన్సీ ఎంపికైతే డిసెంబరునాటికి పూర్తిస్థాయి అలైన్‌మెంట్ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా మచిలీపట్నం దగ్గరున్న బందరు పోర్టుకు వెళ్లే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాథమిక అలైన్‌మెంట్ ప్రకారం తెలంగాణలోని ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని దాదాపు 40 గ్రామాల పక్క నుంచి వెళ్లనుంది. ఇక, తెలంగాణ సరిహద్దు

మిగతా 13వ పేజీలో...



నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో జరిగిన దసరా వేడుకల్లో మనుమడు రియాన్ష్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సొంతూరిలో దసరా వేడుకల్లో సీఎం

13

కొండారెడ్డిపల్లిలో రేవంత్‌కు ఘనస్వాగతం

గ్రామస్థులతో కలిసి జమ్మి చెట్టు వద్దకు వెళ్లిన ముఖ్యమంత్రి



తొమ్మిది రోజులపాటూ వైభవంగా జరిగిన తిరుమల బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసాయి. ఉదయం శ్రీవారి పుష్కరిణిలో వేలాదిమంది భక్తుల మధ్య వేడుకగా చక్రత్తాళ్వారుకు చక్రస్నానం జరిగింది. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలు ముగిసిన మర్నాడు శుక్రవారం అనంతాళ్వారుతోటలో భాగ్‌సవారి ఉత్సవం జరిగింది.

ప్రపంచపటం నుంచి తుడిచేస్తాం

ఉనికి మిగలాలంటే ఉగ్రవాదానికి సాయం చేయడం ఆపాలి

సిందూర్ 2.0 ఎంతో దూరంలో లేదు

పాక్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక

గీత దాటితే గల్లంతే..

భౌగోళిక రూపాన్ని మార్చేస్తాం

సర్ క్రీక్ గుండానే కరాచీకి దారి.. మరవొద్దు

రక్షణమంత్రి రాజ్‌నాథ్ తీవ్ర స్వరం



ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది

2



ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..

- విజయ్ దేవరకొండ, రష్మిక నిశ్చితార్థం
- కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు
- ఇద్దరి నడుమ కొన్నేళ్లుగా ప్రేమాయణం.. ఫిబ్రవరిలో పెళ్లి
- నిజజీవితంలోనూ ఒక్కటవనున్న వెండితెర హిట్ పెయిర్

'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' చిత్రాల్లో జంటగా ప్రేక్షకులను అలరించిన వెండితెర హిట్ పెయిర్ నిజజీవితంలోనూ ఒక్కటవనున్నారు! టాలీవుడ్ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ, 'పుష్ప' చిత్రంతో నేషనల్ క్రష్‌గా మారిన రష్మిక మందన్న.. వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు! ఇద్దరి మధ్య ప్రేమబంధం ఉందంటూ ఎన్నాళ్లుగానో చక్కర్లు కొడుతున్న ఊహాగానాలు నిజమయ్యాయి!! వీరిద్దరికీ హైదరాబాద్‌లో శుక్రవారం ఉదయం నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. విజయ్ దేవరకొండ స్వగృహంలో జరిగిన ఈ వేడుకకు.. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరు పెళ్లి చేసుకోనున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరూ కలిసి నటించిన తొలి చిత్రం 'గీత గోవిందం'. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. ఆ తర్వాత 'డియర్ కామ్రేడ్'తో ఆ బంధం బలపడింది. అప్పట్నుంచీ ఇద్దరూ ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. ఇద్దరూ ఒకే లొకేషన్ ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ఆ ప్రచారానికి బలం చేకూరింది. ఇప్పుడు నిశ్చితార్థంతో అది నిజమని తేలింది. వీరిద్దరూ కలిసి త్వరలోనే మరో చిత్రంలో కలిసి నటించబోతున్నారు. ఆ సినిమా సెట్స్‌పై ఉండగానే వీరి వివాహం జరగనుందని తెలుస్తోంది. (ఆంధ్రజ్యోతి-సినిమా డెస్క్)

లోకం తీరు



రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు మందు ఇవ్వొద్దు

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 3: రెండేళ్లలోపు వయసున్న పిల్లలకు దగ్గు, జలుబుకు సంబంధించిన మందులు ఇవ్వొద్దని (ప్రిస్క్రైబ్ చేయొద్దని) కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) నిర్దేశించింది. మధ్యప్రదేశ్‌లో కలుషితమైన కాఫ్ సిరప్‌ల కారణంగా పిల్లలు మృత్యువాతపడినట్లుగా వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ అవ్వడం గమనార్హం. సాధారణంగా ఐదేళ్లలోపు వయసున్న పిల్లలకు కాఫ్ సిరప్‌ను సిఫారసు చేయొద్దని, ఒకవేళ అవసరం అనుకుంటే వైద్య నిపుణుల పర్యవేక్షణలో సరైన మోతాదులో ఇవ్వాలని సూచించింది. పిల్లలకు వచ్చే తీవ్రమైన దగ్గుతో కూడిన అస్వస్థత సాధారణంగా దానికదే తగ్గిపోతుందని.. ఇందుకు ఔషధాలు అవసరం లేకుండా, బాధిత చిన్నారులకు బాగా విశ్రాంతినివ్వడం అనేది మొదటి ప్రాధాన్యంగా ఉండాలని డీజీహెచ్ఎస్ వైద్యురాలు డాక్టర్ సునీతా శర్మ సూచించారు.

విజయ్‌పై కేసు ఎందుకు పెట్టలేదు!

- కరూర్ తొక్కిసలాటపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం
- ఘటనపై దర్యాప్తునకు 'సిట్' ఏర్పాటుకు ఆదేశం



చెన్నై, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ దుర్ఘటనకు సంబంధించి 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ అధినేత విజయ్ వ్యవహరించిన తీరును తప్పుబట్టింది. కళ్లెదుట అంతమంది చనిపోతున్నా పట్టించుకోకుండా ఘటనా స్థలం నుంచి పారిపోతారా..? ఇదేం పార్టీ.. ఇదేం విధానం..? అంటూ మండిపడింది. ఈ ఘటన పట్ల కనీసం విచారం కూడా వ్యక్తం చేయలేదని, ఆ పార్టీ అధ్యక్షుడికి అసలు నాయకత్వ లక్షణాలే లేవనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ ఘటనకు కారణంగా భావిస్తున్న విజయ్‌పై ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించింది. 41 మంది చావుకు, 60 మంది గాయపడడానికి కారణమైన ఈ దుర్ఘటన పట్ల ప్రేక్షకపాత్ర వహించలేమని అంటూ టీవీకే పార్టీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టేందుకు తమిళనాడు ఉత్తర విభాగ ఐజీ అస్రా గార్గ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. "41 మంది మరణానికి బాధ్యులైన వారిపై తమిళనాడు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు ఆవేదన చెందుతున్నాం. తన ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యతను నెరవేర్చడంలో రాష్ట్రం విఫలమైనప్పుడు కోర్టు తన పౌరుల పట్ల బాధ్యత వహిస్తుంది" అని విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

200 కిలోల గంజాయితో ఎన్ఎస్‌జీ మాజీ కమాండో పట్టివేత

జైపూర్, అక్టోబరు 3: రాజస్థాన్ పోలీసులు గంజాయి స్మగ్లింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తోన్న ఎన్ఎస్‌జీ మాజీ కమాండో బజ్రంగ్ సింగ్‌ని అరెస్టు చేశారు. ఇతడు 26/11 ముంబయి తీవ్రవాద వ్యతిరేక ఆపరేషన్లోనూ పాల్గొన్నాడని రాజస్థాన్ ఐజీపీ వికాస్ కుమార్ గురువారం తెలిపారు. చురు జిల్లాలోని రతన్‌గర్‌లో ఇతడిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. తెలంగాణ, ఒడిశాల నుంచి రాజస్థాన్‌కు గంజాయి రవాణా చేయిస్తున్న అతడి వద్ద 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. గంజాయి స్మగ్లింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తోన్న ఇతడిని పట్టిచ్చిన వారికి రూ.25,000 బహుమతి కూడా ప్రకటించినట్లు పేర్కొన్నారు. కాగా బజ్రంగ్ సింగ్ 2023 సెప్టెంబరులో హైదరాబాద్‌లోని రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోనూ అరెస్టయ్యాడు. మరో ముగ్గురితోపాటు ఇతడిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి అప్పట్లో 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

దృష్టి ఐఏఎస్‌పై సీసీపీఏ రూ.5లక్షల జరిమానా

న్యూఢిల్లీ, అక్టోబరు 3: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలు-2022కు సంబంధించి తప్పుడు ప్రకటనలు చేసినందుకు గాను దృష్టి ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌పై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ(సీసీపీఏ) రూ.5లక్షల జరిమానా విధించింది. అప్పుడు ఈ కోచింగ్ సెంటర్ "మా సంస్థ నుంచి 2022 సంవత్సరంలో 216 కంటే ఎక్కువ మంది సివిల్ సర్వీసెస్‌కు అర్హత సాధించారు" అని పత్రికా ప్రకటనలు ఇచ్చింది. అయితే, ఆ ప్రకటన తప్పని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని తేలింది. 216 మందిలో 162మంది కేవలం ఈ సంస్థ ఇచ్చిన ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్‌లో మాత్రమే పాల్గొన్నారని, వారంతా సొంతంగా ప్రిలిమ్స్, మెయిన్స్ క్వాలిఫై అయ్యారని వెల్లడైంది. దృష్టి సంస్థపై సీసీపీఏ జరిమానా విధించడం ఇది రెండోసారి.

పశు దాణా ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, అక్టోబరు 3: పశువుల దాణాతోపాటు వంట నూనెలు, కొవ్వు పదార్థాలు, డెయిరీ ఉత్పత్తుల ఎగుమతిపై నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. రైతుల ఆదాయం పెంపుతోపాటు దేశీయ పశు దాణా తయారీ దారులను కాపాడుకునేందుకు తక్షణం పశు దాణాపై నిషేధం ఎత్తివేస్తున్నట్లు డీజీఎఫ్‌టీ ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. పశు దాణా ఎగుమతిపై కేంద్రం గతేడాది నిషేధం విధించింది. పొరుగుదేశం భూటాన్‌కు డెయిరీ ఉత్పత్తులు, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు, కొన్ని కూరగాయలు, బియ్యం, గోధుమల ఎగుమతిపై నిషేధం ఎత్తేస్తూ డీజీఎఫ్‌టీ విడిగా నోటిఫికేషన్ జారీ చేసింది. తేయాకు, సోయాబీన్ ఆయిల్, వేరు శనగ నూనె, పామాయిల్, జంతు/ కూరగాయల కొవ్వు పదార్థాలు, చక్కెర, ఉప్పు ఎగుమతులకూ పచ్చ జెండా ఊపింది.

వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన భార్య


న్యూఢిల్లీ, అక్టోబరు 3: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన భార్య గీతాంజలి జె ఆంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆయనను ఎన్ఎస్ఏ కింద అరెస్టు చేశారని, కానీ ఏ ప్రాతిపదికన ఆ చట్టం కింద అరెస్టు చేశారో ఇంతవరకు చెప్పలేదని తెలిపారు. ఆయనను వెంటనే సుప్రీంకోర్టులో హాజరుపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హెబియస్ కార్పస్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. లద్దాఖ్ సమస్యల కోసం నిరాహార దీక్ష చేసిన కారణంగా ఆయన ఆరోగ్యం దెబ్బతిందని, వెంటనే వైద్య సహాయం అందించాలని కోరారు.

26 నుంచి చైనాకు నేరుగా విమానాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 3: చైనా, భారత్‌ల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఐదేళ్ల తరువాత ఇరు దేశాల మధ్య నేరుగా విమానాలు నడవబోతున్నాయి. అక్టోబరు చివరినాటికి ఈ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇరు దేశాల పౌరుల మధ్య స్నేహ సంబంధాలు పెరగడానికి ఇది దోహదం చేస్తుందని ఆ ప్రకటన పేర్కొంది. ఇండిగో, చైనా ఈస్టర్న్.. రెండు విమానాయాన సంస్థలు తొలిగా సర్వీసులను నడపడానికి ముందుకు వచ్చాయి. ఈమేరకు ఇండిగో ఓ ప్రకటన చేసింది. 'అక్టోబరు 26 నుంచి కోల్‌కతా నుంచి గ్యాంగ్‌జౌకు విమాన సర్వీసును నడుపుతాం. త్వరలో ఢిల్లీ నుంచి కూడా గ్యాంగ్‌జౌకు సర్వీసును ప్రారంభిస్తాం' అని పేర్కొంది.

రేపటి వరకే హమాస్‌కు గడువు

- డెడ్‌లైన్ దాటితే నరకం చూపిస్తాం



వాషింగ్టన్ డీసీ, అక్టోబరు 3: ఈ నెల ఐదు సాయంత్రం 6 గంటల్లోగా యుద్ధం ముగించాలని హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గడువిచ్చారు. ఆదివారం వరకు ఇచ్చిన డెడ్‌లైన్ దాటితే మునుపెన్నడూ చూడనంత స్థాయిలో దాడులు చేసి హమాస్‌కు నరకం చూపిస్తామని హెచ్చరించారు. యుద్ధం ముగించి గాజా శాంతి ఒప్పందాన్ని అంగీకరించాలని సూచించారు. అమెరికా రూపొందించిన 20 సూత్రాల ప్రణాళికకు ఇజ్రాయెల్ ఇప్పటికే సమ్మతి తెలిపింది. మరోవైపు ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ఒప్పందం తాము సభ్యురాలిగా ఉన్న ముస్లిం దేశాలది కాదని పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దర్ స్పష్టం చేశారు.

రెండేళ్ల జీతమిచ్చి.. ఉద్యోగుల తొలగింపు



దేశంలోనే అతి పెద్ద ఐటీ దిగ్గజం టీసీఎస్‌లో లే ఆఫ్‌లు

- ఉద్యోగులు సంస్థలో పనిచేసిన కాలాన్ని బట్టి తొలగింపు ప్యాకేజీగా ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వేతనం

న్యూఢిల్లీ, అక్టోబరు 3: దేశంలోని అతి పెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 'సిబ్బంది పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం' కింద.. ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ చేపట్టింది. సంస్థ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేని, నైపుణ్యాలను పెంచుకోని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. ఇలా తొలగించే ఉద్యోగులకు 3నెలల వేతనాన్ని 'నోటీస్ పే'గా అందిస్తోంది. దానికి అదనంగా.. ఉద్యోగులు టీసీఎస్‌లో ఎంతకాలంగా పనిచేస్తున్నారనే అంశం ఆధారంగా ఆరు నెలల నుంచి రెండేళ్ల వేతనాన్ని తొలగింపు ప్యాకేజీ కింద ఇస్తోంది. ఏ ప్రాజెక్టులోనూ లేనివారికి/ఎనిమిది నెలలకు పైగా బెంచ్‌పై ఉన్నవారికి కేవలం మూడు నెలల వేతనం మాత్రమే ఇచ్చి సాగనంపుతోంది. 10 నుంచి 15 ఏళ్లు సంస్థలో పనిచేసినవారికి ఏడాదిన్నర వేతనం.. 15 ఏళ్లకు పైగా సంస్థలో ఉన్నవారికి రెండేళ్ల వేతనం ఇస్తోంది. పదవీ విరమణ వయసుకు దగ్గరలో ఉన్నవారికి 'టీసీఎస్ కేర్స్' పథకం కింద ముందే పదవీ విరమణ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. అందులో భాగంగా వారికి పూర్తిస్థాయి పదవీ విరమణ ప్రయోజనాలు, బీమా, అదనంగా తొలగింపు ప్యాకేజీ కింద ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వేతనాన్ని అందిస్తోంది. నానాటికీ పెరుగుతున్న ఏఐ ప్రభావం, క్లైంట్ల డిమాండ్ల మేరకు.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తన సిబ్బందిలో 2% మందిని (దాదాపు 12 వేల మందిని) తగ్గించుకోనున్నట్టు ఈ ఏడాది జూలైలో ప్రకటించిన సంగతి తెలిసిందే.

వివరాలు చెప్పండి..

ప్రపంచవ్యాప్తంగా తన సిబ్బందిని టీసీఎస్ తొలగిస్తున్న నేపథ్యంలో.. అమెరికాలో నియామకాలకు సంబంధించి టీసీఎస్ అనుసరిస్తున్న విధానాలపై యూఎస్ సెనెటర్లు 9 ప్రశ్నలు సంధించారు. ఈమేరకు సెనెట్ జ్యుడిషియరీ కమిటీ చైర్మన్ చార్లెస్ గ్రాస్‌లే, ర్యాంకింగ్ మెంబర్ రిచర్డ్ డర్బిన్ టీసీఎస్ సీఈవో కె.కృత్తివాసన్‌కు సెప్టెంబరు 24న లేఖ రాశారు. ఇటీవలికాలంలో అమెరికాలోని జాక్సన్‌విల్లేలో దాదాపు 60 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించిన విషయాన్ని అందులో పేర్కొన్నారు. 2025లో టీసీఎస్ సంస్థ 5,505 మంది హెచ్-1బీ ఉద్యోగులను నియమించుకోవడానికి అనుమతి పొందిన నేపథ్యంలో.. ఒకవైపు అమెరికన్లను తొలగిస్తూ.. ఇలా హెచ్-1బీ ఉద్యోగుల కోసం వేలాది పిటిషన్లు దాఖలు చేయడమేమిటని ప్రశ్నించారు. టీసీఎస్ తన కార్యాలయాల్లో ఉద్యోగాలకు తగిన అర్హతలున్న అమెరికన్ ఉద్యోగులను గుర్తించలేకపోవడం నమ్మదగినదిగా లేదని వ్యాఖ్యానించారు. వయసు మళ్లిన అమెరికన్ ఉద్యోగులను తొలగించి.. వారి స్థానాలను దక్షిణాసియా దేశాలకు చెందినవారిని హెచ్-1బీ వీసాలపై తెచ్చి భర్తీ చేస్తోందన్న ఆరోపణలు టీసీఎస్‌పై ఉన్నాయి. దీనిపై 'ఈక్వల్ ఎంప్లాయ్‌మెంట్ ఆపర్చునిటీ కమిషన్' దర్యాప్తు జరుపుతోంది. ఇలాంటి సమయంలో.. అమెరికన్లను హెచ్-1బీ వీసాపై వచ్చినవారితో భర్తీచేయడం సంస్థకు ఏవిధంగానూ మేలు చేయదని సెనెటర్లు తమ లేఖలో పేర్కొన్నారు. హెచ్-1బీ వీసాపై తెచ్చినవారితో అమెరికన్ ఉద్యోగుల స్థానాన్ని భర్తీ చేస్తున్నారా? హెచ్-1బీ వీసాలపై వచ్చినవారికి అమెరికన్ ఉద్యోగులకు చెల్లించే వేతనాల్లో తేడాలు ఎంత? వంటి ప్రశ్నలు అడిగి.. 10వ తేదీలోగా వాటికి పూర్తి వివరాలతో సమాధానాలు ఇవ్వాలని కోరారు.

అమెరికా వర్సిటీల్లో విదేశీ విద్యార్థుల ప్రవేశాలు 15% మించొద్దు

అమెరికా వర్సిటీలకు ట్రంప్ సర్కారు మెమో

వాషింగ్టన్, అక్టోబరు 3: హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసి.. విదేశీ నిపుణులు అమెరికాలోకి రాకుండా అడ్డం కొట్టిన ట్రంప్.. ఇప్పుడు విదేశీ విద్యార్థుల ప్రవేశాలకూ అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టారు! ఇందుకు సంబంధించిన నిబంధనలతో అమెరికాలోని తొమ్మిది ప్రఖ్యాత యూనివర్సిటీలు, విద్యాసంస్థలకు పది సూత్రాల మెమో పంపించారు. ఆ పది సూత్రాలనూ ఆమోదించి సంతకం పెట్టి, ఆ మేరకు తమ విధానాలను మార్చుకుంటే.. ప్రభుత్వ నిధులను సమకూర్చడంతోపాటు బోలెడన్ని ప్రయోజనాలను కల్పిస్తానంటూ ఆయా విద్యాసంస్థలను ఊరించే ప్రయత్నం చేశారు. వాటిని పాటించకపోతే ఆయా విద్యాసంస్థలకు అందే ఫెడరల్ నిధులు, గ్రాంట్లను నిలిపివేస్తామని, పైపెచ్చు వాటిపై అమెరికా న్యాయశాఖ పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. ఆ పది సూత్రాలూ ఏంటంటే.. అమెరికా వర్సిటీల్లో అంతర్జాతీయ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థుల ప్రవేశాలు 15% మించకూడదు. ఇలా చేరే విదేశీ విద్యార్థుల్లో ఒక దేశం నుంచీ 5 శాతం మందికి మించి ఉండకూడదు. విదేశీ విద్యార్థుల చేరికలు, అధ్యాపకుల నియామకాల్లో జాతి, లింగం ఆధారంగా నిర్ణయాలు తీసుకోకూడదు. పూర్తిగా ప్రతిభ ఆధారంగా మాత్రమే ప్రవేశాలు, నియామకాలు ఉండాలి. విద్యార్థుల నుంచి వసూలు చేసే ట్యూషన్ ఫీజును ఐదేళ్లపాటు పెంచకూడదు. ప్రామాణిక పరీక్షల్లో ఉత్తీర్ణత తప్పనిసరి. గతంలో అమెరికా కాలేజీల్లో చేరడానికి.. స్కాలిస్టిక్ ఎసెస్‌మెంట్ టెస్ట్ (శాట్) వంటి ప్రామాణిక పరీక్షల్లో అర్హత సాధించడం తప్పనిసరి నిబంధనగా ఉండేది. కానీ ఇటీవలికాలంలో చాలా కాలేజీలు 'టెస్ట్ ఆప్షనల్ పాలసీ'లను అనుసరించి శాట్/తత్సమాన ప్రామాణిక పరీక్షలు రాయనివారికి కూడా ప్రవేశం కల్పిస్తున్నాయి. విద్యార్థులకు మార్కులు ఇవ్వడంలో కఠిన ప్రమాణాలను పాటించాలని ఈ మెమోలో సూచించారు. అప్పుడు నిజంగా అత్యుత్తమ ప్రతిభ కలిగినవారికి మాత్రమే అత్యుత్తమ గ్రేడ్‌లు వస్తాయి. విదేశీ విద్యార్థులు అమెరికన్/పాశ్చాత్య విలువలకు మద్దతిస్తున్నారా లేదా చూడాలి. అమెరికా/దాని మిత్రదేశాల పట్ల వైరం చూపించేవారిని ప్రవేశ దశలోనే అడ్డుకోవాలి. విదేశీ విద్యార్థుల క్రమశిక్షణ రికార్డులు సహా వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని యూనివర్సిటీలు అమెరికా విదేశాంగ శాఖతో, 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్)తో పంచుకోవాలి. ఇదిలా ఉండగా, అమెరికాలో ట్రంప్ వచ్చినప్పటి నుంచి జరుగుతున్న హడావుడి చూసి ఆ దేశానికి చదువు కోసం వెళ్లే విద్యార్థుల సంఖ్య ఇప్పటికే తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే.. ఈ ఏడాది అమెరికన్ వర్సిటీల్లో చేరిన విదేశీ విద్యార్థుల సంఖ్య 19% మేర తగ్గింది.

ప్రపంచపటం నుంచి తుడిచేస్తాం

పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక



దసరా రోజున భుజ్‌లో ఆయుధపూజ చేస్తున్న రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ/భుజ్, అక్టోబరు 3: ఉగ్రవాదానికి ఊతమిచ్చే చర్యలను నిలిపివేయకపోతే ప్రపంచ పటం నుంచి తుడిచేస్తామంటూ దాయాది పాక్‌ను ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. రాజస్థాన్‌లోని అనూప్‌గఢ్‌లోని సైనిక పోస్టును శుక్రవారం ఆయన సందర్శించారు. 'ఈసారి వెనక్కి తగ్గేది లేదు. ఆపరేషన్ సిందూర్ రెండో దశ ఎంతో దూరంలో లేదు. అది 1.0లా ఉండదు. భౌగోళిక పటంలో తన దేశం ఉండాలా వద్దా అనేది పాక్ నిర్ణయించుకోవాల్సి వస్తుంది. ఒకవేళ భౌతికంగా అస్తిత్వంలో ఉండాలనుకుంటే రాజ్య ప్రోత్సాహిత ఉగ్రవాదాన్ని తక్షణం కట్టిపెట్టాలి' అని స్పష్టం చేశారు. భగవంతుడు కోరుకుంటే త్వరలోనే ఆ 'అవకాశం' వస్తుందంటూ...ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉండాలని సైనికులను ఆయన కోరారు.

ఖబడ్దార్: రాజ్‌నాథ్ సింగ్

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం గుజరాత్‌లోని భుజ్ సరిహద్దు ప్రాంతంలో సైనికులతో కలిసి దసరా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాక్‌పై విరుచుకుపడ్డారు. సర్ క్రీక్ వద్ద దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని, చరిత్రను..భౌగోళిక స్వరూపాన్నీ మార్చివేస్తామని హెచ్చరించారు. వివాదాస్పద సర్ క్రీక్ ప్రాంతంలోకి తన సైనిక నిర్మాణాలను పాక్ విస్తరిస్తున్నట్టు వస్తున్న వార్తలపై ఆయన ఇలా స్పందించారు. "1965 యుద్ధంతోపాటు సిందూర్‌ను కూడా పాకిస్థాన్ గుర్తుపెట్టుకోవాలి. రెండు సందర్భాల్లోనూ లాహోర్ వరకు వెళ్లి మన వాయుసేన తన సత్తా చాటింది. కరాచీకి వెళ్లే రహదారి సర్ క్రీక్ గుండానే పోతుందనేది దాయాది దేశం మరవొద్దు" అని రాజ్‌నాథ్ హెచ్చరించారు. కాగా, సైనికులతో కలిసి ఆయుధ పూజలో పాల్గొన్న ఆయన, సర్ క్రీక్ ప్రాంతాన్ని శక్తివంతం చేస్తూ నెలకొల్పిన జాయింట్ కంట్రోల్ సెంటరును, టైడల్ బెర్తింగ్ వ్యవస్థను ప్రారంభించారు.

ఏమిటీ సర్ క్రీక్ వివాదం?

భారత్, పాకిస్థాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదాల్లో 'సర్ క్రీక్' ఒక ముఖ్యమైన అంశం. వ్యూహాత్మక, ఆర్థిక, భద్రత దృష్ట్యా ఇరు దేశాలకూ ప్రాధాన్యం కలిగిన ప్రాంతం. గుజరాత్‌లోని రాణ్ ఆఫ్ కచ్, పాకిస్థాన్ మధ్య ఉండే సముద్ర తీర ఉప్పు నీటి కాలువనే 'సర్ క్రీక్'గా పిలుస్తారు. ఇది 100 కిలోమీటర్ల కంటే తక్కువ పొడవు ఉంటుంది. 'సర్ క్రీక్'లో సగం తమదని భారత్ వాదిస్తోంది. పాకిస్థాన్‌లో అతిపెద్ద వాణిజ్య కేంద్రమైన కరాచీకి, అక్కడి పోర్టుకు నేరుగా చేరుకొనేందుకు సర్ క్రీక్ గుండానే ప్రయాణించాల్సి ఉంటుంది.

పది పాక్ జెట్లను ధ్వంసం చేశాం


- కూల్చినవాటిలో ఎఫ్-16, ఎస్‌జే-17లు
- వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ ప్రకటన

ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాల సమన్వయంతో దాయాది పాక్‌ను చావుదెబ్బ కొట్టగలిగామని వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌లోకి 300 కిలోమీటర్ల మేర దూసుకెళ్లామని, ఇంత విస్తారమైన భూభాగంలోకి చొచ్చుకెళ్లడం ఇదే తొలిసారి అని (లాంగెస్ట్ కిల్) తెలిపారు. 93వ వాయుసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తొలిసారి ఆయన పాక్‌కు కలిగిన యుద్ధ నష్టాలను లెక్కలతోసహా వివరించారు. "పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్లను ధ్వంసం చేశాం. కూల్చివేసిన ఆరేడు జెట్లలో ఎఫ్-16లు (అమెరికా), జేఎఫ్-17(చైనా) కూడా ఉన్నాయి. 11 వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడులు మొదలుపెట్టడంతో పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది" అని అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. 4రోజులు సాగిన యుద్ధంపై పాక్ కథనాలు 'మనోహరం'గా ఉన్నాయని, వాటితోనే వారిని సంతృప్తి పడనీయండంటూ ఆయన ఎద్దేవా చేశారు. మనవి 15 ఫైటర్ జెట్లను కూల్చివేశామన్న భ్రమల్లోనే బతికేస్తామంటే, అలాగే వారు చేయవచ్చునన్నారు.

ఒత్తిళ్లకు భారత్ తలొగ్గదు

అవమానాలను భరించడానికి సిద్ధపడదు

- ఇంధన కొనుగోళ్లలో రాజకీయాలు లేవు
- ప్రధాని మోదీ తెలివైన నాయకుడు: పుతిన్




మాస్కో, అక్టోబరు 3: తమ దేశం నుంచి ఇంధన కొనుగోళ్లు నిలిపివేయాలంటూ భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తుండటాన్ని రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్రంగా తప్పుబట్టారు. అలాంటి ఒత్తిళ్లకు భారత్ ఎప్పటికీ తలొగ్గదని చెప్పారు. ఎలాంటి అవమానాలనూ భరించడానికి కూడా సిద్ధపడదన్నారు. సోచిలోని వల్డాయ్ డిస్కషన్ క్లబ్‌లో జరిగిన ప్లీనరీలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'సమతుల్యంతో ఉండే తెలివైన నేత' అంటూ ప్రధాని మోదీని కొనియాడారు. మాస్కోకు, ఢిల్లీకి మధ్య ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ కొనుగోలు వెనుక పూర్తి ఆర్థిక గణాంకాలే ఉన్నాయి తప్ప రాజకీయ ఉద్దేశాలు ఏమీ లేవని వివరించారు. శిక్షించే విధంగా అమెరికా విధించిన సుంకాలతో ఏర్పడుతున్న నష్టాలను రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఇంధనంతో భారత్ సమతుల్యం చేస్తోందన్నారు. వాణిజ్య భాగస్వాములపై అత్యధిక సుంకాలు విధిస్తే ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరుగుతాయని పుతిన్ అమెరికాను హెచ్చరించారు. అమెరికా ఫెడరల్ రిజర్వు కూడా వడ్డీ రేట్లు పెద్దఎత్తున పెంచాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. భారత్ స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి రష్యాతో ప్రత్యేకమైన సహజ సంబంధాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య వాణిజ్య అసమతుల్యత ఉందని అంగీకరించిన పుతిన్.. దానిని సరిచేయడానికి భారత్ నుంచి మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలు కొనుగోలు చేస్తామన్నారు. ఏఐతో పాటు ఇతర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో కలిసి పనిచేయాలన్న సూచనను స్వాగతించారు. భారత్ నుంచి సోచి సదస్సులో పాల్గొన్న వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ డైరెక్టర్ జనరల్ అరవింద్ గుప్తా ఆ ప్రతిపాదన చేశారు.

భారతీయ సినిమాలంటే ఎంతో ఇష్టం

భారతీయ సినిమాలంటే తనకెంతో ఇష్టమని పుతిన్ తెలిపారు. తమ దేశంలో భారతీయ సినిమాలకు ఎంతో జనాదరణ ఉందని చెప్పారు. "మాకు భారతీయ సినిమాలంటే ఎంతో ఇష్టం. ఆ సినిమాల కోసమే ప్రత్యేక టీవీ చానల్ నడుపుతున్నాం. భారత్ వెలుపల ప్రపంచంలో రష్యా ఒక్కటే బహుశా ఇలాంటి చానల్ నడుపుతోంది" అని పేర్కొన్నారు. డిసెంబరులో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు.

తుర్కియేకు భారీగా భారత పెట్రోలియం

- శుద్ధి చేసిన చమురు ఉత్పత్తుల ఎగుమతిని గణనీయంగా పెంచిన భారత్



రష్యా రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులతో..

న్యూఢిల్లీ, అక్టోబరు 3: మన దాయాది పాకిస్థాన్‌కు నిత్యం వంతపాడే తుర్కియేకు భారత్ నుంచి పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు భారీగా పెరిగాయి. ఆగస్టులో రోజుకు 20వేల బ్యారెళ్ల శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేయగా.. సెప్టెంబర్‌లో ఏకంగా రోజుకు 56 వేల బ్యారెళ్ల ఎగుమతులు జరిగాయి. పాక్ మిత్రదేశమైన టర్కీ తరచూ కశ్మీర్ అంశంలో పాక్‌కు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తుంటుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ బహిరంగంగా పాక్‌కు మద్దతు ప్రకటించింది. అలాంటిది ఇప్పుడా భారీగా పెట్రోలియం ఉత్పత్తులు ఎగుమతి అవుతుండటం గమనార్హం. భారత్‌లో భారీగా చమురు శుద్ధి సామర్థ్యం ఉన్న రిలయన్స్‌తోపాటు నయారా సంస్థ ఈ పరిస్థితిని అందిపుచ్చుకున్నాయి. రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటున్న ఈ సంస్థలు.. శుద్ధి చేసి తుర్కియే, బ్రెజిల్, యూఏఈ, పలు ఆఫ్రికా దేశాలకు సరఫరా చేస్తున్నాయి. మొత్తంగా ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్‌లో భారత్ నుంచి పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 14శాతం పెరిగాయి.

ప్రపంచంలో భారీగా చమురు ఉత్పత్తి చేసే దేశాల్లో రష్యా కూడా ఒకటి. అందుకు అనుగుణంగా రిఫైనరీలు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి రిఫైనరీలలో. ముడి చమురును శుద్ధి చేసి పెట్రోల్, డీజిల్, కిరోసిన్, విమాన ఇంధనం (జెట్ ఫ్యూయల్), ఇతర పెట్రోలియం ఉత్పత్తులుగా మార్చి చాలా దేశాలకు ఎగుమతి చేస్తుంటుంది. అయితే ఇటీవల ఉక్రెయిన్ పలు రష్యా రిఫైనరీలపై డ్రోన్లతో దాడులు చేసి ధ్వంసం చేయడంతో పెట్రోల్, డీజిల్ ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో, రష్యా పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకునే బ్రెజిల్, తుర్కియే, యూఏఈ, పలు ఆఫ్రికా దేశాలకు ఇబ్బంది మొదలైంది.

యూరప్ దేశాలకు భారీగా డీజిల్ ఎగుమతులు

భారత్ నుంచి యూరప్ దేశాలకు డీజిల్ ఎగుమతులు రికార్డు స్థాయిలో పెరిగాయి. సెప్టెంబర్‌లో ఈ ఎగుమతులు 97 కోట్ల బ్యారెళ్ల నుంచి కోటి 4 లక్షల బ్యారెళ్ల మధ్య ఉండవచ్చని అంచనా. రష్యా నుంచి పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా నిలిచిపోవడం, ఆయా దేశాల్లో రిఫైనరీల్లో వార్షిక మరమ్మతులతో ఉత్పత్తి తగ్గిపోవడంతో.. యూరప్ దేశాలు భారీగా డీజిల్ దిగుమతి చేసుకుంటున్నాయని రాయిటర్స్ పేర్కొంది.


జంతుబలి జరుగుతున్న దృశ్యం

పోలీసు చూస్తుండగానే జంతుబలి

- వరంగల్ జిల్లా నర్సంపేటలో ఘటన
- ఆర్డీవో ఉమారాణితో కలెక్టర్ సత్యశారద ఆరా

నర్సంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పూజ్య బాపూజీ మహాత్మాగాంధీ జయంతి నాడు జంతు బలి.. మద్యం విక్రయాలపై ఆంక్షలు అమల్లో ఉన్నాయి. గురువారం గాంధీ జయంతితోపాటు విజయ దశమి కలిసి వచ్చాయి. కానీ జంతు బలి, మద్యపానంపై నిషేధం అమల్లో ఉన్నా.. నర్సంపేటలోని వెంకటేశ్వరాలయ సమీపంలో గుమికూడిన ప్రజలను చెదరగొడుతున్న పోలీసులు చూస్తుండగానే జంతు బలి జరిగింది. వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజల్లో ఘర్షణ వాతావరణం ఏర్పడకుండా స్థానిక సీఐ సారథ్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఇలా స్థానికులను గుమి కూడకుండా అదుపు చేస్తున్న ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీనిపై నర్సంపేట ఆర్డీవో ఉమారాణితో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆరా తీశారు. అది నిజమేనని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆర్డీవో తెలిపారు.

ఉరివేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- పెదనాన్న వేధింపులు భరించలేకేనని సూసైడ్ నోట్
- కొంపల్లిలో పండుగ రోజే విషాదం.. నిందితుడి అరెస్టు

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్‌లో ఓ బాలిక దసరా పండుగ రోజే ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు పెదనాన్నే కారణం, ఆయన వేధింపులు తాళలేకే చనిపోతున్నట్లు సూసైడ్ నోట్ రాసింది. మృతురాలు 17 ఏళ్ల బాలిక సూసైడ్‌నోట్‌లోని వివరాలు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పేట్‌బషీరాబాద్‌లో నివాసం ఉంటున్న దంపతుల ఇద్దరు కూతుళ్లలో పెద్దమ్మాయి స్థానికంగా ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. బాలిక తండ్రి రవి 15నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. మరోచోట నివాసం ఉంటున్న బాలిక పెదనాన్న కొన్నాళ్లుగా బాలిక కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఓ ఫైనాన్స్ సంస్థకు చెందిన వ్యక్తులు కూడా ఇంటికొచ్చి.. బాలిక తండ్రి తమ దగ్గర కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడని, కట్టాలని వేధింపులకు గురిచేస్తున్నారు. పెదనాన్న, ఫైనాన్స్ సంస్థ నిర్వాహకుల వేధింపులతో మనస్తాపానికి గురైన బాలిక గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పెదనాన్నను కఠినంగా శిక్షించాలని సూసైడ్ నోట్‌లో రాసింది. బాలిక పెదనాన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులపైనా దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేబిస్‌తో యువకుడి మృతి

చెన్నారావుపేట, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): రేబిస్ వ్యాధితో యువకుడు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఊర్యతండాలో చోటుచేసుకుంది. ఊర్య తండాకు చెందిన గుగులోతు సునీత-భద్రు దంపతుల పెద్ద కుమారుడు రాజు కుమార్(23)ను ఆరు నెలల క్రితం కుక్క కరిచింది. అయితే ఎలాంటి చికిత్స చేయించుకోలేదు. ఈ క్రమంలో రేబిస్ వ్యాధి సోకి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం షురూ

- గోషామహల్ స్టేడియంలో దసరా రోజున పనులు ప్రారంభించిన నిర్మాణ సంస్థ 'మేఘా'
- నిర్ణీత సమయంలోగా భవనాన్ని అందుబాటులోకి తెస్తామని వెల్లడి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ స్టేడియంలో నిర్మించ తలపెట్టిన ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు దసరా రోజున ప్రారంభమయ్యాయి. ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరిలోనే శంకుస్థాపన చేశారు. అయితే, భవన నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకున్న మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) దసరా రోజున, గురువారం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. మేఘా ప్రాజెక్టుల విభాగం అధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అత్యాధునిక వసతులు కలిగి ఉండేలా ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని గోవర్ధన్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రెండు వేల పడకలతో ఆస్పత్రి

26 ఎకరాల విస్తీర్ణంలో 32 లక్షల చదరపు అడుగుల్లో ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఇందులో 22.96 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆస్పత్రి బ్లాక్, అకడమిక్ బ్లాక్, వైద్య విద్యార్థులకు వసతి గృహ బ్లాకులు, ధర్మశాల, మార్చురీ, యుటిలిటీ బిల్డింగ్, సెక్యూరిటీ భవనం, కార్ పార్కింగ్ ఉండనున్నాయి. అంతేకాక, ఆస్పత్రిలో చికిత్స పొందే రోగుల కోసం రెండు వేల పడకలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, 29 ప్రధాన, 12 చిన్న ఆపరేషన్ థియేటర్లు, హెలిప్యాడ్, రోబోటిక్ సర్జరీ థియేటర్లు, అవయవ మార్పిడి యూనిట్లు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు నిర్మించనున్నారు. ఆస్పత్రిలో నర్సింగ్, డెంటల్, ఫిజియోథెరపీ కళాశాలలను వేర్వేరుగా నిర్మించనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాస్వామిక వెలుగుబాటలు

లార్డ్ రిప్పన్ (ఆధునిక భారతీయ స్థానిక ప్రభుత్వాల పితామహుడు) నుంచి భారత రాజ్యాంగ సభ (1946) వరకు, ప్రాచీన గ్రామీణ పంచాయతీ వ్యవస్థ పునరుద్ధరణకు ఉద్దేశించిన 40వ ఆదేశిక సూత్రం నుంచి 73, 74వ రాజ్యాంగ సవరణల దాకా స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ పరిణామ చరిత్ర స్ఫూర్తిదాయకమైనది. ప్రజాస్వామిక నాగరీకంలో ప్రజలను సుశిక్షితులను చేస్తున్న ప్రాథమిక పాఠశాల స్థానిక ఎన్నికల వ్యవస్థ. తెలంగాణ రాష్ట్రం మరోసారి ఈ ఎన్నికలకు సంసిద్ధమవుతోంది. ఎస్సీ ఎస్టీ, మహిళలతో పాటు జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకూ రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించడంతో ఈ స్థానిక ఎన్నికలు మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. తొలుత పాలనా వ్యవస్థలో, దరిమిలా రాజకీయ రంగంలో కొత్త యువ నాయకత్వం ప్రభవించేందుకు ఈ ప్రజాస్వామ్య పోరు దోహదం చేయనున్నది.

సుదూర గతంలో ప్రతి గ్రామమూ ఒక గణతంత్ర రాజ్యంగా విలసిల్లుతుండేది. గ్రామస్తులు సమష్టిగా నిర్ణయాలు తీసుకునేవారు. స్థానిక పాలనకు బాధ్యత వహించే గ్రామ పెద్దలను 'గ్రామికలు'గా కౌటిల్యుని 'అర్థశాస్త్రం' పేర్కొంది. రాచరికాలు ప్రబలి, సామ్రాజ్యాలు విస్తరిల్లిన తరువాత, ముఖ్యంగా బ్రిటిష్ వలసపాలనలో ఆ గ్రామీణ అధికార వికేంద్రీకరణ వ్యవస్థ పూర్తిగా ఛిద్రమైపోయింది. 1992లో 73, 74 రాజ్యాంగ సవరణలతో స్థానిక ప్రభుత్వాలకు వినూత్న ప్రజాస్వామిక స్వరూప స్వభావాలు సమకూరాయి. అణగారిన సామాజిక వర్గాల వారు రాజకీయ అధికారంలో భాగస్వాములు అయ్యారు. మరీ ముఖ్యంగా మహిళా సాధికారితకు ఇతోధిక దోహదం చేకూరింది. పలువురు మహిళలు పంచాయత్ సభ్యులుగా ప్రారంభమై శాసనసభ, పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించి తీరాలి. 1997లో ఒడిషాలో ఒక ఆదివాసీ గ్రామ పంచాయత్ వార్డు సభ్యురాలుగా ఎన్నికైన ముర్ము ఆ రాష్ట్ర శాసనసభకు రెండుసార్లు ఎన్నికై ఆ తరువాత జార్ఖండ్ గవర్నర్‌గా పనిచేసి ఇప్పుడు భారత గణతంత్ర రాజ్య సార్వభౌమాధినేతగా ఉన్నారు. ఈ స్ఫూర్తిదాయక ఆదివాసీ విజయగాథ 73వ రాజ్యాంగ సవరణతోనే సుసాధ్యమయింది.

ఇదలా ఉంచితే ప్రభుత్వాలు ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవడం ఎంత ముఖ్యమో వాటి అమలులో చిత్తశుద్ధి పాటించడం అంతకంటే ముఖ్యం. గత సార్వత్రిక, తదనంతర అసెంబ్లీ ఎన్నికలలో నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ప్రజాస్వామ్య నైతిక సూత్రమైన ఓటు హక్కు లక్షలాది ప్రజలకు లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ ఆ విషయమై ఎన్నికల సంఘంకు వ్యతిరేకంగా పెద్ద పోరాటమే చేస్తున్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఎన్నికలలో పోటీ చేసేందుకు అనర్హులన్న నిబంధనను కొనసాగించడం ముదావహం. అయితే సర్పంచ్, ఇతర వార్డు సభ్యులను ఏకాభిప్రాయంతో ఎన్నుకోవడాన్ని నగదు బహుమానాలతో ప్రోత్సహించే పద్ధతికి స్వస్తి చెప్పితీరాలి. ఎందుకంటే అది ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలహీనపరుస్తుంది.

'ప్రతి గ్రామం స్వావలంబనతో తన వ్యవహారాలను తానే నడుపుకోగలగాలి. ప్రపంచం మొత్తం ప్రతి కూలమయినా తనను తాను సంరక్షించుకోగలగాలి' అని గాంధీజీ పంచాయత్ వ్యవస్థకు ఆశయ నిర్దేశం చేశారు. ఈ ఆశయ సాధనకు మన 11వ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం ఒక ఆచరణాత్మక మార్గాన్ని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాలకు అభివృద్ధి సామర్థ్యం కలిగించడమే ఆ నిర్మాణాత్మక బాట. ఆధునికీకరణకు ప్రగతిశీల రాజకీయాలే ప్రాతిపదిక కావడమనేది స్వతంత్ర భారతదేశ చరిత్ర విశిష్టత. ఈ దృష్ట్యా దళితులు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన వర్గాల వారికి పాలనావ్యవస్థ ల్లోనూ రాజకీయ అధికారంలోనూ గణనీయమైన భాగస్వామ్యం కల్పించేందుకు దోహదం చేస్తూ ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ ఔన్నత్యానికి వెలుగు బాటలు వేయాలి.

యుద్ధాల చీకటిలో మానవత

'ఇక యుద్ధం వద్దు, ఇంకెప్పుడూ యుద్ధం వద్దు' అని 1965లోనే పోప్ ఆరవ పాల్ ఘోషించారు. శాంతిని కోరుకునేవారు ఆయనను అభిమానించకుండా ఎలా ఉంటారు? యుద్ధాలు ఏ సమస్యనూ పరిష్కరించవు. శత్రుత్వాన్ని, విద్వేషాన్ని మాత్రమే పెంపొందిస్తాయి. 1945లో 51 దేశాలు సమున్నత ఆశయాలతో ఐక్యరాజ్యసమితిని సృష్టించాయి. అన్ని దేశాలూ శాంతి సామరస్యాలతో శాంతియుత సహజీవనం చేస్తూ సంపద్వంతం చేస్తూ తమ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తాయని ఆశించాయి. చరిత్ర చెప్పిందేమిటి? ఐక్యరాజ్యసమితి విఫలమయిందనే కాదూ? ఆ ప్రపంచ సంస్థ చూస్తుండగానే గత ఎనిమిది దశాబ్దాలలో అనేక యుద్ధాలు జరిగాయి. ప్రస్తుతం రెండు యుద్ధాలు ప్రపంచాన్ని కుదిపివేస్తున్నాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు


ఉక్రెయిన్ యుద్ధం ఫిబ్రవరి 24, 2022న ఆరంభమయింది. ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడంతో ప్రజ్వరిల్లిన ఈ యుద్ధాగ్నులు ఇప్పటికీ ఆరలేదు. ఎప్పటికి ఆరిపోతాయో తెలియదు. సోవియట్ యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ రిపబ్లిక్స్ ఉనికిలో ఉన్నప్పుడు ఉక్రెయిన్ అందులో భాగంగా ఉండేది. చాలా మంది రష్యన్లు, రష్యన్ భాష మాట్లాడే వారు ఉక్రెయిన్‌గా పిలవబడే ప్రాంతంలో నివసిస్తుండే వారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనప్పుడు ఉక్రెయిన్ ఒక సార్వభౌమిక గణతంత్ర రాజ్యంగా ప్రభవించింది. 2014–22 సంవత్సరాల మధ్య ఉక్రెయిన్ ప్రాంతాలు అయిన క్రిమియా, డొనెట్స్క్, లుహన్స్క్‌లను రష్యా ఆక్రమించుకుని బలవంతంగా తనలో కలిపివేసుకున్నది. తనను వ్యతిరేకించే సైనిక కూటమి 'నాటో' సభ్యత్వానికై ఉక్రెయిన్ దరఖాస్తు చేసుకుందని, ఉక్రెయిన్‌ను ఉపయోగించుకుని నాటో దేశాలు తనను చుట్టుముట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, తత్కారణంగా తన జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడినందునే ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవడం అనివార్యమయిందని రష్యా సమర్థించుకున్నది. ఉక్రెయిన్ ఒక సార్వభౌమిక దేశం. ఆ దేశం నాటోలో చేరినా, చేరకపోయినా స్వతంత్ర దేశంగా మనుగడ సాగించేందుకు ఆ దేశానికి సంపూర్ణ హక్కు ఉన్నది. ప్రపంచ దేశాలు ఆ హక్కును గౌరవించాలి. ఉక్రెయిన్ స్వతంత్ర రాజ్యంగా సంపూర్ణ రక్షణతో మనగలిగేందుకు ప్రపంచం హామీ పడాలి.

మూడేళ్ల క్రితం ప్రారంభమైన యుద్ధం ఉక్రెయిన్ మనుగడకు తీవ్ర హానికరంగా పరిణమించింది. సెప్టెంబర్ 10, 2025 నాటికి రష్యా దాడుల్లో ఉక్రెయిన్‌లో 14,116 మంది పౌరులు మరణించారని, 36,481 మంది క్షతగాత్రులు అయ్యారని ఆ దేశంలో ఉన్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం ప్రతినిధులు సమగ్ర సాక్ష్యాధారాలతో నమోదు చేశారు. 56 లక్షల మంది ఉక్రెయిన్ పౌరులు ఇతర దేశాలకు పరారవ్వగా మరో 37 లక్షల మంది పౌరులు దేశంలోనే నిరాశ్రయులు అయ్యారు. ఈ యుద్ధంలో ఉభయ పక్షాలలోను (రష్యా తరఫున పోరాడుతున్న కొరియా సైనికులతో సహా) మొత్తం పది లక్షల మందికి పైగా సైనికులు మరణించారు.

ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాలు వందల కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, సైనిక సామగ్రిని సరఫరా చేస్తున్నాయి (ఈ యుద్ధంలో నేరుగా పాల్గొనేందుకు అవి వెనుకాడుతున్నాయి). అయినప్పటికీ ఉక్రెయిన్ యుద్ధంలో ఓడిపోతోంది. అన్ని విధాల భారీనష్టాలు చవిచూస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి చేసి ఈ యుద్ధాన్ని నిలిపివేయగల దక్షత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఉన్నది. అయితే ట్రంప్ అందుకు సుముఖంగా లేడు. ఆత్మ రక్షణకై ఉక్రెయిన్ యుద్ధం చేస్తోంది. నైతికత, న్యాయబద్ధత ఉక్రెయిన్ పక్షానే ఉన్నాయి. అయినా నిస్సహాయంగా నలిగిపోతోంది. అమెరికా ఊగిసలాట ధోరణి, ఐక్యరాజ్యసమితి అసమర్థతకు ఉక్రెయిన్ బలవుతోంది. ఉక్రెయిన్ యుద్ధం పనికిమాలిన, అనైతిక యుద్ధమని ఒక బలమైన దేశం, పొరుగున ఉన్న ఒక బలహీన రాజ్యంపై చేస్తున్న దురాగతం మినహా మరేమీ కాదని చరిత్ర తప్పక నమోదు చేస్తుంది.

ప్రపంచాన్ని అమితంగా కలవరపరుస్తోన్న మరో యుద్ధాన్ని హమాస్ ప్రారంభించింది. పాలస్తీనాలో భాగమైన గాజా ప్రాంతాన్ని పరిపాలిస్తున్న మిలిటెంట్ గ్రూపే హమాస్. ఈ పశ్చిమాసియా ప్రాంతం ఇప్పటికే అనేక యుద్ధాలతో అతలాకుతలమైపోయింది. అక్టోబర్ 7, 2023న హమాస్ ఎలాంటి కవ్వింపు లేకుండా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇది సమర్థించరాని చర్య. హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయెలీ పౌరులు మరణించారు. మరో 251 మంది ఇప్పటికీ హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. హమాస్ దాడిపై ఇజ్రాయెల్ భీకరంగా ప్రతిస్పందించింది. ఎడతెగని, బహుముఖీనమైన దాడులు ప్రారంభించింది. గాజా నుంచి పాలస్తీనియన్లు అందరినీ గెంటివేయడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా ఉన్నది. పాలస్తీనియన్లు లేని గాజాను పూర్తిగా ఇజ్రాయెల్‌లో కలుపుకోవడమే లక్ష్యంగా ఉన్నది. ఇజ్రాయెల్ ఇప్పటికే మరో పాలస్తీనియన్ ప్రాంతమైన వెస్ట్ బ్యాంక్‌ను చాలావరకు ఆక్రమించుకుని అక్కడి జనజీవనాన్ని నియంత్రిస్తోంది.

పశ్చిమాసియాలో సుస్థిర శాంతికి ఒక పరిష్కారంగా ఉన్న రెండు దేశాల సిద్ధాంతాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 67,000 మంది మరణించారు. వారిలో అత్యధికులు మహిళలు, బాలలే. పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన మౌలిక సదుపాయాలు అన్నీ ధ్వంసమైపోయాయి. ఆహారం,



మంచినీరు, ఔషధాలు అందుబాటులో లేక పాలస్తీనియన్లు చనిపోతున్నారు. హమాస్ దాడికి ప్రతీకారంగానే తాము దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ సమర్థించుకొంటోంది. అయితే ఇది సమర్థించలేని విషయం. ఇజ్రాయెల్ దాడులు మహాభీకరంగా ఉన్నాయి. ఎడతెగకుండా సాగుతున్నాయి. పైగా ఈ దాడుల లక్ష్యం న్యాయవిరుద్ధమైనది. ఎంతమాత్రం ఆమోదయోగ్యమైనది కాదు. మాతృభూమిని కలిగి ఉండేందుకు పాలస్తీనియన్లకు హక్కు ఉన్నది.

> **నైతిక అధికారంతో సమస్యలు పరిష్కరించగల జవహర్‌లాల్ నెహ్రూ, డాగ్ హమ్మర్స్క్ జోల్డ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లాంటి సమున్నత నాయకులు ఇప్పుడు ప్రపంచానికి అవసరం. ప్రస్తుత ఐక్యరాజ్యసమితి వలే కాకుండా కొత్త అంతర్జాతీయ సంస్థలను నిర్మించుకోవల్సిన అవసరమూ నేడు ప్రపంచానికి చాలా ఉన్నది.**

గాజాలో శాంతికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 20 అంశాల 'శాంతి ప్రణాళిక' నొకదాన్ని ప్రతిపాదించారు. ఇజ్రాయెల్ డిమాండ్లను చాలావరకు ఆమోదిస్తున్నట్టు ఈ శాంతి ప్రణాళిక కనిపిస్తున్నది. నేనీ వ్యాసం రాస్తున్న సమయానికి హమాస్ ఆ శాంతి ప్రణాళికను ఆమోదిస్తున్నదీ లేనిదీ తెలియరాలేదు. అన్నీ కోల్పోయి ఆకలి దప్పులతో అలమటిస్తున్న పాలస్తీనియన్లకు శాంతిని సమకూర్చాలంటే ట్రంప్ శాంతి ప్రణాళికను ఆమోదించడం మినహా హమాస్‌కు గత్యంతరం లేదు. అయితే ట్రంప్ శాంతి ప్రణాళికను ఆమోదించడమంటే పాలస్తీనియన్ల భవిష్యత్తును బాహ్యశక్తులకు స్వాధీనం చేయడమే అవుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఇంతకూ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక ప్రకారం పాలస్తీనా 157 దేశాల గుర్తింపుతో ఒక సార్వభౌమిక దేశంగా ప్రభవించేందుకు దోహదం జరుగుతుందా లేదా అన్న విషయమై స్పష్టత లేదు. హమాస్‌ను, పాలస్తీనియన్లను ఒకటిగా చూడడం సమంజసం కాదు. ఏమైనా హమాస్ దుస్సాహసం చాలా అవమానకరంగా ముగిసిందని చెప్పక తప్పదు. అంతేకాదు, పాలస్తీనియన్ల హక్కుల అణచివేత యథావిధిగా కొనసాగుతుంది.

సరే, ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ చాలావరకు సూత్రబద్ధమైన వైఖరిని పాటిస్తూ వస్తోంది. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ప్రధాని మోదీ ప్రయత్నించారు. అయితే భారత్‌కు 1950లు, 1960ల్లో ఉన్న నైతిక అధికారం, రాజకీయ పలుకుబడి ఇప్పుడు లేవు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం విషయమై భారత్ బాగా తడబడింది. మొదటి నుంచీ పాలస్తీనాకు అన్నివిధాల మద్దతునిస్తున్న భారత్ ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపుతూ వస్తోంది. ఇది ఒక విధంగా పాలస్తీనియన్లను వంచించడమేనని చాలా మంది భావించారు. పలువురు బహిరంగంగా విమర్శించారు. రెండు దేశాల ప్రణాళిక కింద ఉనికిలో ఉండే హక్కు పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండిటికీ ఉందని భారత ప్రభుత్వం సుదీర్ఘకాలంగా వాదిస్తూ వస్తోంది. అయితే ఈ వాదనను విడనాడడం తప్పు అనే విషయాన్ని భారత్ గుర్తించి తన వైఖరిని సరిదిద్దుకునేందుకు ప్రయత్నించింది.

శక్తిమంతమైన దేశాలు, తమను వ్యతిరేకిస్తున్న బలహీన విరోధులపై ఎడతెగని వినాశనకర యుద్ధాలు చేస్తున్నాయనే సత్యాన్ని పాఠకుల దృష్టికి తీసుకు రావడమే ఈ వ్యాసం లక్ష్యం. ఉక్రెయిన్, గాజా యుద్ధాల నిష్ఫలతను కూడా ఈ వ్యాసం ఎత్తి చూపింది. ఇవి వ్యర్థ యుద్ధాలు, ఎవరికీ ఏమీ ఒరిగేదేమీ లేదు. ప్రతి దేశంలోను యుద్ధోన్మాదులు ఉన్నారు. అనేక వివాదాలకు యుద్ధమే పరిష్కారమనేది వారి ప్రగాఢ విశ్వాసం. ఈ యుద్ధోన్మాద వైఖరిని అంతర్గత విభేదాల పరిష్కారానికి కూడా వారు వర్తింపచేస్తున్నారు. దేశీయ వ్యవహారాలలో వివాదాల పరిష్కారానికి 'యుద్ధం'కు ప్రత్యామ్నాయంగా 'హింస'ను ఉపయోగించడాన్ని వారు సమర్థిస్తున్నారు. 'బలవంతులే సరైనవారు' అన్న భావాన్ని వారు అంగీకరిస్తున్నారు. ఇదెలా న్యాయం?

తమ నైతిక అధికారంతో సమస్యలు పరిష్కరించగల జవహర్‌లాల్ నెహ్రూ, డాగ్ హమ్మర్స్క్ జోల్డ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లాంటి సమున్నత నాయకులు ఇప్పుడు ప్రపంచానికి అవసరం. వినాశనకర ఘర్షణ పథం నుంచి వైదొలిగేలా కలహించుకుంటున్న దేశాలను మరింతగా ప్రభావితం చేయగల దేశాలు కలిసికట్టుగా ముందుకురావలసిన అవసరం నేడు ప్రపంచానికి ఎంతైనా ఉన్నది. ప్రస్తుత ఐక్యరాజ్య సమితి వలే కాకుండా కొత్త అంతర్జాతీయ సంస్థల అవసరం నేడు ప్రపంచానికి చాలా ఉన్నది. ప్రస్తుతానికి మాత్రం అంతా అంధకారమే, శాంతి కుసుమాల ఉదయం కనుచూపుమేరలో లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఒక 'మత్తు'కి ఇంకో 'మత్తు'.. మందు కాదు!

'ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!' అన్న జూలై 29 నాటి నా వ్యాసానికి, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' వారి సెప్టెంబరు 11 నాటి 'పాత సమాధానం" చూశాను. దానికి, నా వివరణ ఇదీ:

(1) నాది 'పాచి వాదన' అనీ, 'ఆదర్శవాద ముసుగు' అనీ, 'ఆధిపత్య భావన' అనీ, 'పిడివాదన' అనీ వేదిక వారు అన్నారు. అసువంటి మాటలతోని, బహెస్ నడ్వది! కాబట్టి, గా ముచ్చట్లు ఇడిసిపెట్టి, అసల్ నేనేమంటీ, మీరేమంటున్రూ, గా సంగతి చెప్పుకోవాలె! (2) ఒక ప్రాంతంలో ఉన్న రకరకాల అసమానతల్నీ వైరుధ్యాల్నీ ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయ తెర కప్పివేస్తుంది అనే "ఎరుక మాకు తెలియనిది కాదు" అంటున్నరు వేదిక వాండ్లు! మరి, గా 'ఎరుక'తో నుండాలన్న నాతోని కొట్లాడుడేంది? (3) 'ఎమ్మార్పీఎస్ ఉద్యమం జేస్తున్నం! బీసీ రిజర్వేషన్ల ఉద్యమం జేస్తున్నం!' అని గొప్పలు చెప్పుకుంటున్రు! మోస్ట్ బ్యాక్వార్డ్ షెడ్యూల్ కులాల ఉద్యమాన్ని ఒప్పుకుంటున్రా? అసలు వర్గీకరణనే వ్యతిరేకించే మాల అస్తిత్వవాదుల ఉద్యమం సంగతేంది? "ముస్లింలు, స్త్రీలు, ఆదివాసీలు ఎవరైనా, అందరూ అన్ని పోరాటాలనూ చేయరు" అంటున్రు మీరు. అన్ని పోరాటాలు జయ్యమని ఈడ ఎవ్వరూ అడుగుతలేరు! తాము చేసే ఉద్యమాలు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించేవి మాత్రమేననీ; భూములూ, గనులూ, ఫ్యాక్టరీలూ, రవాణా లాంటి ఉత్పత్తి సాధనాల్ని స్వాధీనం చేసుకోవాలనే దృష్టి లేకుండా, అసమాన శ్రమ విభజనని పూర్తిగా మార్చుకోవాలనే లక్ష్యం లేకుండా, చేసే యాడ్–హాక్ (తాత్కాలిక) ఉద్యమాలన్నీ, పాలకవర్గాలు ఏర్పాటు చేసిన చట్రంలో ఇరుక్కుపోవడమేననే స్పృహ లేకపోతే జరిగేదేమిటి? "గా ప్రాంతపోల్ల విగ్రహాలు, తీసెయ్యాలె! ఎన్నో సైన్మలు దీసిన మా ప్రాంతపోని ఫోటో గింత చిన్నగనా పెట్టేడిది? మా కార్మికుల శ్రమని దోచే హక్కు మా ప్రాంతపు కాంట్రాక్టర్లకె వుండాలె, గా ప్రాంతపు కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు ఎందు కీయాలె?" అంటే, అది తెలంగాణలోని శ్రామిక ప్రజల ప్రయోజనాలను ఏ రకంగా పరిరక్షిస్తుంది?



> **"తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జనసమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!**

(4) "మేం ప్రాంత అసమానత గురించి చేస్తున్నం. వర్గ ప్రాతిపదికన చేసే పోరాటానికి ఇవేవీ ఆటంకం కాదు" అని అంటున్రు వేదిక సాలు! నేనన్నదేంది? ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, అది ఆంధ్రాగానీ, తెలంగాన గానీ, రాయలసీమ గానీ, గా ప్రాంతం అంతా ఒక్క తీరుగ లేదు. గా ప్రాంతాలల్ల, అమీరులున్నరు, గరీబులున్నరు. దొరలున్నరు, కూలోల్లున్నరు. మురికి అంటని కొలువులు జేసెటోల్లున్నరు, మురికి, సఫాయి పనులు జేసెటోల్లున్నరు. అందర్నీ, ఒక్కతీరుగనే జూస్తే, గది వర్గపోరాటానికి ఆటంకం కాదా? (5) "బి.ఆర్. బాపూజీ బాధ ఏమిటి?... తమ ప్రాంత ఆధిపత్యం మీద దృష్టి తగ్గుతది అనే" అంటున్నరు వేదిక సాలు! ఇగో సాలూ! ఈ బాపూజీ అనేటోనికి ఒక ప్రాంతమంటూ లేదు. వాడు ఆంధ్రోడూ కాదూ, తెలంగానోడూ కాదు! వాడు, కమ్యూనిస్టోడు! వాని భావజాలం 'శ్రామికవర్గ అంతర్జాతీయత'! అంటే, అన్ని దేశాల కార్మికులూ ఒక్కటిగావాలె! (6) "అంబేడ్కర్ తదితరులు ప్రాంతాలకతీతంగా దేశం మొత్తానికీ ఐకన్స్" అని అంటున్నరు వేదిక వాండ్లు. అసలు గీ 'ఐకాన్స్' అనే ముచ్చటెక్కడికెల్లొచ్చింది? మనుషుల్ని 'ఐకన్స్' అనీ, 'వైతాళికులు' అనీ, సమానత్వ సూత్రానికి విరుద్ధంగా, నిలబెట్టడమే అసలైన 'ఆధిపత్య భావన!' (7) విగ్రహ తరలింపు ఉద్యమం ద్వారా, తెలంగాణను పరిరక్షించాలనుకుంటున్న వేదిక వారు, "మీ కాసు బ్రహ్మానందరెడ్డి, మీ ఎన్టీఆర్, మీ రాజశేఖరరెడ్డి, మా మర్రి చెన్నారెడ్డి, మా పి.వి. నరసింహారావు, మా అంజయ్య..!" అనుకుంట నా మీద కోపమైతాండ్రు. ఓ సాలూ! విగ్రహాలనేవీ సమానత్వ సూత్రానికి విరుద్ధమనీ, హేతువిరుద్ధమనీ, ఒక కళా రూపంగా మాత్రమే వాటిని చూడాలనీ, ఎవరి విగ్రహాన్నయినా చేసినా, చేయించినా, దాన్ని ప్రకృతి వైపరీత్యాలనించీ, సామాజిక శత్రువులనించీ కాపాడుకోగలిగేలా, ఏర్పాట్లు చేసుకోవాలనీ చెపితే, 'గది మీ ప్రాంతపోని విగ్రహం! గిది మా ప్రాంతపోనిది!'– అని, గీ మాటలెందుకు జప్పుండ్రు!

(8) రాజశేఖర్‌రెడ్డి పేరెత్తిండ్రుగదా మీరు? మీకు యాదికున్నదో లేదో, ఒక ముచ్చట జప్తా ఇనుండ్రి! 2009లో తెలంగాణలో ఎన్నికల ప్రచారం అయినంక, రాయలసీమల ప్రచారం మొదలు బెట్టేతప్పుడు, "ప్రత్యేక తెలంగాణ వస్తే, రాయలసీమ వాళ్ళు విదేశీయులుగా బతకవలిసి వస్తుందని" అన్నడు. అప్పుడు, నేను, గిదే బాపూజీని, 'ఆధిపత్య భావన' గలిగినోన్ని, గిట్ల రాసిన: "తన పాలనలో, సెజ్‌ల యజమానులకు ఆర్థికంగా, రాజకీయంగా, దళారీగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నేతలలో అగ్రగణ్యుడైన ముఖ్యమంత్రి, ప్రత్యేక తెలంగాణ భూతాన్ని చూపడం మాత్రం, ఒక దళారీ దేశభక్తిని ప్రదర్శించడం లాంటిదే!" (ఆంధ్రజ్యోతి, 19-4-2009). (9) "ఆధిపత్య అహంకారానికి 'అస్తిత్వం మత్తే' సరైన జవాబు" అని వేదిక వాండ్ల ఆత్మ సమర్థన! కానీ, ఒక మత్తుకి ఇంకో మత్తు.. మందు కాదు! అస్తిత్వాలలో ఉప అస్తిత్వాలూ, ఉప–ఉప అస్తిత్వాలూ ఉన్నాయనీ, వాటి మధ్య అసమానతల్ని ఈ శ్రమ దోపిడీ సమాజం ప్రోత్సహిస్తుందనీ గ్రహింపు లేకపోతే ఎట్ల? (10) "తెలంగాణ స్ఫూర్తిదాతల విగ్రహాల లిస్ట్ కుల మత, లింగ భేదాల్ని బట్టి నిష్పత్తితో సహా సిద్ధంగా ఉంది" అని, ఐలాన్ జేసిండ్రు వేదిక సాలు! ముందు, వర్గీకరణలోనూ, బీసీ రిజర్వేషన్లలోనూ నిష్పత్తులు తేలాలి గదా? అప్పుడే లిస్టు ఎట్ల సిద్ధంగున్నది? (11) "తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జన సమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!

• బి.ఆర్. బాపూజీ

(చర్చ ముగిసింది)

మెరుగుపడని ఉపాధ్యాయుల హోదా

ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలను, వారి హోదా పెంచడానికి 145 అంశాలతో, కొన్ని నిర్దిష్టమైన సిఫార్సులతో 1966లో 'స్టేటస్ ఆఫ్ ద టీచర్స్' అనే విధానపత్రాన్ని పారిస్‌లో జరిగిన సమావేశంలో యునెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థ రూపొందించాయి. ఈ పత్రాన్ని ఆమోదించిన అక్టోబర్ 5వ తేదీని ఐక్యరాజ్యసమితి 'ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం'గా ప్రకటించింది. అయితే ఉపాధ్యాయుల అంతస్తు సాధనకు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వారు ఉద్యమించాల్సి వస్తోంది. మానవాభివృద్ధిలో ఉపాధ్యాయులది ప్రముఖ పాత్ర. విద్యా సంబంధ లక్ష్యాలు, ప్రయోజనాల సాధనకు, ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు, గౌరవం తెచ్చేందుకు ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

విద్యా రంగానికి, ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన నియామకాలు, ఎంపిక, శిక్షణ, వృత్తి సంబంధమైన ప్రమాణాలు, వృత్తి భద్రత, హక్కులు, బాధ్యతలు, వృత్తిపరమైన స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు పారిస్ సభ సిఫార్సులలో పొందుపరిచారు. వీటితో పాటు వేతనాలు, సెలవులు, స్టడీ లీవు, పనివేళలు, పని పరిస్థితులు, బోధనోపకరణాలు, తరగతి పరిమితి, గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధ్యాయుల స్థితిగతులు, మహిళా ఉపాధ్యాయుల పరిస్థితులు, వైద్య సౌకర్యాలు, పెన్షన్‌కు సంబంధించిన అంశాలు వగైరాలు కూడా అందులో ఉన్నాయి. మూడు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో విద్య వాణిజ్యీకరణ, ప్రైవేటీకరణ పెరుగుతోంది. విద్యకు కేటాయించే నిధుల పరిమాణం తగ్గిపోతోంది. ప్రభుత్వ విద్యారంగానికి తగ్గిపోతున్న నిధులు, విద్యా ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు పెంచాలని ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఉపాధ్యాయులు బోధన వదిలి ఉద్యమించాల్సి వస్తోంది.

ఉపాధ్యాయుని అంతస్తుకు సంబంధించిన ఈ సిఫార్సుల పట్ల చట్టరీత్యా ప్రభుత్వాలు కట్టుబడిలేవు. అయినా అవి ఆయా దేశాలపై చెప్పుకోదగ్గ నైతిక రాజకీయ ఒత్తిడిని కలిగిస్తాయి. పారిస్ సభ సిఫార్సులు అమలు జరిపి ఉంటే అనేక దేశాల్లో విద్యారంగం పరిస్థితి మెరుగై ఉండేది. వీటి అమలుకు అంతర్జాతీయ ఉపాధ్యాయ ఉద్యమం, జాతీయ ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆయా ప్రభుత్వాలపై తగిన ఒత్తిడి తేలేదు. ప్రపంచవ్యాప్తంగా 9.4 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 2030 వరకు ప్రపంచ విద్యా అవసరాలు తీరాలంటే, అందరికీ విద్య అందించాలంటే ఇంకా 4.4 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం. దేశంలో ఇంకా 10 లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉందని నీతి ఆయోగ్ నివేదిక చెప్తోంది. 'స్టేటస్ ఆఫ్ టీచర్స్' విధానపత్రం ఆమోదం పొందిన 60 సంవత్సరాలకు కూడా ఉపాధ్యాయుల పరిస్థితులు హీనస్థితిలో ఉన్నాయని, అధిక వేతనాలు ఇచ్చే ఉద్యోగాలకు ఉపాధ్యాయులు వెళ్లిపోతున్నారని ఐఎల్ఓ నివేదిక చెప్తోంది. ఈ పరిస్థితుల్లో యువత ఉపాధ్యాయ వృత్తి స్వీకరించడానికి స్టేటస్ ఆఫ్ ద టీచర్స్ పత్రంలో సూచించిన విధంగా ఉపాధ్యాయుల అంతస్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. అదే ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు గురువులకు ఇచ్చే గౌరవం.

– కె. వేణుగోపాల్, విద్యారంగ విశ్లేషకులు

(రేపు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం)

అయోమయం అమెరికన్ జాబ్ మార్కెట్!

ఇతర దేశాలకు చెందిన దిగ్గజ టెక్ కంపెనీలు అమెరికాలో వివిధ సంస్థల ప్రాజెక్టులను చేపడుతుంటాయి. ఆ కంపెనీల ప్రణాళికలను బట్టి నియామకాలు, తొలగింపులు చేపడతాయి. అప్పటిదాకా ఆ ప్రాజెక్టుల్లో ఉండే అమెరికా పౌరులు కూడా కొన్ని సందర్భాల్లో ఉద్యోగాలు కోల్పోవడం జరుగుతూ ఉంటుంది. అమెరికాలోని ఐటీ రంగం మీద విదేశీ టెక్ కంపెనీల గుత్తాధిపత్యం, దరిమిలా అమెరికన్ యువత అవకాశాలు కోల్పోతూ ఉండటం ట్రంప్‌నకు ఆగ్రహం కలిగించినట్లు ప్రచారం అవుతోంది. ఆయన తాజా నిర్ణయాల్లో అమెరికాయేతర కంపెనీల మీద ప్రతీకారేచ్ఛ గోచరించడానికి కారణం ఇదే.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఇవాళ్టి దాకా స్థిరంగా ఉన్న సమస్య అమెరికాలోని జాబ్ మార్కెట్! నిజానికి ఈ సమస్య రోజురోజుకూ కొండలా పెరిగిపోతున్నది. సాధారణంగా జాబ్ మార్కెట్ అంటే– కొత్తవారికి దక్కే ఉద్యోగావకాశాల గురించేనని అనుకుంటాం. కానీ ఇప్పుడు అమెరికాలో సీనియర్లకు కూడా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వారి మెడపై కూడా కత్తి వేలాడుతోంది. పెద్ద కంపెనీలు ఎంతో కాలంగా సంస్థలోనే కొనసాగుతున్న, కీలక స్థానాలకు చేరుకున్న ఉద్యోగులను కూడా నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. ఇరవై–పాతికేళ్ల అనుభవం ఉన్నవారు కూడా హఠాత్తుగా ఉద్యోగాలు కోల్పోతున్నారు. కొన్ని సంస్థల్లో డైరక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ల స్థాయికి చేరుకున్న వారి పరిస్థితి కూడా కుదురుగా లేదు. ఏ క్షణాన్నయినా ఉద్యోగం పోవచ్చునన్న భయం ప్రతి ఒక్కరినీ వెన్నాడుతోంది. ఒక సీనియర్‌ను ఉద్యోగం నుంచి తప్పిస్తే, అదే వేతనానికి ముగ్గురు నలుగురు ఫ్రెషర్స్‌ను తీసుకోవచ్చుననే సంస్థల ఆలోచనా సరళి, పర్యవేక్షక స్థాయి ఉద్యోగాల అవసరం అంతకంతకూ తగ్గుతుండడం ఇందుకు మరోకారణం.

ఉద్యోగాలు కోల్పోతున్న సీనియర్లకు కొత్త ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోంది. ఒక ఉద్యోగంలో సీనియారిటీ గడించడం అంటే– అక్కడ అవసరమైన మూస పనికి అలవాటు పడి ఉండటం. అలాంటి వారికి ఉద్యోగం పోయి జాబ్ ప్రొఫైల్ మారితే అందుకు తగినట్టు ఎడ్జస్ట్ కావటం సులువు కాదు. ఐటీ రంగంలో రోజు రోజుకూ మారే సాంకేతికతకు అప్‌డేట్ కానివారికి మళ్ళీ ఉద్యోగం దొరకడం మరీ కష్టం అవుతున్నది. చాలా కాలం కిందటే అమెరికాలో స్థిరపడిన వారి పరిస్థితి దయనీయం. వారు ఉద్యోగం పోగానే ఖాళీగా ఉండలేక ఏదైనా వ్యాపారంలోకి ప్రవేశించి అక్కడ అనుభవం లేక చేతులు కాల్చుకుంటున్నారు. అమెరికాలో వ్యాపారాల పరిస్థితి సైతం సజావుగా లేకపోవడం మరో సమస్య.


సాధారణంగా ఐటీ ఉద్యోగులు తరచుగా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారుతూ ఉంటారు. ఇలా మారడం వలన త్వరత్వరగా వేతనాల మెట్లు ఎక్కుతూ వెళ్లవచ్చునని భావిస్తారు. ఈ పోకడను జాబ్ హాపింగ్ (Job hopping) అంటారు. ప్రస్తుతం ఉన్న వాతావరణంలో ఎవ్వరూ ఈ ఆలోచనను దరిదాపులకు రానివ్వటం లేదు. ఉన్న ఉద్యోగం వదిలేస్తే మరొకటి దొరకబుచ్చుకోవడం సాధ్యం కాదనే భయం వారిని నిలువరిస్తున్నది. ఉద్యోగాలు ఇప్పించే కన్సల్టెన్సీల స్థితి కూడా కష్టంగా ఉన్నది. పేరోల్స్ రన్ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

> **అమెరికాలో ఉద్యోగ సంక్షోభం ఆ దేశానికే పరిమితం కాదు. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల మీద ఉంటుంది.**



ఎన్నారైలకు సంబంధించినంత వరకు, అమెరికాలో ఉద్యోగ సంక్షోభం ఈ దేశానికే పరిమితం కాబోదు. ఎన్నారై తెలుగువారి సంఖ్య అమెరికాలో గణనీయంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల మీద కూడా పడుతుంది. ట్రంప్ విధించిన సుంకాలు, ఆయన పరిపాలన తీరు భారతదేశం నుంచి జరిగే అన్ని రకాల ఎగుమతులపై ప్రభావం చూపించడం సహజం. వజ్రాలు, వస్త్రాలు, ఫార్మా, ఆంధ్రప్రదేశ్ విషయంలో రొయ్యల ఎగుమతులపై సుంకాల ప్రభావం కనిపిస్తూనే ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా– అమెరికన్ జాబ్ మార్కెట్ దెబ్బతినడం వల్ల ఎన్నారైల నిధుల వరద ఇండియాకి తగ్గి రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనే ప్రమాదం అధికం. అమెరికాలో స్థిరపడిన తెలుగువారు తమ మిగులు ఆర్జనతో స్వంత రాష్ట్రాల్లో ఆస్తుల కొనుగోలుకు మొగ్గు చూపుతారు. ఎక్కువమంది హైదరాబాదులో ఒక మంచి గేటెడ్ కమ్యూనిటీలో విల్లా కొని తల్లిదండ్రులను అక్కడ ఉంచాలని అనుకుంటారు. అలాగే తాము ఏడాదిలో ఒకసారి వచ్చి గడపడానికి హైదరాబాదు గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకుంటారు. ఆ మాటకొస్తే ఎన్నారై కొనుగోలుదారుల్ని లక్ష్యంగా పెట్టుకునే వెలిసిన వెంచర్లు హైదరాబాదు శివార్లలో అనేకం. ఇప్పుడు ఎన్నారైలు అమెరికా జాబ్ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా స్వదేశంలో పెట్టుబడులకు ధైర్యం చేయలేకపోతున్నారు. వీసా ఫీజుల పెంపు వంటి నిర్ణయాల వల్ల భారతీయ సంస్థలకు కొత్తగా భారీ ఎదురుదెబ్బ తగిలిందని అనుకోనక్కరలేదు. కోవిడ్ అనంతర పరిణామాల నుంచి అమెరికన్ మార్కెట్ పెద్దగా కోలుకున్నది లేదు. పాతవారి తొలగింపులు, కొత్తవారికి ఉద్యోగాలు లేని స్థితి ఇప్పటికే ఉంది. అయితే, ఇప్పటివరకూ పెద్ద కంపెనీలు తమకు ప్రాజెక్టులు వచ్చినప్పుడు అప్పటికప్పుడు ఉద్యోగుల వెతుకులాట అవసరం లేకుండా, ముందుగానే హెచ్1బి వీసాలు ప్రాసెస్ చేయించి సిద్ధంగా ఉంచుకొనేవి. వీసా ఫీజుల పెంపు నిర్ణయం ఈ పద్ధతిని దెబ్బ తీస్తోంది. వీసా, వేతనం, లాటరీ మధ్య లింకుపెట్టిన ట్రంప్ చర్యలు చిన్న కంపెనీలకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలు ఎప్పటికప్పుడు మారిపోతూండటం కూడా ఈ రంగంలో అనిశ్చితికి, గందరగోళానికి కారణమవుతోంది. ప్రశాంతత ఎప్పటికి సాధ్యమో చెప్పలేని స్థితి.

■ కృష్ణమోహన్ దాసరి
పాత్రికేయుడు, డల్లాస్



శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.1 కనిష్ఠం 22.1



నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● మంత్రి పొన్నం.. ఫలక్‌నుమాలో ఆర్వోబీ ప్రారంభం

6

సెల్‌ఫోన్ చోరీ.. రూ.1.95 లక్షలు కాజేత

● ముగ్గురి అరెస్ట్

6



అక్రమంగా వచ్చి డ్రగ్స్ దందా

● నైజీరియన్‌ను డిపోర్ట్ చేసిన పోలీసులు

6



ఖైదీలు జీవితాలను మెరుగుపర్చుకోవాలి

● జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రా

6

దక్షిణమధ్య రైల్వేకు రూ. 10,143 కోట్ల ఆదాయం

6

రోడ్ల విస్తరణ ఎప్పుడు?

సైబరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రం

వర్షాలు కురిస్తే మరింత దుర్భరం

అధికారులు సమన్వయ సమావేశాలకే పరిమితం

పోలీసుల సూచనలు బుట్టదాఖలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐటీ హబ్‌గా మారిన సైబరాబాద్ ప్రాంతంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతోంది. సుమారు 15 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇందులో అత్యధికంగా ఐటీ ఉద్యోగులు ఉంటున్నారు. రద్దీ సమయాల్లో రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాధారణ ప్రజలు సైతం గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుని నరకం అనుభవిస్తున్నారు. దీనిపై దృష్టి సారించాల్సిన పాలక యంత్రాంగం సమన్వయ సమావేశాలకు మాత్రమే పరిమితమవుతోంది. భౌతికంగా ఎలాంటి మార్పులూ చేపట్టడం లేదు. రోడ్ల విస్తరణ, లింకు రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), టీజీఐఐసీ అధికారులకు ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు లేఖలు రాసినా స్పందించలేదు. పలు నివేదికలు, ప్రతిపాదనలు పంపించినప్పటికీ, సంబంధిత శాఖల అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు. మొక్కుబడిగా సమన్వయ సమావేశాలు జరుగుతున్నా, అందులో వచ్చిన నిర్ణయాలు కార్యరూపం దాల్చడం లేదు. దీంతో, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యమయ్యాయి. వర్షాల సమయంలో రోడ్లన్నీ జలమయమై వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

సగటు వేగం 10-15 కి.మీలే!

సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు డేటా ప్రకారం, హైటెక్ సిటీ మెయిన్ రోడ్‌లోనే రోజుకు 1.5 లక్షల వాహనాలు వెళ్తున్నాయి. లెమన్ ట్రీ నుంచి ట్రైడెంట్ వరకు కేవలం కిలోమీటరు పొడవున్న ఈ రోడ్డు, పీక్ అవర్స్‌లో (ఉదా: ఉదయం 8 గంటలకు) ఒకే దిశలో 7వేలకు పైగా వాహనాలతో రద్దీగా ఉంటోంది. ఫలితంగా, సగటు వేగం 10-15 కి.మీ./గం.కు పడిపోతూ, 20-30 నిమిషాలు వేచి ఉండాల్సి వస్తోంది. ఐకియా నుంచి జేఎన్‌టీయూ మార్గంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. రహేజా మైండ్‌స్పేస్, నాలెడ్జ్ సిటీ వంటి టెక్ పార్కులకు వెళ్లే వేలాది మంది ఐటీ ఉద్యోగులు ఈ రోడ్లపైనే ఆధారపడుతున్నారు.



ట్రాఫిక్ జాం (ఫైల్)

ఉదయం, సాయంత్రం వేళల్లో..

హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ తీవ్రంగా ఉంటోంది. సమయానికి ఆఫీసుకు చేరుకోలేకపోవడం, కుటుంబానికి సమయం కేటాయించలేకపోవడం వంటి వ్యక్తిగత సమస్యలతో పాటు, సంస్థలకు సంబంధించిన ఉత్పాదకతపై కూడా ఈ ప్రభావం పడుతోంది. శరవేగంగా

మిగతా 6వ పేజీలో..



దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

12 క్రేన్లు.. 1800 విగ్రహాలు

● సాగర్‌లో దుర్గామాత నిమజ్జనాల సందడి

ఖైరతాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దుర్గామాత విగ్రహాల నిమజ్జనాలతో నెక్లెస్ రోడ్డు సందడిగా మారింది. దసరా రోజున ఊరేగింపుగా వచ్చిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనాలు శుక్రవారం మధ్యాహ్నం వరకు సాగాయి. దీంతో నెక్లెస్ రోడ్డు (పీవీ మార్గం) కిక్కిరిసి కనిపించింది. పీపుల్స్ ప్లాజాలో 6, బేబీ పాండ్స్‌లలో 4, మరోచోట 2 మొత్తం 12 క్రేన్ల తో పాటు అదనంగా మరో క్రేన్‌ను అందుబాటులో ఉంచి అధికారులు నిమజ్జనాలు కొనసాగించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు 1800 దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశామని, వీటికి ఇళ్లలో పూజలు అందుకున్న చిన్న విగ్రహాలు అదనమని లేక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టి తెలిపారు. కాగా, కోర్టు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ మార్గంలో నిమజ్జనాలు చేయడం లేదు.



సాగర్‌లో దుర్గామాత నిమజ్జనం





ఐడీఎల్ చెరువు వద్ద సందడి





అలయ్-బలయ్.. ధూం-ధాం





ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమం ధూం ధాంగా సాగింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయ నృత్యాలు, కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపదం, సాహిత్యం, బతుకమ్మ పాటలు, బుర్రకథలు ఆలపించి ఆడిపాడారు. కళాకారులతో కలిసి రాజకీయ నాయకులు కూడా సందడి చేశారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఫలితాలు సరే.. పర్మిషన్ ఎప్పుడిస్తారు.?

● ప్రాజెక్టుల సమర్పణకు జేఎన్‌టీయూ విద్యార్థుల ఇబ్బందులు

● రెండు నెలలుగా పరీక్షల విభాగం చుట్టూ ప్రదక్షిణలు




జేఎన్‌టీయూ పరీక్షల విభాగం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరీక్షల విభాగం విద్యార్థుల సహనానికి పరీక్ష పెడుతోంది. సకాలంలో ఫలితాలు ఇవ్వలేకపోవడం, ఇచ్చిన ఫలితాల మేరకు ప్రాజెక్టు అనుమతులను మంజూరు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. జేఎన్‌టీయూ అఫిలియేటెడ్ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సులు చదివి, కొన్ని సబ్జెక్టులను సకాలంలో పూర్తి చేయలేక పోయిన వారి కోసం గత ఏప్రిల్‌లో వన్‌టైమ్ చాన్స్ నోటిఫికేషన్‌ను పరీక్షల విభాగం విడుదల చేసింది. మే/జూన్ నెలలో సుమారు 5వేలమంది అభ్యర్థులకు 20వేలకు పైగా సబ్జెక్టు పరీక్షలు నిర్వహించిన అధికారులు, పరీక్ష ఫలితాలను రెండు నెలల తర్వాత ఆగస్టులో విడుదల చేశారు. అయితే, పాసైన అభ్యర్థులు తమ ప్రాజెక్టులను సమర్పించేందుకు అనుమతి ఇవ్వడంలో పరీక్షల విభాగం నిర్లక్ష్యం మరోమారు స్పష్టంగా కనిపిస్తోంది. వన్‌టైమ్ చాన్స్ పరీక్షల్లో సుమారు 2,500మంది అభ్యర్థులు 7,478 సబ్జెక్టు పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడంతో, వందలాది మంది ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ అభ్యర్థులు తమ ప్రాజెక్టుల సమర్పణకు అర్హత సాధించారు.

నెలల తరబడి ఎందుకీ నిరీక్షణ?

పరీక్షలు రాశాక ఫలితాల కోసం, ఫలితాలు వచ్చాక ప్రాజెక్టు అనుమతుల కోసం దాదాపు 4నెలలుగా వన్‌టైమ్ చాన్స్ అభ్యర్థులకు ఎదురు చూపులు తప్పడం లేదు. దేశీయంగా, అంతర్జాతీయంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు తమ ప్రాజెక్టులను సమర్పించి ఎప్పుడెప్పుడు డిగ్రీ పట్టాలను పొందుదామా అని ఆరాటపడుతుండగా, వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని విద్యార్థులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.




ప్రదర్శనకు ఉంచిన చరకాలు, గాంధీ విగ్రహాలు

5,156 గాంధీ విగ్రహాలు 156 చరకాల ప్రదర్శన

వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి

బర్కత్‌పుర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 5,156 గాంధీ విగ్రహాలు.. 156 చరకాల ప్రదర్శన వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. గాంధీ జీవితంలో ముఖ్య ఘట్టాల చిత్ర ప్రదర్శన, గాంధీ పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా, మల్కంబ్ ప్రదర్శన నిర్వహించారు. విజేతలైన 24 మంది ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు బహుమతి అందించారు. గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా గాంధీ సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాంధీ బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. హింస లేని సమాజం నిర్మించడమే గాంధీకి అసలైన నివాళి అని వెల్లడించారు.



సూర్యాస్తమయం.. సువర్ణ సుందరం

సూర్యోదయం సమయాన సచివాలయ పరిసరాలు శుక్రవారం సాయంత్రం ఇలా సువర్ణశోభితంగా కనువిందు చేశాయి. సందర్శకులకు కనువిందు కలిగించాయి.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కొంపల్లిలో..

చెడుపై మంచి విజయం.. రావణదహనం

దసరా వేడుకలు నగరంలో ఘనంగా ముగిశాయి. పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం జెమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. చెడుపై మంచి విజయానికి సూచికగా రావణ దహన కార్యక్రమాలు నిర్వహించారు. - కుత్బుల్లాపూర్ (ఆంధ్రజ్యోతి)

చేపలు చనిపోతున్నాయ్

● దుర్గంచెరువులో మళ్లీ అదే తీరు

● వర్షాలకు చేరుతున్న కలుషిత జలాలే కారణమా.?

హైదరాబాద్ సిటీ, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): దుర్గం చెరువులో చేపలు మళ్లీ చనిపోతున్నాయి. వారం రోజులుగా దుర్గం చెరువులోని నీళ్లపై చనిపోయిన చేపలు తేలియాడుతున్నాయి. అవి ఒడ్డుకు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెరువులోకి కలుషిత జలాలు, సీవరేజ్ వ్యర్థాలు చేరకుండా వాటర్‌బోర్డు అధికారులు కట్టడి చేశారు. ఎస్టీపీల నిర్మించి శుద్ధి చేసిన జలాలే దుర్గం చెరువులో చేరేవిధంగా చర్యలు చేపట్టారు. అయినా ఏడాదిన్నర నెలల క్రితం దుర్గం చెరువులో చేపలు చనిపోవడంతో మురుగు వ్యర్థాలు చేరకుండా కట్టడి చేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ ప్రాంతాల నుంచి దుర్గం చెరువులోకి పెద్దఎత్తున వరద చేరింది. సాధారణంగా కొత్త నీరు చేరితే దుర్గంచెరువులో ఆక్సిజన్ స్థాయిలు మరింత పెరుగుతాయి. చెరువుల్లోకి కొత్త నీరు రావడం చేపల వృద్ధికి దోహదపడాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా చెరువుల్లోని చేపలు చనిపోతున్నాయి.

కలుషిత జలాలే కారణమా.?

మురుగు ప్రవహం అధికంగా వచ్చినా దుర్గంచెరువులో చేరకుండా 2016లో చెరువు చుట్టూ ట్రంక్‌లైన్ నిర్మించారు. చెరువు చుట్టుపక్కల భారీగా నిర్మించిన అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, ఆస్పత్రుల నుంచి విపరీతమైన మురుగు వస్తుండగా అది చెరువులో చేరకుండా పూర్తిగా మళ్లించారు. అప్పటికి ఉన్న ఎస్టీపీ సామర్థ్యం సరిపోకపోవడంతో మరో ఎస్టీపీని సైతం నిర్మించి ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో దుర్గంచెరువులోని నీరంతా మెరుగుపడడంతో చేపలు వదిలి పెంచుతున్నారు. అయితే ఏడాదిన్నర క్రితం నుంచి దుర్గం చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీనిపై హైకోర్టు కమిటీ వేసిన నేపథ్యంలో గతంలోనే వివిధ శాఖల అధికారులు జలాలు కలుషితమవ్వడంపై ఆరా తీశారు. కారణాలను కోర్టుకు నివేదించారు. ఇటీవల మళ్లీ చేపలు చనిపోతున్నాయి. వర్షాలకు వివిధ ప్రాంతాల నుంచి మురుగు వ్యర్థాలన్నీ ఓవర్‌ఫ్లోతో దుర్గం చెరువులో చేరడమే ఇందుకు కారణమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



దుర్గంచెరువులో చనిపోయిన చేపలు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

● ఎంజీబీఎస్, జేబీఎస్‌లను పరిశీలించిన టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి

హైదరాబాద్ సిటీ/చాదర్‌ఘాట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన విషయంలో అన్ని విభాగాలూ సమన్వయంతో పనిచేయాలని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో ప్రధాన బస్ స్టేషన్లు ఎంజీబీఎస్, జేబీఎస్‌లను నాగిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. బస్టాండ్లలో శుభ్రత, తాగునీటి సౌకర్యం, కుర్చీలు, మరుగుదొడ్లు, భద్రతా ఏర్పాటు అంశాలపై సమీక్షించారు. దూరప్రయాణాలు సాగించే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన వాతవరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బస్‌స్టేషన్ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ స్టేషన్లు, లాజిస్టిక్స్ (కార్గో) కౌంటర్లను పరిశీలించారు. జిల్లాలకు వెళ్లే సర్వీసుల్లో ఎక్కి వాటిలో శుభ్రత, సీటింగ్ సౌకర్యాలు, సాంకేతిక పరిస్థితులను సమీక్షించారు. ప్రయాణికులతో మాట్లాడి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈడీలు మునిశేఖర్, వెంకన్న, ఖుస్రోషా ఖాన్, సీటీఎం కమర్షియల్ శ్రీధర్, రంగారెడ్డి ఆర్ఎం. శ్రీలతలు పాల్గొన్నారు.



జిల్లా బస్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి

3 నెలల్లో 275 బస్సులు

గ్రేటర్‌జోన్‌లో ఈ డిసెంబర్ నాటికి 3 బస్ డిపోలలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి తెచ్చేలా ఆర్టీసీ ప్రణాళికలు రచించింది. మూడు, నాలుగు నెలల్లో విడతల వారీగా గ్రేటర్‌లో 275 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపైకి తీసుకురానుంది. ఈమేరకు రాణిగంజ్, పటాన్‌చెరు, కూకట్‌పల్లి డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ప్రారంభించాలని భావిస్తోంది. ఇప్పటికే కంటోన్మెంట్, మియాపూర్, హెచ్‌సీయూ, జేబీఎస్, ఎంజీబీఎస్, హయత్‌నగర్-2, బీహెచ్ఈఎల్ డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి తెచ్చిన ఆర్టీసీ ఈ ఏడాది చివరి నాటికి మరో మూడు అందుబాటులోకి తెచ్చేదిశగా చర్యలు చేపడుతోంది.

ఖైదీలు జీవితాలను మెరుగుపర్చుకోవాలి

జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రా

సైదాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీజీ సూచించిన శాంతి, అహింసా మార్గాలతో ఖైదీలు మానసిక పరివర్తనతో తమ జీవితాలను మెరుగుపర్చుకోవాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యామిశ్రా, సూచించారు. గాంధీ జయంతి సందర్భంగా చంచల్‌గూడ జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైలు.. మార్పు, సంస్కరణ, పునరావాస కేంద్రంగా మారాలన్నారు. ఖైదీలకు సమస్యలు ఎదురైతే జైలు అధికారులు లేదా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. జైలులో త్వరలో మంచాహే గీత్ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా, చిత్రంలో డీఐజీ శ్రీనివాస్, సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్

డిఫెన్స్ టెక్నాలజీలో మైనర్ డిగ్రీ నమూనా పాఠ్యాంశాలు

అల్వాల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగంలో దేశీయ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని సృష్టించడానికి డిఫెన్స్ టెక్నాలజీలో మైనర్ డిగ్రీ కోసం ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నమూనా పాఠ్యాంశాలను ప్రారంభించింది. ఈ పాఠ్యాంశాలను ఏఐసీటీఈ చైర్మన్ టీజీ. సీతారాం, కార్యదర్శి శ్యామారథ్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పాఠ్యాంశ కమిటీ చైర్మన్ జి. సతీష్‌రెడ్డి, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్(ఎస్ఐడీఎం) అధ్యక్షుడు రాజిందర్ సింగ్ భాటియా, సీనియర్ అధికారులు, రక్షణరంగ ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. సీతారాం మాట్లాడుతూ విద్యార్థులకు ఏరోనాటికల్, ఆయుధ వ్యవస్థలు, సాంకేతికతలు, సైబర్ భద్రత వంటి అంశాల్లో ప్రత్యేక జ్ఞానాన్ని అందించడానికి ఈ పాఠ్యాంశాలు రూపొందించామని తెలిపారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సాయుధ దళాలు, పరిశ్రమలు, డీఆర్‌డీవో, విద్యాసంస్థలకు చెందిన వాటాదారులతో విస్తృత చర్చల అనంతరం పాఠ్యాంశాలు తయారు చేసినట్లు చెప్పారు. మైనర్ డిగ్రీ కార్యక్రమంలో విద్యార్థుల అభ్యాసాన్ని బలోపేతం చేయడానికి ఫీల్డ్ విజిట్స్, సెమినార్లు ఉంటాయన్నారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్(ఎస్ఐడీఎం) అధ్యక్షుడు రాజిందర్ సింగ్ భాటియా మాట్లాడుతూ రక్షణ రంగం ఎదుర్కొంటున్న క్లిష్టమైన అవసరాలకు అనుగుణంగా ఇంజనీర్లను తయారు చేయడమే లక్ష్యమన్నారు.


నమూనా పాఠ్యాంశాలను ఆవిష్కరిస్తున్న ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాం, జి. సతీష్‌రెడ్డి తదితరులు


గాంధీకి నివాళులర్పిస్తున్న డా. లక్ష్మణ్, వినయ్‌కుమార్ తదితరులు

స్వాతంత్ర్య సమరయోధుల సేవలు మరువలేనివి

చిక్కడపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల సేవలు మరువలేనివని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా. కె. లక్ష్మణ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో నిర్వహించిన జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు విదేశీ వస్తువులను నిషేధించాలని, స్వదేశీ వస్తువులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, ఎం. ఉమేష్, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణమధ్య రైల్వేకు రూ. 10,143 కోట్ల ఆదాయం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో రూ.10,143 కోట్ల స్థూల ఆదాయాన్ని సాధించింది. 71.14 మిలియన్ టన్నుల సరుకు రవాణాతో రూ.6,635 కోట్ల ఆదాయం లభించగా, ప్రయాణికుల విభాగం నుంచి రూ.2,991 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం(2024-25) ఏప్రిల్-సెప్టెంబరు మధ్య వచ్చిన ఆదాయం రూ.9,966 కోట్లతో పోల్చితే ఈ ఏడాది ఆదాయం రూ.177 కోట్లు(1.7శాతం) అదనం. సరుకు రవాణాలో మునుపెన్నడూ లేని విధంగా 71.14 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్‌ను సాధించింది. గతేడాది లోడ్ చేసిన 67 మిలియన్ టన్నుల కంటే 6 శాతం ఎక్కువ. దక్షిణమధ్యరైల్వే జోన్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం పెరగడంపై జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్వే అధికారులను, ఉద్యోగులను అభినందించారు.

సీఎంను కలిసిన సీపీ


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేస్తున్న సీపీ సజ్జనార్

'గాంధీ'కి రాజకీయ రంగు

● విగ్రహం దిమ్మెకు బీజేపీ గుర్తు

అంబర్‌పేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ బొమ్మ చౌరస్తా సమీపంలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం దిమ్మెకు బీజేపీ గుర్తు కమలం పువ్వును పెయింటింగ్ వేయించడంపై అంబర్‌పేటలో రాజకీయ దుమారం చెలరేగింది. జాతిపితకు రాజకీయ రంగు అంటించడం ఎంత వరకు సబబని పలు పార్టీల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మహాత్ముడు అందరివాడన్నారు. దిమ్మెకు కమలం గుర్తు పెయింటింగ్ వేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గాంధీ విగ్రహం దిమ్మెపై వేసిన బీజేపీ కమలం గుర్తు

రహదారుల పక్కన ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

● వాహనాల రాకపోకలకు అంతరాయం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానరహదారుల పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పదేళ్లక్రితం రోడ్ల విస్తరణకు ముందు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చే దిశగా చర్యలు చేపట్టాల్సిన దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణచర్యలు తీసుకుంటామని చెబుతున్న ఉన్నతాధికారులు తర్వాత వాటిని పట్టించుకోవడం లేదు. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్‌కాలనీ చౌరస్తా ప్రధానరహదారిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగించే ప్రధానరహదారికి ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఆ మార్గంలో సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

యూసుఫ్‌గూడ నుంచి లక్ష్మీనర్సింహనగర్‌కు వెళ్లే రోడ్డులో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు రెండు సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు మొదలయ్యాయి. సిమెంట్ దిమ్మెల పక్కనే కార్లు, ఇతర వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త భవన నిర్మాణాలు లేకున్నా రోడ్డుపక్కన విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సిమెంట్ దిమ్మెలు ఎందుకు ఏర్పాటుచేస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎర్రగడ్డ, మోతీనగర్ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేసినా రోడ్ల మధ్యలో ఉన్న కొన్ని విద్యుత్‌స్తంభాలు తొలగించకపోవడంతో రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ అంతరాయాలకు కారణంగా మారుతున్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను మార్చేందుకు విద్యుత్‌శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని పలు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. రహదారులకు అతి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు మార్చే పనులు చేపట్టి ప్రమాదాల నివారణకు విద్యుత్‌శాఖ చర్యలు తీసుకొవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



జూబ్లీహిల్స్ జర్నలిస్టుకాలనీ చౌరస్తా ప్రధాన రహదారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు

స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్రపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రధాని మోదీ

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్రపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలలో ఆర్ఎస్ఎస్ భాగస్వామ్యం ఉందనే వాదనలు సత్యదూరమన్నారు. తనకు చరిత్ర అంశాలపై అవగాహన ఉన్నంత వరకు ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఏ సభ్యుడూ తమ ప్రాణాలను త్యాగం చేయలేదని, జైలుకు వెళ్లలేదన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాల్గొన్నట్లు జరుగుతున్న ప్రచారం ఆశ్చర్యంగా ఉందని ఒవైసీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



ప్రొఫెసర్ ఎన్. గోపి, శివారెడ్డిని పరామర్శిస్తున్న కవిత

రచయితలు ఎన్.గోపి, శివారెడ్డిని పరామర్శించిన కవిత

హైదరాబాద్/చాదర్‌ఘాట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తన సతీమణి అరుణను కోల్పోయిన రచయిత ఎన్.గోపి, కుమారుడు శంభుప్రసాద్‌ను కోల్పోయిన రచయిత కె.శివారెడ్డిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. ఆమె వెంట జాగృతినేతలు నవీనాచారి, కోల శ్రీనివాస్, మహేందర్, శివారెడ్డి, రాము యాదవ్ తదితరులున్నారు.

నిరసన

గాజాపై ఇజ్రాయేల్ దాడులకు వ్యతిరేకంగా నారాయణగూడ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ నాయకులు



రోడ్ల విస్తరణ ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

వృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో కొత్త రోడ్ల అవసరం ఎంతో ఉంది. అయినా గడిచిన కొన్ని సంవత్సరాలుగా సైబరాబాద్‌లో కొత్తగా లింక్ రోడ్లు, బైపాస్ మార్గాల నిర్మాణంలో పురోగతి కనిపించడం లేదు.

సోషల్‌మీడియాలో అప్‌డేట్లు

ట్రాఫిక్ సమస్య తీవ్రత నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రోజూ సోషల్‌మీడియాలో అప్‌డేట్లు ఇస్తున్నారు. మాదాపూర్, ఆర్‌సీపురం వంటి ప్రాంతాల్లో హెవీ ట్రాఫిక్ ఇన్‌ఫ్లో కారణంగా ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోందని, ప్రత్యామ్నాయ మార్గాలు సిఫార్సు చేస్తున్నారు. ఇటీవలి వర్షాలతో హైటెక్‌సిటీలోని యశోద హాస్పిటల్స్ వద్ద రోడ్ డ్యామేజ్, ఐకియా అండర్‌పాస్ వద్ద వాహనాల బ్రేక్‌డౌన్‌లు ట్రాఫిక్‌ను మరింత గందరగోళంగా మార్చాయి.

పరిష్కారం ఎప్పుడు?

సమస్యలు తెలిసి కూడా తక్షణ చర్యలు తీసుకోని అధికార యంత్రాంగంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోంది. ఐటీ ఉద్యోగులు, స్థానికులు సోషల్‌మీడియాలో తమ వేదనను వ్యక్తపరిచే ప్రయత్నం చేస్తున్నా, దీనికి పాలకుల నుంచి సరైన స్పందన లేదని అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖలు రోడ్ల విస్తరణ, కొత్త మార్గాల అభివృద్ధి వంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త రోడ్ల ప్రాధాన్యతపై నిపుణుల హెచ్చరిక

ఏటా వేలాది కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్ల విస్తరణ చేపట్టకపోతే పరిస్థితి మరింత క్లిష్టమవుతుందని ప్రజా రవాణా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసు, జీహెచ్ఎంసీ మధ్య బలమైన సమన్వయం, ప్రాజెక్టుల అమలులో వేగం అవసరమని చెబుతున్నారు.


నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రాజస్థానీ ప్రగతి సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన రామాయణ మేళాకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నవివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు


మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు


బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని కలిసిన నాయకులు


మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు వద్ద జరిగిన జమ్మి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మైలార్‌దేవు పల్లి ఉమ్మడి ఆలయాల కమిటీ నాయకులు

వైభవంగా దసరా వేడుకలు


పల్లెచెరువు వద్ద రావణాసురుడి దహనం

విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట, పహాడిషరీఫ్, అఫ్జల్‌గంజ్ డివిజన్లలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జమ్మిపూజ, రావన దహనం కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు నేతలు, సంఘాల నాయకులు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

- అబిడ్స్, చార్మినార్ జోన్ బృందం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)


రాజరాజేశ్వరి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన రాజేంద్రనగర్ హరిహర క్షేత్రంలోని అమ్మవారు


గౌలిపురాలో లక్ష్మీనారాయణ స్వామి పల్లకీ సేవలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సరాబు లక్ష్మణ్ గుప్తా, ఉదయభాస్కర్, బీఆర్‌ఎస్ నాయకుడు క్రాంతికుమార్


రావణ దహనానికి ఊరేగింపుగా వెళ్తున్న రామలక్ష్మణ్, హనుమాన్ వేషధారణలో ఉన్న భక్తులు


బుద్వేల్‌లో రావణాసురుడి దహనం


గౌలిపురా లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రాజ్, మాజీ కార్పొరేటర్ జితేంద్ర


చాంద్రాయణగుట్టలో జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గోపీ, చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ మహేశ్‌గౌడ్, తదితరులు


గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీనియర్ నాయకుడు వెంకటేశ్


మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు విష్ణువర్ధన్


గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర మీడియా సెల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్


● ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా జాంబాగ్ డివిజన్‌లోని వీవీ పంక్షన్‌హాల్‌లో జరిగిన విజయ దశమి ఉత్సవంలో పాల్గొన్న వీహెచ్‌పీ సెంట్రల్ కమిటీ సభ్యుడు గోవింద్ జాగిర్దార్‌ను సన్మానిస్తున్న బీజేపీ గోల్కొండ జిల్లా మాజీ అధ్యక్షుడు పాండు యాదవ్, నాయకులు రాజు మహరాజ్, వనమాల గోపాల్, పి.అనిల్ యాదవ్, కృష్ణ తదితరులు


బుద్వేల్ శివాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో జమ్మి పూజలో పాల్గొన్న భక్తులు


శ్రీరామ్‌కాలనీలో దుర్గామాత పూజ అనంతరం జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ షైక్ జహంగీర్‌ను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీధర్ గౌడ్,

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/9dnC4n0లో చదవండి. Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

హుదా ఇస్లామిక్ బుక్ ఫెయిర్ ప్రారంభం


పూరానీ హవేలీ రోడ్డులో ఏర్పాటు చేసిన హుదా ఇస్లామిక్ బుక్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న మహ్మద్ ఫహీం ఖురేషీ

చార్మినార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు తమ పిల్లలకు ఇంగ్లీష్‌తో పాటు ఉర్దూ అరబ్బీలో శిక్షణ ఇప్పిస్తే తన సాంస్కృతి సంప్రదాయాలను తెలుసుకుంటారని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ ఫహీం ఖురేషీ అన్నారు. శుక్రవారం పూరానీ హవేలీ రోడ్డులోని సిటీ సివిల్ కోర్టు సమీపంలో హుదా ప్రాంగణంలో జరుగుతున్న హుదా ఇస్లామిక్ బుక్ ఫెయిర్‌ను ఆయన సందర్శించారు. దేశవ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు ఉన్న పబ్లిషర్స్ నుంచి వచ్చిన ఇస్లామిక్ సాహిత్యం, పబ్లికేషన్లు విస్తృతంగా ప్రదర్శించబడ్డాయి. హుదా బుక్ డిస్ట్రిబ్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ అబ్దుల్ బాసిత్ షకీల్ ఫహీం ఖురేషీని ఆహ్వానించి సన్మానించారు. పుస్తక ప్రదర్శనను పరిశీలించిన అనంతరం మహ్మద్ ఫహీం ఖురేషీ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇస్లామిక్ పుస్తకాలు కొనుగోలు చేయాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండి జ్ఞానాన్ని పెంచుకొని సమాజానికి మంచి పౌరులుగా నిలవాలని సూచించారు. పుస్తకాలు రోజువారీ జీవితంలో అత్యుత్తమ మిత్రులని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ లయిఖ్, బాబు భాయ్ ఫయాజ్ పాల్గొన్నారు.


● పార్లమెంటు మాజీ సభ్యుడు, దళిత నేత, దళితుల హక్కుల కోసం పోరాడిన వి.తులసీరాం జయంతి సందర్భంగా రాజేంద్రనగర్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆయన మనుమడు వి.లలిత్, తదితరులు

- రాజేంద్రనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)

నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్


నవ జ్యోతి యూత్ క్లబ్ నూతన పాలకవర్గ సభ్యులు

రాజేంద్రనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడిగా మంగళారం శ్రీనివాస్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా జి.మురళీ మోహన్, పి.రవీందర్, ప్రధాన కార్యదర్శిగా శ్యామల గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా జి.యశ్వంత్(నాని), ఈ.శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.హరినాథ్, క్రీడల కార్యదర్శిగా ఎం.ప్రవీన్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా డి.నర్సింహ్మారాజు, కోశాధికారిగా ఎం.వినయ్‌కుమార్, ఉప కోశాధికారిగా ఎం.సాయి సందీప్ నియమితులయ్యారు. ఈ ఎన్నికలు క్లబ్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల వెంకటేశ్, ఎస్.వెంకటేశ్, కోశాధికారి జి.వేణుగోపాల్, క్లబ్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వి.శ్రీరాములు, వి.లక్ష్మీనారాయణ, ఎస్.శ్యాందాస్, జగదీశ్వర్, మాజీ అధ్యక్షులు ఎంఏ నయీమ్, ఈశ్వర్, పద్మారావు, వి.యాదగిరి ఆధ్వర్యంలో జరిగాయి.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ముగ్గురి ఎంపిక


కె.శ్రావణి

బర్కత్‌పుర, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముగ్గురిని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం-2025కు ఎంపిక చేసినట్టు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, మహ్మద్ ముబషీర్ మోహినుద్దీన్, ఎస్ఎస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ కె.శ్రావణిలకు ఈ అవార్డులకు ఎంపిక చేసినట్టు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి కార్యాలయంలో అవార్డులను ప్రదానం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ శ్రీరామవెంకటేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

గోల్ఫ్ వేలంలో 192 మంది


లీగ్ కమిషనర్ సంజయ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): శ్రీనిధి తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ (టీపీజీఎల్) వేలంలో 16 జట్లు కలిసి 192 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. శుక్రవారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌లో వేలం జరిగింది. ఈనెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. వేలంలో శ్రీనిధి విద్యాసంస్థల చైర్మన్ మహి, హైదరాబాద్ గోల్ఫ్ సంఘం అధ్యక్షుడు బీవీ.కృష్ణారావు, లీగ్ కమిషనర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. లైఫ్ స్పాన్ లయన్స్‌కు కెప్టెన్‌గా చక్రవర్తి, కేఎల్‌ఆర్ కింగ్స్‌కు సారథిగా లక్ష్మారెడ్డి నియమితులయ్యారు.


● నగరంలోని హైటెక్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఢిల్లీకి వెళ్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి బేగంపేట్ విమానాశ్రయంలో వీడ్కోలు పలుకుతున్న మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

- రాజేంద్రనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)


● నిజామాబాద్ జిల్లా పసుపు బోర్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానిస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్

- గోషామహల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)

ఘనంగా దత్తన్న అలయ్ బలయ్


బండారు దత్తాత్రేయకు గొంగళి కప్పి సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దత్తన్న అలయ్ బలయ్ దసరా సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం, నాయకులు క్యామ మల్లేశం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, కొలుపుల నరసింహ, బూరుగడ్డ నరేశ్, తూముకుంట అరుణ్‌కుమార్, చిట్టెం శైలేందర్, కురుమ సంఘం గ్రేటర్ యూత్ అడ్వైజర్ సాయికిరణ్ తదితరులు బండారు దత్తాత్రేయకు కురుమల సంప్రదాయ గొంగళి, గొర్రెపిల్లను బహూకరించి సత్కరించారు.


● మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతిని పురస్కరించుకొని గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీపీసీసీ మీడియా సెల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, నాయకులు లడ్డూ, కైలాష్, సుందర్ తదితరులు

- అఫ్జల్‌గంజ్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)

మద్యం విక్రేత అరెస్ట్.. 318 బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చార్మినార్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మీర్‌చౌక్‌కు చెందిన నర్సింగ్‌రావు దసరా సందర్భంగా అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడు. ఇతడి దందాపై సమాచారమందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి బృందం దాడి చేసి నర్సింగ్ రావును అరెస్ట్ చేశారు. అతడి నుంచి 318 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకొని తదుపరి విచారన నిమిత్తం మీర్ చౌక్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విదేశీ మద్యం విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు బంద్ కావడంతో అక్రమంగా అధిక ధరలకు నాన్ డ్యూటీ ఫ్రీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఉప్పుగూడ ప్రాంతంలో గోల్కొండ ఉదయ్‌కుమార్, భరత్‌భూషన్, ఢిల్లీకిచెందిన దీపక్ సహకారంతో ఢిల్లీ నుంచి డ్యూటీ ఫ్రీ మద్యం తెచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. వీరి దందాపై పక్కా సమచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సభ్యులు ఉప్పుగూడలోని ఉదయ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి, 13 విదేశీ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.


బుద్వేల్‌లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ఉడంగడ్డ దళితబస్తీలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదాలక్ష్మి


రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నవజ్యోతి యూత్ క్లబ్ పెద్దలు


చాంద్రాయణగుట్టలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నగర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావ్ ముదిరాజ్, తదితరులు

ఘనంగా గాంధీ జయంతి

రాజేంద్రనగర్/చాంద్రాయణగుట్ట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రభాత్ భేరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నవజ్యోతి యూత్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు వేముల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటేశ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ పుర వీధుల్లో పాటలు పాడుతూ మహాత్మాగాంధీని స్మరించుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ పెద్దలు ఎస్ జగదీశ్వర్, నయీమ్, డి.ఉమారెడ్డి, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ వద్దు.. స్వదేశీ ముద్దు

● గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి


హరిచందనకు గాంధి విగ్రహాన్ని అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

కార్వాన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకొని లంగర్ హౌజ్ బాపూఘాట్‌లో గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గున్నా రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హరిచందనలు పాల్గొన్నారు. ఈసందర్భంగా గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారిపై పోరాడి స్వాతంతం తెచ్చుకున్నామే కానీ, విదేశీ విద్యను స్వదేశంలో అభ్యసిస్తూ, విదేశీ దుస్తులు, విదేశీ వస్తువులు కొనడం బాధాకరమని అన్నారు. ఇలా మన సంపదని వాళ్ళ చేతిలో పెడుతుంటే ఇంకా మనకు స్వాతంత్ర్యం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ చూపిన సత్యం, అహింస విషయాల్లో చర్చలు జరిగితేనే వాటి ఆచరణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతీ కార్యాలయంలోని అధికారి టేబుల్ పైన, పాఠశాలల్లో గాంధీ విగ్రహాన్ని ఉంచేలా లక్ష గాంధీ విగ్రహాలను పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలోనాఆయియకులు హన్మంతరావు, చంటిబాబు, పరమానందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి చేతులు మీదుగా గాంధి విగ్రహాన్ని హరించదనకు అందజేయడం జరిగింది.

లక్ష జనాభాకు ఒక నిరాశ్రయ సెంటర్ ఉండాలి

● పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బర్కత్‌పుర, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సూచనల మేరకు లక్ష జనాభాకు ఒక నిరాశ్రయ సెంటర్ ఉండాలని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వెంకటరెడ్డి, ఇందిరా, జయశ్రీ, అంబిక, అనురాధ, అరుణ్మయి, రేణుక, రాము, ఫిరోజ్, సాగర్‌లు అన్నారు. కోటిన్నర జనాభా ఉన్న హైదరాబాద్‌లో కేవలం 13 నిరాశ్రయ సెంటర్లు మాత్రమే ఉన్నాయని వారన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద నిరాశ్రయులకు అండర్‌ద స్టార్స్ కార్యక్రమం నిర్వహించారు. క్యాంపెయిన్ ఫర్ సిటిజన్స్ షెల్టర్స్, నిరాశ్రయ శ్రామిక సంఘటన్, బాల్యమిత్ర నెట్‌వర్క్, పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రోడ్లపై ఉంటున్న నిరాశ్రయులకు జీవించే హక్కు ఉంటుందని, వారికి వసతి, ఆహారం, వైద్యం, విద్య, ఉపాధి అవకాశం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వారు అన్నారు. నిరాశ్రయుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఆహారం, దుస్తులను అందజేశారు.


● మురుగు

అత్తాపూర్ తేజస్వీనగర్ వీధుల్లో నెలల తరబడి మురుగు ప్రవహిస్తున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదు. ఈవిషయంపై పలుమార్లు రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

- రాజేంద్రనగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి)

వైద్యుల నిర్లక్షంతో మహిళ మృతి

● చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల డిమాండ్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్‌ల నిర్లక్షం వల్ల మహిళ మృతి చెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. మాసబ్ ట్యాంక్ మహావీర్ ఆస్పత్రిలో కార్వాన్ హీరానగర్‌కు చెందిన రేఖారాణి(55) మృతి చెందింది. ఆమె మరణానికి వైద్యులే కారణమని ఆరోపించిన కుటుంబ సభ్యులు వైద్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

మదీన, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత శుక్రవారం మృతి చెందాడు. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... సెప్టెంబరు 30న అలీనగర్‌కు చెందిన మహ్మద్ అర్షద్(63) మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ వద్దకు రాగానే వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన మహ్మద్ అర్షద్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు పాతబస్తీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అలీ మస్కతి కుటుంబసభ్యులకు చెందిదని, కారును నడిపిన రెహాన్ బిన్ అలీ మస్కతి(37) మస్కతి కుటుంబసభ్యుడు అని తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.






సినీ హీరో నాగార్జునను సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జస్టిస్ ఎన్‌వీ రమణ, దత్తాత్రేయ, విజయలక్ష్మి తదితరులు.

సన్మానం పొందుతున్న బ్రహ్మానందం

మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న ఎంపీలు ఈటల, డీకే అరుణ





ఆర్మీ మేజర్ జనరల్ మిశ్ర, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మంత్రి పొన్నంలకు సన్మానం



దత్తాత్రేయకు కవిత సన్మానం



దత్తాత్రేయ, ఆయన కుమార్తె విజయలక్ష్మిని సన్మానిస్తున్న వీహెచ్

ధూం.. ధాం.. గా అలయ్ బలయ్

ఆత్మీయ ఆలింగనానికి ప్రతీకగా నిలిచే అలయ్ బలయ్ కార్యక్రమం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శుక్రవారం ధూం ధాంగా జరిగింది. తెలంగాణ సంప్రదాయ, ఆచార వ్యవహారాలను చాటి చెప్పేలా నిర్వహించిన ఆట, పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. హాజరైన అతిథులను మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఘనంగా సన్మానించారు.

నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంత్రి పొన్నం.. ఫలక్‌నుమాలో ఆర్వోబీ ప్రారంభం



ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, ఎంపీ

చాంద్రాయణగుట్ట, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రూ.52.03 కోట్లతో నాలుగు లైన్లలతో జీహెచ్‌ఎంసీ, దక్షిణ మధ్య రైల్వే నిర్మించిన ఫలక్‌నుమా సమాంతర రోడ్డు ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ)ని శుక్రవారం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ ముబీన్, జుల్ఫికర్ అలీ, ఎమ్మెల్సీలు మీర్జా రహ్మత్‌బేగ్, మీర్జా రియాజుల్ హసన్ ఆఫంది, దక్షిణ మండలం జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం పట్టాల పంపిణీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కోర్టునుంచి క్లియరెన్స్ రావడంతో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పంపిణీ చేశారు. బంజారాహిల్స్ మంత్రుల క్వార్టర్స్‌లో శుక్రవారం జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలతో కలిసి 75 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం పట్టాలు పంపిణీ చేశారు. గ్రేటర్‌పరిధిలోని నివాసితుల కోసం మహేశ్వరం మండలం మంకల్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 1,730 మంది లబ్ధిదారుల జాబితాను ప్రచురించి వారికి మంకల్ ఫేజ్-2 స్థానంలో ఇళ్లను కేటాయించారు. అంబర్‌పేట- 134 మందికి, బహదూర్‌పుర- 294, బండ్లగూడ -155, చార్మినార్-209, సైదాబాద్ -206, ఇతర ప్రాంతాల్లో ఉన్న 28మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారు. 75 పట్టాలు మంత్రి అందజేయగా.. మిగిలిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయాల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ కార్తీక్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కార్తీక్, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ శర్మ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బుశ్వాన్ గోయల్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు.



కేశవ నిలయంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖులతో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ఆర్ఎస్ఎస్ సూక్తి ప్రతీ ఒక్కరికి ఆదర్శం

బర్కత్‌పుర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశమే ప్రథమం అన్న ఆర్ఎస్ఎస్ సూక్తి ప్రతీ ఒక్కరికి ఆదర్శంగా నిలిచిందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రస్థానంలో భాగస్వామ్యం కావడం ఆ విలువలతో ఎదిగి ప్రజాజీవితంలో సేవ చేసే అవకాశం పొందడం ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు నిండిన సందర్భంగా గురువారం బర్కత్‌పురలోని కేశవ నిలయాన్ని ఆయన సందర్శించారు. కామినేని శ్రీనివాసరావుతో కలిసి సీనియర్ ప్రచారకులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జ్యేష్ఠ ప్రచారక్ బాన్‌సింగ్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, సామాజిక సమరసత అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్, ప్రచార ప్రముఖ్ భాస్కర్, అప్పల ప్రసాద్, త్రివిక్రమ్‌రావు, భానుసింగ్, టి.ఎస్.ఆర్. మూర్తి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నీ ఒకేచోట..



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ ఆభరణాల డిజైన్‌లతో పాటుగా సమకాలీన డిజైన్లు వినియోగదారులకు ఒకే చోట లభ్యమయ్యేలా జువెలరీ వరల్డ్ పేరిట ప్రదర్శన ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న ఈ ప్రదర్శనను జీఎస్టీ అప్పిలేట్ జాయింట్ కమిషనర్ శ్రీలీల, ఫుల్కారీ లేడీస్ వింగ్ అధ్యక్షురాలు ఆశుగౌరీ ప్రారంభించారు.



మ్యాచ్‌ను వీక్షిస్తున్న జయేష్, ఇషా

హైదరాబాద్ బ్లాక్ హాక్స్ శుభారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లోని తమ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌కు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు షాకిచ్చింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఉత్కంఠభరితంగా జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 3-0తో కాలికట్‌పై గెలిచింది. హైదరాబాద్ 15-12, 18-16, 18-16తో వరుస సెట్లలో నెగ్గింది. అంతకుముందు ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారులు జితేందర్ రెడ్డి, క్రీడాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, హైదరాబాద్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి క్రీడాకారులకు కరచాలనం చేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. సినీ హీరో విజయ్ దేవరకొండ, పారిస్ ఒలింపియన్ ఇషా సింగ్ ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు స్టేడియానికి విచ్చేశారు.

11, 12 తేదీల్లో ట్రిపుల్‌ఐటీలో మెగాథాన్ ఫెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ట్రిపుల్‌ఐటీహెచ్) ఈ నెల 11, 12 తేదీల్లో మెగాథాన్ పేరిట సాంకేతిక ఉత్సవాన్ని నిర్వహించనుంది. టెక్ ఫార్వర్డ్ పరిశోధన సెమినార్ సిరీస్‌లో భాగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల (ఎమర్జింగ్‌టెక్నాలజీస్)పై సాంకేతిక విద్యాసంస్థలు-పరిశ్రమల సంగమం ఈ ఫెస్ట్‌ను నిర్వహించనున్నట్లు ఐఐఐటీహెచ్ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఐఐఐటీహెచ్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.



దసరా వేడుకలకు హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సభ్యులు



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో దసరా వేడుకలలో పాల్గొన్న ప్రజలు


అంబర్‌పేటలో వైభవంగా దసరా వేడుకలు

అంబర్‌పేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలో దసరా వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారికి అంబర్‌పేట బూర్జుగల్లీ వద్ద పూజలు నిర్వహించి ఊరేగింపుగా మున్సిపల్ గ్రౌండ్‌కు తీసుకువచ్చారు. మున్సిపల్ గ్రౌండ్‌లో శమీ పూజ నిర్వహించారు. అనంతరం రావణ దహన కార్యక్రమం భారీ బాణాసంచాతో నిర్వహించారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రజలు ఒకరితో ఒకరు శమీని పంచుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సేవా సమితి చైర్మన్ డీపీరెడ్డి, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, సభ్యులు శ్రీధర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతల అంతమే కేవీపీఎస్ అంతిమ లక్ష్యం

నల్లకుంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏన్నో ఏళ్లుగా కొనసాగుతున్న కుల, ఆర్థిక అసమానతలను అంతం చేయడమే కేవీపీఎస్ లక్ష్యంగా పనిచేస్తుందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవంలో కేవీపీఎస్ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ యువత, విద్యావంతులు కుల నిర్మూలన లక్ష్యం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు ఎం.వి.రమణ, పి.ఆశయ్య, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



మూసీలో స్థానికులు పట్టుకున్న కొండ చిలువ

అంబర్‌పేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద మూసీ నదిలో తిరుగుతున్న కొండచిలువను గురువారం ఎట్టకేలకు పట్టుకున్నారు. ఉస్మాన్‌సాగర్ నుంచి వచ్చిన వరదనీటికి మూసీ నదిలో కొండచిలువ కొట్టుకువచ్చి మూసారాంబాగ్ బ్రిడ్జి వద్దకు చేరింది. దీనిని చూసిన కార్మికులు పట్టుకోవడానికి పలుమార్లు ప్రయత్నించినా అది చిక్కలేదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం బ్రిడ్జి సమీపంలో ఉన్న చికెన్ షాపులోకి కొండచిలువ దూరింది. దీనిని గమనించిన స్థానికుడు షబ్బీర్ 15 ఫీట్ల ఈ కొండచిలువను తన మిత్రుల సహాయంతో పట్టుకున్నారు. దానిని సంచిలో బంధించి అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు.

అక్రమంగా వచ్చి డ్రగ్స్ దందా

● నైజీరియన్‌ను డిపోర్ట్ చేసిన పోలీసులు



జియోఫెరీ డోజియోబైబి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇండియా వచ్చి డ్రగ్స్ దందా చేస్తున్న నైజీరియన్‌ను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి, స్వదేశానికి తిప్పి పంపారు. నైజీరియాకు చెందిన జియోఫెరీ డోజియోబైబి (33) 2019లో నేపాల్ నుంచి రోడ్డుమార్గం ద్వారా అక్రమంగా ఇండియాలో ప్రవేశించాడు. ఇతడికి సరైన పాస్‌పోర్ట్, వీసా లేదు. ఇతడు బెంగళూరు, హైదరాబాద్‌లో డ్రగ్ పెడ్లర్‌లతో సంబంధాలు పెట్టుకొని డ్రగ్స్ దందా చేస్తున్నాడు. టోలీచౌకి ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇతడిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఎఫ్ఆర్ఆర్ఓ అధికారులకు సమాచారమందించిన పోలీసులు వారి సహకారంతో నిందితుడిని స్వదేశానికి తిప్పిపంపారు.

కాచిగూడలో ఘనంగా స్వచ్ఛభారత్



స్వచ్ఛోత్సవం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జీఎం, ఇతర ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా దక్షిణమధ్యరైల్వే గత 15రోజులుగా నిర్వహించిన స్వచ్ఛోత్సవం కార్యక్రమాలు ముగిశాయి. శుక్రవారం కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించిన జీఎం, స్టేషన్‌లో పనిచేస్తున్న సఫాయి మిత్రలను ఘనంగా సత్కరించారు. స్వచ్ఛత ఇతివృత్తంపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, హైదరాబాద్ డీఆర్ఎం సంతోష్ కుమార్ వర్మ, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ.. రూ.1.95 లక్షలు కాజేత

● ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధుడి ఫోన్ తస్కరించి యూపీఐ ద్వారా రూ.1.95లక్షలు కాజేసిన ముగ్గురు నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైం అధికారులు అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన మహ్మద్ మొయినుద్దీన్ (31) ఆటోడ్రైవర్. బాధితుడు(68) ఉప్పల్ నుంచి తార్నాక వరకు ఆటోలో ప్రయాణించాడు. ఈ సమయంలో ఆటోలో కూర్చున్న సల్మాన్ ఫోన్‌పేలో డబ్బు చెల్లించాలని సూచించాడు. వారిపై నమ్మకం ఉండటంతో ఫోన్ అన్‌లాక్ చేసి, ఆన్‌లైన్ పేమెంట్ చేశాడు. ఆటో దిగే సమయంలో ఫోన్ కనపడకపోవడంతో ఫోన్ పోయినట్లు గమనించి. రెండోరోజు సిమ్‌ను బ్లాక్ చేయించాడు. అయితే, ఆ లోగానే తన ఫోన్ నుంచి రూ.1.95 లక్షలు వివిధ ఖాతాలకు బదిలీ అయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్ మొయినుద్దీన్, అతని స్నేహితుడు సల్మాన్‌తో పాటు డబ్బు బదిలీకి సహకరించిన మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన కూరగాయల వ్యాపారి మహ్మద్ హుస్సేన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 3 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

50 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

ఎండీఎంఏ విక్రేత, సరఫరాదారుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉంటూ డ్రగ్ దందా నడిపిస్తున్న వ్యక్తి ముఠాలో సరఫరాదారుడు, విక్రేతలను హెచ్‌న్యూ, చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. కేరళకు చెందిన అశ్విన్, రాహుల్ ఇద్దరూ కాలేజీ స్నేహితులు. వీరిద్దరూ డ్రగ్ దందా నిర్వహించేవారు. అశ్విన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బెహ్రెయిన్ వెళ్లాడు. విదేశాలకు వెళ్లినా అతను డ్రగ్స్ దందా మానలేదు. రాహుల్ దందాలో అతను సహకరిస్తూ వచ్చాడు. ఇదిలా ఉండగా బండ్లగూడకు చెందిన మహ్మద్ ఉస్మాన్ (33)కు ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్విన్ పరిచయం అయ్యాడు. వాట్సాప్ ద్వారా అశ్విన్‌కు ఎండీఎంఏ డ్రగ్ ఆర్డర్ పెట్టి ఆన్‌లైన్‌లో డబ్బు పంపేవాడు. అశ్విన్ తనకున్న విదేశీ పరిచయాలతో బెంగళూరులో డెడ్ డ్రాప్ విధానంలో డ్రగ్స్ తెప్పించేవాడు. డ్రగ్స్ ఉన్న లోకేషన్ రాహుల్‌కు చెప్పేవాడు. దీంతో రాహుల్ డ్రగ్స్ తీసుకొని ఉస్మాన్‌కు సరఫరా చేసేవాడు. వీరిదందాపై పక్కా సమాచారం అందుకున్న హెచ్‌న్యూ, చాదర్‌ఘాట్ పోలీసులు కలిసి ఉస్మాన్, రాహుల్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం

బేగంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన బీటో కనెక్ట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు బేగంపేట ఎయిర్‌పోర్టులో అధికారులు, పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, అనిల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ విజయలక్ష్మి, సీపీ సజ్జనార్ తదితరులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానంతరం రాజ్‌నాథ్ సింగ్ తిరిగి బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. బీజేపీ నాయకులు ఆయనకు వీడ్కోలు పలికారు.

హైదరాబాద్ అంటే చాలా ఇష్టం



'హైదరాబాద్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ నగరం నచ్చినంతగా దేశంలో మరో ప్రదేశమేదీ నచ్చలేదు. ఇక్కడి వారి ఆత్మీయత, ఆహారం ఎంతో నచ్చాయి' అంటూ సినీనటి మానీ రాయ్ హైదరాబాద్, ఇక్కడి ప్రజలపై ఉన్న అభిమానాన్ని, ఆప్యాయతను ఇలా చాటుకున్నారు. హైదరాబాదీ బిర్యానీతో పాటుగా ఆంధ్రా ఫుడ్ కూడా ఇష్టమేనన్నారు. ఇటీవలే ఓ పాట షూటింగ్ కోసం ఇక్కడికి వచ్చానని. మెగాస్టార్ చిరంజీవితో తన తొలిపాట చేయడం తనకు లభించిన అపూర్వ అవకాశంగా అభివర్ణించారు. హైటెక్ సిటీలో జరిగిన ఓ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె ఫొటోలకు ఇలా పోజిచ్చారు.

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి)

యశ్వంత్‌పూర్ వందేభారత్‌కు బుధవారమే మెయింటెనెన్స్ హాలీడే



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ-యశ్వంత్‌పూర్ వందేభారత్ (20703/04) ఎక్స్‌ప్రెస్‌కు మెయింటెనెన్స్ హాలీడే (ప్రస్తుతం అమల్లో ఉన్న) బుధవారమే ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. వాస్తవానికి ఈ నెల 4వ తేదీ నుంచి మెయింటెనెన్స్ హాలీడేను శుక్రవారానికి మార్పు చేసినట్లు సెప్టెంబరు 12న రైల్వే అధికారులు ప్రకటించారు. అయితే, మెయింటెనెన్స్ హాలీడేతో పాటు స్టాపేజీలు, రైళ్ల వేళల్లోనూ ఎటువంటి మార్పులు లేవని, గతంలో చేసిన ప్రకటనను రద్దు పరిచినట్లు సీపీఆర్ఓ శ్రీధర్ తెలిపారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం
4 అక్టోబరు 2025





తోటకూరతో విభిన్నంగా..!

ఏడాది పొడవునా లభించే ఆకుకూరల్లో తోటకూర ఒకటి. దీంతో పప్పు, పులుసు, వేపుడు చేసుకుంటూ ఉంటాం. అలాగే పకోడి, గారెలు, బోండాలు లాంటి చిరుతిండ్లు కూడా చేసుకుని ఇష్టంగా తింటూ ఉంటాం. ఇవే కాకుండా... తోటకూరతో తయారుచేసే విభిన్న రుచులు మీకోసం...



తోటకూర బేసన్ రోల్స్

కావాల్సిన పదార్థాలు

- తోటకూర ఆకులు పెద్దవి- పది, శనగ పిండి- ఒక కప్పు, కారం- రెండు చెంచాలు, ధనియాల పొడి- ఒక చెంచా, ఉప్పు- తగినంత, అల్లం- వెల్లుల్లి పేస్టు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, వాము- అర చెంచా, నూనె- తగినంత

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో శనగ పిండి, ఉప్పు, కారం, ధనియాల పొడి, అల్లం - వెల్లుల్లి పేస్టు, జీలకర్ర, వాము వేసి బాగా కలపాలి. తరువాత ఆ పిండిలో నీళ్లు చిలకరిస్తూ పేస్టులా తయారుచేయాలి.
- తోటకూర ఆకులను నీళ్లలో ముంచి తీయాలి. ఒక్కో ఆకు మీద శనగపిండి మిశ్రమాన్ని చెంచా సహాయంతో పలుచగా రాసి, దాన్ని చాపలా చుట్టి పళ్లెంలో పెట్టాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. తరువాత అందులో తోటకూర రోల్స్ పరచాలి. ఒక్కో రోల్‌ను ఫోర్క్ సహాయంతో అన్ని వైపులకూ తిప్పుతూ దోరగా వేయించాలి. రోల్స్ ఎర్రగా వేగిన తరువాత పళ్లెంలోకి తీయాలి. ఈ తోటకూర - బేసన్ రోల్స్‌ను టమాటా సాస్‌తో సర్వ్ చేయవచ్చు.

తరచూ తోటకూర తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఎ, బి, సి, డి, ఇ, కె విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఫలితంగా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తోటకూరలోని ఐరన్, సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, జింక్ లాంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. రక్తహీనత, రక్తపోటు లాంటి సమస్యలను నివారిస్తాయి.

వంటిల్లు

తోటకూర లివర్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు

- లేత తోటకూర కట్టలు- నాలుగు, పుట్నాల పొడి- అర కప్పు, అల్లం ముక్కలు- చిన్నవి రెండు, వెల్లుల్లి రెబ్బలు- మూడు, పచ్చి మిర్చి- ఆరు, జీలకర్ర- ఒక చెంచా, కార్న్‌ఫ్లోర్- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- కొద్దిగా, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాల పొడి- ఒక చెంచా, పెరుగు- అర కప్పు, మిరియాల పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నిమ్మకాయ- ఒకటి



తయారీ విధానం

- తోటకూరలో లావుపాటి కాడలను తొలగించాలి. తరువాత నీళ్లు పోస్తూ రెండు లేదా మూడు సార్లు శుభ్రంగా కడగాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి సగానికి పైగా నీళ్లు పోసి మరిగించాలి. అందులో తోటకూర వేసి రెండు నిమిషాలు ఉడికించి వెంటనే ఒక పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. మిక్సీలో అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, అర చెంచా జీలకర్ర, పచ్చి మిర్చి, పావు చెంచా ఉప్పు, ఉడికించిన తోటకూర వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. వెడల్పాటి గిన్నెలో కార్న్‌ఫ్లోర్, పుట్నాల పొడి, తోటకూర పేస్టు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో సమంగా పరచాలి. స్టవ్ మీద ఇడ్లీ కుక్కర్ పెట్టి అందులో నీళ్లు పోసి మరిగించాలి. ఆపైన తోటకూర మిశ్రమం ఉన్న గిన్నెను ఉంచి పది నిమిషాలపాటు ఆవిరి మీద ఉడికించి దించాలి. ఈ మిశ్రమం పూర్తిగా చల్లారాక చిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి వేడిచేయాలి. అందులో తోటకూర మిశ్రమంతో చేసిన ముక్కలు వేసి, దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఇవి అచ్చం లివర్ ముక్కల్లాగే ఉంటాయి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఆపైన జీలకర్ర, కరివేపాకు, పసుపు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలపాలి. ఉల్లిపాయ ముక్కలు ఎర్రగా వేగిన తరువాత ధనియాల పొడి, కారం, కొద్దిగా ఉప్పు, గరం మసాల పొడి, పెరుగు వేసి కలపాలి. నూనె పైకి తేలేవరకూ కలుపుతూనే ఉండాలి. తరువాత వేయించిన ముక్కలు, కొత్తిమీర వేసి పైకి కిందికి టాస్ చేయాలి. మూత పెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరగా మిరియాల పొడి చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. తరువాత నిమ్మరసం చిలకరించి వేడివేడిగా సర్వ్ చేయాలి.

తోటకూర ఓట్స్ కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు

- తోటకూర- రెండు కట్టలు, ఓట్స్- ఒక కప్పు, పచ్చి మిర్చి- మూడు, అల్లం ముక్కలు- నాలుగు, ఉప్పు- రెండు చెంచాలు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, గరం మసాల పొడి- ఒక చెంచా, బియ్యం పిండి- రెండు చెంచాలు, పెరుగు- పావు కప్పు, నూనె- తగినంత

తయారీ విధానం

- తోటకూరను శుభ్రంగా కడిగి, సన్నగా తరిగి పెట్టుకోవాలి. మిక్సీలో పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి, ఓట్స్ వేసి, దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి.
- వెడల్పాటి గిన్నెలో వేయించిన ఓట్స్, ఉల్లిపాయ ముక్కలు, తోటకూర తరుగు, పచ్చిమిర్చి- అల్లం పేస్టు, ఒక చెంచా ఉప్పు, గరం మసాల పొడి, బియ్యం పిండి, పెరుగు వేసి బాగా కలపాలి. అవసరమైతే కొన్ని నీళ్ల చుక్కలు చిలకరించుకుంటూ మెత్తని ముద్దలా చేయాలి. అరచేతికి నూనె రాసుకొని ఆ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ చిన్న కట్‌లెట్‌ల మాదిరి చేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఆపైన కట్‌లెట్‌లు పరిచి, చిన్న మంట మీద రెండు వైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. ఈ తోటకూర కట్‌లెట్‌లను టమాటా కెచప్, గ్రీన్ చట్నీ లేదా రైతాతో తింటే రుచిగా ఉంటాయి.

తోటకూరలోని పీచు పదార్థాలు జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి. దీంతో మలబద్ధకం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయి. మూత్రపిండాలు శుభ్రపడతాయి. శరీర బరువును నియంత్రించడంలో తోటకూర ప్రధాన పాత్ర పోషిస్తుంది.

భోజన కుతూహలం

మనోబలాన్నిచ్చే బూడిదగుమ్మడి!

బూడిద గుమ్మడి కాయకు సంస్కృతంలో కూష్మాండం అనే పేరు ఉంది. తీగలకు కాసే కాయల్లో ఇది చాలా గొప్పదని 'భోజనకుతూహలం' గ్రంథం పేర్కొంది. బూడిద గుమ్మడి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అవేమిటో చూద్దాం..

- మూత్రపిండంలో రాళ్లు, అతిసారం, అధిక దాహం వంటి వ్యాధులకు బూడిద గుమ్మడి రసం అద్భుతంగా పనిచేస్తుంది.
- వేసవికాలంలో బూడిద గుమ్మడి రసం దేహాన్ని చల్లబరచి శక్తినిస్తుంది. నిస్సత్తువను పోగొడుతుంది.



- నిద్రలేమి, నిరాశ, దిగులు, విచారం లాంటి మానసిక సమస్యలకు బూడిద గుమ్మడి రసం మెరుగైన ఔషధం. అందుకే దీనిని మనోబలాన్ని పెంచే కూరగాయగా ఆయుర్వేద గ్రంథాలు పేర్కొన్నాయి.
- బూడిద గుమ్మడి రసాన్ని క్రమం తప్పకుండా తాగితే రక్తపోటు సమస్య తగ్గుతుంది.
- మధుమేహం వల్ల కొందరికి అరికాళ్లలో మంటలు ఏర్పడతాయి. అలాంటి వారికి ఇది ఒక ఉత్తమమైన ఔషధం.
- శరీరాన్ని క్షీణింపచేసే క్షయ, దీర్ఘ జ్వరాలు లాంటి సమస్యలకు బూడిద గుమ్మడి మంచి ఔషధం.
- సాధారణంగా లేత బూడిద గుమ్మడి కాయలను వంటకాలకు, ముదిరిన కాయలను ఔషధాలలో ఉపయోగించుకోవటానికి వాడతారు. ముదురు గుమ్మడికాయలను ఎక్కువగా తింటే శరీరంలో కఫం పెరుగుతుంది. లేత గుమ్మడి క్షార స్వభావం కలిగినది. అందువల్ల కడుపులోని ఆమ్లత్వం తగ్గుతుంది.

ఏ వంటకం దేని కోసం..

- బూడిద గుమ్మడి పప్పు- బలాన్ని పెంపొందిస్తుంది
- ఇగురు కూర- శరీరానికి చలవనిస్తుంది
- పెరుగుపచ్చడి- ప్రేగులను బలపరుస్తుంది. అమీబియాసిస్ లాంటి సమస్యలు తొలగిస్తుంది
- రోటిపచ్చడి- దీని వల్ల శరీరంలోని జీర్ణశక్తి పెరుగుతుంది.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

పండగ రోజుల్లో వెలిగిపోయేలా

పండగ రోజుల్లో మేకప్ కూడా ప్రత్యేకంగా ఉండేలా చూసుకోవాలి. అందంగా, ఆకర్షణీయంగా అన్నిటికీ మించి సహజసిద్ధంగా కనిపించేలా చూసుకోవాలి. అందుకోసం ఎంచుకోవలసిన మేకప్ చిట్కాలు ఇవే!

చర్మాన్ని సిద్ధం చేసి: కాలుష్యం, దుమ్ము, ధూళి వల్ల చర్మం రంగు తగ్గి, పొడిబారుతుంది. కాబట్టి స్క్రబ్‌తో చర్మాన్ని శుభ్రం చేసుకుని, ఆవిరి పట్టి, స్కిన్ ప్యాక్ వేసుకోవాలి. ప్యాక్‌ను తొలగించుకున్న తర్వాత ముఖాన్ని తడి లేకుండా తుడిచి, వెంటనే మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

చల్లనీళ్లు: ముఖ చర్మం బిగుతును సంతరించుకోవడం కోసం ఒక గిన్నెలో నీళ్లు నింపి, దాన్లో నాలుగైదు మంచు ముక్కలు వేసి, ముఖాన్ని ఆ నీళ్లలో ముంచి తీయాలి. తర్వాత తడి లేకుండా తుడుచుకుని మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

తగిన ప్రైమర్: జిడ్డు చర్మమైతే మాటిఫైయింగ్ లేదా సిలికాన్ ఫ్రీ ప్రైమర్ ఎంచుకోవాలి. పొడి చర్మమైతే... హైడ్రేటింగ్, ల్యూమినస్ బ్రైటెనింగ్, గ్లోయింగ్ అనే లేబుల్ ఉన్న ప్రైమర్ ఎంచుకోవాలి. అలాగే దాన్లో విటమిన్-సి ఉండేలా చూసుకోవాలి.



ఫౌండేషన్: 12 నుంచి 16 గంటల పాటు చెక్కుచెదరకుండా ఉండే ఫౌండేషన్ వాడుకోవాలి. ఇందుకోసం లాంగ్ వేర్, ట్రాన్స్‌ఫర్, స్వెట్ రెసిస్టెంట్ ఫార్ములాతో కూడిన ఫౌండేషన్ కోసం వెతకాలి.

కలర్ కరెక్ట్: కళ్ల దిగువన ఉండే నల్లని వలయాలను కనిపించకుండా చేయడానికి... ఇటుక రంగు టోన్‌లో ఉండే ఆరెంజ్ కరెక్టర్ సూటవుతుంది. తెల్లని చర్మం కలిగినవాళ్లకు పీచ్ రంగులోని కలర్ కరెక్టర్ బాగుంటుంది. కరెక్షన్ కోసం మొదట అవసరమైన ప్రదేశంలో కలర్ కరెక్టర్ అప్లై చేసి, వేళ్లతో లేదా బ్రష్‌తో అద్దుకోవాలి.

కన్‌సీలర్: మొటిమలు, కళ్ల కింది వలయాలను దాచడం కోసం కన్‌సీలర్ ఉపయోగించాలి. అయితే దీన్ని అప్లై చేసే ముందు ఆ ప్రదేశాల్లో ట్రాన్స్‌ల్యుసెంట్ పౌడర్‌ను అప్లై చేయాలి. తర్వాత దాని మీద కన్‌సీలర్ అద్ది, అంచులు కలిసిపోయేలా బ్రష్‌తో అద్దుకోవాలి. కంటి దిగువన వీలైనంత తక్కువ కన్‌సీలర్ వాడుకోవాలి.

బ్లష్: మేకప్ ఫ్లాట్‌గా కనిపిస్తుందంటే కచ్చితంగా బ్లష్ అప్లై చేసుకోవాలి. చక్కని మెరుపు, వర్చస్సుతో కనిపించడానికి బ్లష్ తోడ్పడుతుంది.

పోకడ

తారల వ్యానిటీ వ్యాన్లు నేడు హోదాలకు చిహ్నాలుగా మారిపోయాయి. హంగులు, అలంకరణల్లో ఏమాత్రం రాజీ పడని తారలు, వ్యానిటీ వ్యాన్లు వైభోగాలకు ప్రతిరూపాల్లా ఉండాలని కోరుకుంటున్నారు. అలాంటి కొందరు బాలీవుడ్ తారల వ్యానిటీ వ్యాన్ల గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.





విలాసాల వ్యాన్స్

రణ్‌వీర్ సింగ్ షూటింగ్‌కు వెళ్లాలంటే అతని వెంట ఏకంగా మూడు వ్యానిటీ వ్యాన్లు ఉండాల్సిందే! వాటిలో ఒకటి వ్యక్తిగత అవసరాల కోసమైతే, రెండోది వ్యాయామం కోసం, మూడోది వ్యక్తిగత వంటవాడి కోసం. ఇక షారూఖ్ ఖాన్ వ్యానిటీ వ్యాన్ ఎంతో పెద్దగా ఉంటుంది. ఈ వ్యాన్‌ను షారూఖ్... దుబాయి నుంచి దిగుమతి చేసుకుని, తనకు తగ్గట్టు మెరుగులు దిద్దించుకున్నాడు. కారు అంతర్గత అలంకరణ బాధ్యతను సుప్రసిద్ధ కార్ల డిజైనర్, దిలీప్ ఛాబ్రియా తీసుకున్నాడు. షారూఖ్, ఈ కారు నిర్మాణానికి 4 నుంచి 5 కోట్ల రూపాయలను వెచ్చించాడు. ఆ విలాసవంతమైన వ్యాన్ మారుమూల ప్రాంతాల్లో, గ్రామాల్లోని ఇరుకైన వీధుల్లో తిరగలేదు. కాబట్టి అలాంటి ప్రదేశాల్లో షూటింగ్‌ల కోసం వ్యానిటీ వ్యాన్ వెండర్ కేతన్ వ్యానును అరువు తీసుకుంటూ ఉంటాడు. ఇక సల్మాన్ ఖాన్ వ్యానిటీ వ్యాన్‌లో అతని నిలువెత్తు ఫొటో ఉంటుంది. దీన్లో అవసరమైన విలాసాలన్నీ ఉంటాయి. అనూష్క శర్మ వ్యానిటీ వ్యాను స్కాండినేవియన్ శైలిని ప్రతిబింబిస్తూ ఉంటుంది. వరుణ్ ధావన్ వ్యానిటీ వ్యానులో గేమింగ్ కన్‌సోల్స్, అతి పెద్ద బెడ్ ఉంటాయి. కొందరు తారలు తమదైన ప్రత్యేకమైన శైలిని వ్యాన్ ఇంటీరియర్‌లో కనబరచాలనుకుంటారు. అలాంటి వాళ్లలో జాన్ అబ్రహామ్ ఒకడు. నలుపు రంగును అమితంగా ఇష్టపడే జాన్ తన వ్యాన్‌లో టాయ్‌లెట్‌ను కూడా నలుపు రంగులోనే డిజైన్ చేయించుకున్నాడు. అలాగే బయటి వెలుగు వ్యాన్‌లోకి ప్రసరించడం కోసం, బయటి ప్రపంచాన్ని చూడడం కోసం ఫ్లోరింగ్ నుంచి సీలింగ్ వరకూ అద్దాలను ఏర్పాటు చేయించుకున్నాడు. ఇక నటి కంగనా రనౌత్ తన వ్యానిటీ వ్యాన్‌ను అత్యంత ఖరీదైన షీషమ్ కలపతో తయారుచేయించుకుంది.

ఆకాశాన్నంటే ధరలతో...

ఒక వ్యాన్ తయారీకి అయ్యే ఖర్చు సగటున పది నుంచి 15 లక్షల వరకూ ఉంటుంది. బహుళ గదులు, లివింగ్ స్పేస్‌ను విస్తరించుకునే వీలున్న సూపర్ వ్యాన్ ఖరీదు రెండు నుంచి మూడు కోట్ల రూపాయలు. ఇటాలియన్ మార్బుల్, విలాసవంతమైన రిక్లైనర్లు, జిమ్ సౌకర్యాలు కలిగి ఉండే వ్యాన్ 75 లక్షల నుంచి కోటి రూపాయలు. సాధారణ సోఫాలు, ఒక చిన్న ప్యాంట్రీ, చిన్నపాటి స్నానాల గది, టీవి కలిగి ఉండే మధ్యస్థ వ్యాను 30 నుంచి 50 లక్షల రూపాయలు. డ్రెస్సింగ్ ఏరియా, ఏసి మాత్రమే కలిగి ఉండే సాధారణ వ్యాను 15 నుంచి 20 లక్షల రూపాయలు. వ్యానిటీ వ్యాన్లను తారలకు నచ్చినట్టు రూపొందించే వెండర్ కేతన్ రావల్ వ్యానిటీ వ్యాన్ల కొత్త పోకడల గురించి మాట్లాడుతూ... 'మొదట్లో అవసరాల ఆధారంగా వ్యాన్లు తయారయ్యేవి. మారుమూల ప్రాంతాల్లో షూటింగ్ జరిగేటప్పుడు అక్కడ దుస్తులు మార్చుకునే వెసులుబాట్లు, సేద తీరే సౌలభ్యాలు లేకపోవడంతో తారల సినీ జీవితాల్లోకి వ్యానిటీ వ్యాన్లు ప్రవేశించాయి. కాలక్రమేణా అవి వారి హోదాలకు చిహ్నాలుగా మారిపోయాయి. జాన్ అబ్రహామ్ నలుపు రంగును ఇష్టపడతాడు. కాబట్టి వ్యాన్‌లో ఫ్లోరింగ్ నుంచి సింక్, టాయ్‌లెట్ వరకూ అన్నీ నలుపు రంగులోనే రూపొందించాలని నన్ను అడిగాడు" అంటూ వివరించాడు. వ్యానిటీ వ్యాన్లు నిర్మించే మరొక వ్యక్తి ప్రతీక్ మలేవార్, కంగనా రనౌత్ వ్యానిటీ వ్యానును షీషమ్ కలపతో డిజైన్ చేశాడు.

> “కొందరు తారలు తమదైన ప్రత్యేకమైన శైలిని వ్యాన్ ఇంటీరియర్‌లో కనబరచాలనుకుంటారు. అలాంటి వాళ్లలో జాన్ అబ్రహామ్ ఒకడు. నలుపు రంగును అమితంగా ఇష్టపడే జాన్ తన వ్యాన్‌లో టాయ్‌లెట్‌ను కూడా నలుపు రంగులోనే డిజైన్ చేయించుకున్నాడు.”



షారూఖ్ బస్సులో...

వాల్వో బిఆర్9 బస్సు ఫ్లోర్ మొత్తం నలుపు రంగు గాజుతో తయారైంది. పైకప్పు మొత్తం ఉడెన్ ప్యానల్స్ పరిచి ఉంటాయి. దీన్లో ప్యాంట్రీ సెక్షన్, వార్డ్‌రోబ్ సెక్షన్, ప్రత్యేకమైన మేకప్ కుర్చీ, ప్రత్యేకమైన టాయ్‌లెట్‌లు ఉంటాయి. దీన్లో ఇన్‌బిల్ట్ షవర్ ఉంది. ఒక బెడ్‌రూమ్ ఫ్లాట్ పరిమాణంలో ఉంటుంది. ఈ బస్సులో అమర్చి ఉండే ఎలక్ట్రిక్ చైర్ ఒక మీట నొక్కితే బస్సులో ఈ మూల నుంచి ఆ మూలకు తీసుకువెళ్తుంది. పార్కు చేసి ఉన్నప్పుడు ఈ బస్సులో ఒక వైపు భాగాన్ని విస్తరించుకునే వీలుంటుంది.

వర్షాకాలంలో జుట్టు రాలకుండా...

చాలామందికి వర్షాకాలంలో ఎక్కువగా జుట్టు రాలుతూ ఉంటుంది. చుండ్రు, దురద, కురుపులు వేధిస్తుంటాయి. జుట్టు రాలకుండా బలంగా ఉండాలంటే తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో శిరోజాల సమస్యల నుంచి బయటపడేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం...

- పప్పుధాన్యాలు, కూరగాయలతో తయారుచేసిన సూప్‌లు తాగడం శ్రేయస్కరం. నూనె పదార్థాలు, వేపుళ్లు తినకూడదు. ఆహారంలో ఉసిరి, కరివేపాకు, మెంతులను చేర్చుకోవడం వల్ల వర్షాకాలంలో వచ్చే శిరోజాల సమస్యలనుంచి బయటపడవచ్చు.
- ప్రొటీన్లు అధికంగా ఉండే కోడిగుడ్లు, లీన్ మీట్, చేపలు, పప్పు ధాన్యాలు, బీన్స్ తినడం వల్ల శిరోజాలు ఆరోగ్యంగా పెరుగుతాయి.
- సాల్మన్ చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మాడుమీద చుండ్రు, కురుపులు రాకుండా కాపాడతాయి. శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరిగేలా చేస్తాయి.
- పాలకూర, రెడ్ మీట్, పప్పు దినుసుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. వీటిని తరచూ తినడం వల్ల చక్కగా రక్తప్రసరణ జరిగి జుట్టు కుదుళ్లు బలోపేతమవుతాయి. ఫలితంగా శిరోజాలు రాలడం ఆగిపోతుంది.
- విటమిన్-ఎ అధికంగా ఉండే క్యారెట్, బొప్పాయి తినడం వల్ల మాడు పొడిబారకుండా తేమతో నిండి ఉంటుంది. విటమిన్-సి ఎక్కువగా ఉండే సిట్రస్ జాతి పండ్లు, బెర్రీలు తినడం వల్ల మాడు మీద కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది.



నిద్ర పట్టట్లేదా..?

శారీరక, మానసిక ఆరోగ్యానికి నిద్ర అత్యవసరం. పని ఒత్తిడి, ఆందోళన, ఆరోగ్య సమస్యలు, పోషకాహార లోపం లాంటి పలు కారణాల వల్ల సరిగా నిద్ర పట్టక ఇబ్బంది కలుగుతుంటుంది. అలాంటప్పుడు హాయిగా నిద్ర పట్టాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...

- రాత్రిపూట పడుకునేముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు జాజికాయ పొడి లేదా అశ్వగంధ చూర్ణాన్ని కలుపుకొని తాగితే నాడీ వ్యవస్థ నెమ్మదించి వెంటనే నిద్ర వచ్చేస్తుంది.
- చామంతి, తులసి లాంటి హెర్బల్స్‌తో తయారు చేసే టీ తాగినా గాఢంగా నిద్ర పడుతుంది.
- తరచూ కివి, టార్ట్ చెర్రీ, గ్రీన్ టీ తీసుకోవడం వల్ల నిద్ర సమస్యలు తగ్గుతాయి.
- రోజూ ధ్యానం, ప్రాణాయామం చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి హాయిగా నిద్ర పడుతుంది
- రాత్రి భోజనంలో నూనె పదార్థాలు, మసాలాలు చేర్చిన ఆహారం తీసుకోకూడదు. తేలికగా జీర్ణమయ్యే వాటిని మాత్రమే తినాలి.





బన్ని జైత్రయాత్రలో కర్రలతో తలపడుతున్న వివిధ గ్రామాల ప్రజలు

నెత్తురోడిన దేవరగట్టు

» కర్రల సమరంగా మారిన బన్ని జైత్రయాత్ర ఉత్సవం

» అరికెరకు చెందిన ఒకరు మృతి.. 94 మందికి గాయాలు

కర్నూలు/ ఆలూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని దేవరగట్టు క్షేత్రం నెత్తురోడింది. ఉత్సవమూర్తులు మాళ మల్లేశ్వరస్వాముల పల్లకిని వశం చేసుకోవడం కోసం సాగిన బన్ని ఉత్సవం కర్రల సమరాన్ని తలపించింది. ఇరువర్గాలకు చెందిన గ్రామాల భక్తులు ఒకరిపై ఒకరు నిప్పు కాగడాలు, రాళ్లు రువ్వుకున్నారు. అరగంటకుపైగా సాగిన ఈ ఘర్షణలో ఓ భక్తుడు మృతి చెందగా 94 మంది తలలు పగిలి రక్తం చిందింది. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టులో దసరా పర్వదినాన బన్ని జైత్రయాత్ర ఉత్సవాలు ఏటా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. తొలుత నెరణికి, నెరణికితండ, కొత్తపేట గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు దేవరగట్టు కొండపైకి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు గిరి మల్లయ్యస్వామి ఆధ్వర్యంలో మాళ మల్లేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తుల పల్లకితో కొండ దిగి బసవన్నగుడి సమీపానికి చేరుకోబోతుండగా.. తమ గ్రామానికి ఆ పల్లకిని చేర్చాలనే పట్టుదలతో అరికెర గ్రామస్థులు అడ్డుకున్నారు. వారికి ఎల్లార్తి, అరికెర తండా, సులవాయి, ఆలూరు వాసులు తరలివచ్చారు. క్షణాల్లో రాళ్ల వర్షం కురిసింది. భగభగ మండే అగ్గికాగడాలను ఒకరిపై ఒకరు విసురుకున్నారు. వేలాది కర్రలు తలలపై నాట్యమాడాయి. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసు బలగాలను పంపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆ తరువాత యథాప్రకారం స్వామివారి పల్లకితో ముళ్లబండ, పాదాలగట్టు, రక్షబండ, శమీ వృక్షం వద్ద పూజలు చేసి ఉదయం 6:30 గంటలకు బసవన్న గుడికి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు గిరి మల్లయ్యస్వామి భవిష్యవాణి(కార్ణీకం) వినిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను సింహాసనం కట్టకు చేర్చి మహామంగళహారతి ఇవ్వడంతో బన్ని జైత్రయాత్ర ఉత్సవం ముగిసింది. దేవుడి పల్లకి కోసం సాగిన ఘర్షణలో అరికెర గ్రామానికి చెందిన కోసిగి తిమ్మప్ప(50) అనే భక్తుడు తలకు బలమైన గాయాలు కావడంతో ఆలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. 94 మంది తలలు పగిలి రక్తగాయాలయ్యాయి. కాగా, ఉత్సవాలను చూసేందుకు వచ్చిన ఆదోని పట్టణం అరుణజ్యోతి నగర్‌కు చెందిన ఆంజనేయులు(47) గుండెపోటుకు గురై మృతిచెందారు.

మోదీ ఆధునిక రావణుడు

» కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 3: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధునిక రావణుడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఉదిత్ రాజ్ ఆరోపించారు. అంతేకాదు మోదీ బంగారు మహల్ కట్టుకుంటున్నారని, అందులోకి వెళ్లగానే అది కాలి బూడిదవడాన్ని ఆయన కళ్లారా చూస్తారని ఉదిత్ రాజ్ వ్యాఖ్యానించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌తో ప్రభావితుడైన వ్యక్తి... గాంధీ హత్యకు కారకుడని, ఆర్ఎస్ఎస్ ఉగ్రవాద సంస్థ అని ఉదిత్ రాజ్ ఆరోపించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిని అవమానించడం కాంగ్రెస్‌కు అలవాటేనని, ఉదిత్ రాజ్ హద్దులు దాటి మాట్లాడారని బీజేపీ నేత షెహజాద్ పూనావాలా విమర్శించారు.

ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్‌లో

విజయదశమి పూజలు

» పాల్గొన్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య దంపతులు

బాలానగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా మూసాపేట సమీపంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఉన్న 'ఆంధ్రజ్యోతి' ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయంలో గురువారం ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వైస్ ప్రెసిడెంట్ శ్రుతి కీర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, డీజీఎం భరత్ కృష్ణ, ప్రొడక్షన్ విభాగం జీఎం విజయ్‌కుమార్ రావు, డీజీఎంలు రాంప్రసాద్, చినబాబు, ఏజీఎం కోటేశ్వర రావు, ఆర్ఎం అనిల్‌కుమార్, సీనియర్ మేనేజర్ రాజేష్, మేనేజర్ శేఖర్, అసిస్టెంట్ మేనేజర్లు విజయ్‌కృష్ణ, భానుప్రకాశ్, మాధవరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి ప్రింటింగ్ ప్రెస్‌లో విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వైస్ ప్రెసిడెంట్ శ్రుతి కీర్తి దంపతులు, పాల్గొన్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

తలలకు వెలలే చంపేస్తున్నాయా?

రూ.కోటికి పైగా రివార్డులు.. ఆపై ప్రాణభిక్ష.. నమ్మినచోటే హతమవుతున్న మావోయిస్టు నాయకత్వం

» ఏడాదిలో 9 మందికి పైగా కేంద్ర కమిటీ సభ్యుల మృతి

» కేంద్ర కమిటీలో మిగిలిన తెలుగువారు ఆరుగురే

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాల ద్వారా పాలకవర్గాల్లో వణుకు పుట్టించి సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ అగ్రనేతల్లో ఒక్కొరొక్కరు వరుసగా ఎన్‌కౌంటర్లలో హతమవుతున్నారు. అగ్రనాయకత్వానికి సంబంధించిన ఈ ఎన్‌కౌంటర్లను గమనిస్తే అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అంటున్నారు ప్రజా సంఘాల నాయకులు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా 9 మంది కేంద్ర కమిటీ సభ్యులు మరణించారు. చనిపోయిన ఒక్కొక్క కేంద్ర కమిటీ సభ్యుని తలపై రూ.కోటికి పైగా రివార్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. అదే ప్రస్తుతం వారి పాలిట శాపమైందని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని మాజీ మావోయిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర కమిటీ సభ్యులు నర్సింహచలం అలియాస్ సుధాకర్, గాజర్ల రవి, పుల్లూరి ప్రసాదరావు అలియాస్



చంద్రన్న, మోడెం బాలకృష్ణ, రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, కడారి సత్యనారాయణ రెడ్డి అలియాస్ కోసా, కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్, సోరెన్ ఈ ఏడాది వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మరణించారు. నంబాల కేశవరావు, గాజర్ల రవి ఎన్‌కౌంటర్ సమయంలో మాత్రమే సహచర మావోయిస్టులు ఎక్కువగా చనిపోయారు. మిగతా వారిలో చాలా సంఘటనల్లో నాయకత్వమే ప్రాణాలు కోల్పోయింది. దీనికి కారణాలేమిటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, మావోయిస్టు నాయకత్వానికి సంబంధించిన కీలక సమాచారాన్ని స్థానికులు, లొంగిపోవాలనుకుంటున్న నక్సల్స్ నుంచి సేకరిస్తున్నారన్న విషయం పోలీసు అధికారుల సంభాషణల ద్వారా స్పష్టమవుతోంది. డబ్బెవరికి చేదండి.. కోట్ల రూపాయల రివార్డులు ఉన్నపుడు సమాచారం అదే వస్తుందని పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతున్నారంటే క్షేత్రస్థాయిలో మావోయిస్టు నాయకత్వాన్ని గుండెల్లో దాచుకునే రోజులు పోయినట్లేనని స్పష్టం అవుతోంది.

సొంత నాయకుల సమాచారం లీక్!

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో మొదట్లో 42 మంది సభ్యులుండేవారు. ముఖ్య నాయకులతో పొలిట్ బ్యూరో ఉండేది. జనతన సర్కార్‌తో సొంత సామ్రాజ్యాన్ని నిర్మించిన మావోయిస్టులు పదేళ్లుగా ఒకరి తర్వాత మరొకరు ఎన్‌కౌంటర్లలో మరణిస్తూనే ఉన్నారు. కొత్త రిక్రూట్‌మెంట్ లేక, ఉన్న వారిలో చాలామంది ప్రాణాలపై, డబ్బుపై ఆశతో సొంత నాయకుల సమాచారాన్నే లీక్ చేస్తున్నారన్న విషయాన్ని ఇటీవల కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డి ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ విడుదల చేసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీని నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం ఒకవైపు పనిచేస్తుండగా.. పార్టీలో ఉన్న వారు ఆయుధాలు వదిలి లొంగిపోవాలంటూ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ లేఖ రాయడం, దానిపై ఆగస్టు 15వ తేదీ ఉండటం, సెప్టెంబరులో ఆ లేఖ బయటకు రావడం కలకలం సృష్టించింది. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ నుంచి మరికొన్ని లేఖలు బయటకు వచ్చిన క్రమంలోనే ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఒకేచోట పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించడం అనుమానాస్పద వ్యవహారమేనని ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. ఇవన్నీ గమనిస్తుంటే ద్రోహులు బయట లేరు.. పార్టీలోనే ఉన్నారనే అనుమానాలు బలపడుతున్నాయని మాజీ మావోయిస్టులు అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారు లొంగిపోవాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర కమిటీల అనుమతి తీసుకుని తమ ఆయుధాన్ని పార్టీకి అప్పగించి బయటకు వచ్చే స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని, అందుకు కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల సుజాత లొంగుబాటు ఒక ఉదాహరణ అని వారు పేర్కొంటున్నారు. మే నెలలో లొంగుబాటు విషయాన్ని ప్రసాదరావు ద్వారా సుజాత కేంద్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లిందని, అదే నెలలో ప్రసాదరావు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని అంటున్నారు. అంటే నక్సల్స్ సమాచార చానల్ గుర్తించి నాయకత్వాన్ని టార్గెట్ చేయడం పోలీసులకు అలవాటుగా మారిందని మాజీ మావోయిస్టులు అనుమానిస్తున్నారు.

త్వరలో లొంగిపోనున్న మరో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు!

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన అగ్రనాయకుల్లో చాలా మంది 60 ఏళ్ల వయస్సు వారే. ఈ ఏడాది జనవరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో 20మంది సభ్యులున్నారు. వీరిలో 15మంది సభ్యులు తెలుగువారే. పోతుల సుజాత లొంగుబాటు, ఇతర కేంద్ర కమిటీ సభ్యుల ఎన్‌కౌంటర్ల తర్వాత ఇంకా పార్టీలో మిగిలిన తెలుగువారు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు, పసునూరి నరహరి, మల్లోజుల వేణుగోపాల్, మల్లా రాజిరెడ్డి, తిప్పిరి తిరుపతి, పాక హన్మంతు మాత్రమే. వీరిలో మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనూతో పాటు మరో కేంద్ర కమిటీ సభ్యుడు కూడా త్వరలో లొంగిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయని నిఘావర్గాల ద్వారా తెలుస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

» మావోయిస్టుల ఘాతుకం

» బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గడ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్రయాదవ్ తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అలరించే తొలి గీతం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇక తాజాగా చిత్రబృందం తొలి గీతాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. దసరా సందర్భంగా 'మీసాల పిల్లా' అంటూ కథానాయికను ఆటపట్టిస్తూ సాగే ఈ గీతం ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. చాలా రోజుల తర్వాత మళ్లీ చిరంజీవికి బాలీవుడ్ గాయకుడు ఉదిత్ నారాయణ్ తన గళాన్ని అందించగా, ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో స్వరాలందించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

డిసెంబర్‌లో అఖండ తాండవం



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2: తాండవం'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' చిత్రానికి ఇది కొనసాగింపు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. డిసెంబర్ 5న 'అఖండ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో బాలకృష్ణ శక్తిమంతమైన లుక్‌లో కనిపించారు. సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుదిదశలో ఉన్నాయి. సంగీతం: థమన్ ఎస్, సినిమాటోగ్రఫీ: సీ రాంప్రసాద్, సంతోశ్ డి.

వెంకీ క్లాప్‌తో నాని సినిమా ప్రారంభం



విభిన్న కథాంశాలను ఎన్నుకొని చిత్రాలు చేస్తూ వరుస విజయాలు సాధిస్తున్న హీరో నాని కొత్త చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. 'ఓజీ' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న దర్శకుడు సుజీత్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరో నానితో కలసి వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నాని తండ్రి రాంబాబు ఘంటా కెమెరా స్విచ్ ఆన్ చేయగా, హీరో వెంకటేశ్ ఈ వేడుకకు హాజరై తొలి క్లాప్ ఇచ్చారు. దర్శకులు రాహుల్ సంకృత్యాన్, శ్రీకాంత్ ఓదెల, శౌర్యువ్ కలసి ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. హీరో నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని దర్శకనిర్మాతలు చెప్పారు. యాక్షన్, ఎమోషన్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో అందరికీ నచ్చే విధంగా చిత్రం ఉంటుందని దర్శకుడు సుజీత్ చెప్పారు.

మంచి సందేశాన్నిచ్చే 'అరి'



వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్ ప్రధాన పాత్రధారులుగా జయశంకర్ తెరకెక్కించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది దీని ఉపశీర్షిక. ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి.శేషురెడ్డి మారంరెడ్డి, నాయుడు నిర్మించారు. సినిమాను ఏషియన్ సురేశ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈనెల 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

నవలారచయిత లల్లాదేవి అస్తమయం



కలం పేరునే తన పేరుగా మార్చుకుని పలు బాషా చిత్రాలకు కథలను అందించిన ప్రముఖ నవలా రచయిత లల్లాదేవి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం గ్రామానికి చెందిన ఆయన అసలు పేరు పరుచూరి నారాయణాచార్యులు (85). లల్లాదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం అర్ధరాత్రి కన్నుమూశారు. శుక్రవారం స్వగ్రామమైన నిమ్మగడ్డవారిపాలెంలో ఆయనకు గ్రామస్థులు, పలువురు ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు.

పురాతన చరిత్రకు అక్షర రూపాన్నిచ్చి నవలల రూపంలో అందించారు లల్లాదేవి. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ పురాణ పండిట్‌గా పనిచేస్తూనే ఆయన రచించిన లల్లరామాయణం ఎంతో ప్రజాదరణ పొందింది. 1250 శ్లోకాలతో వాత్సాయన కామసూత్రాలు రాశారు. అంతేకాకుండా ఆయన రచించిన మహామంత్రి తిమ్మరుసు నాటకం 2003 వరకు సీనియర్ ఇంటర్మీడియట్‌కు ఉపవాచకంగా ఉంది. ఆయన రాసిన 'శ్వేతనాగు' నవల అదే పేరుతో సౌందర్య కథానాయికగా సినిమాగా వచ్చింది. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన 'కరుణించిన కనకదుర్గ', కన్నడలో అంబరీష్‌తో, అరణ్యలల్లా, అభిమన్యు సినిమాలు ఈయన రాసిన నవలల ఆధారంగా రూపుదిద్దుకున్నాయి.

-ప్రత్తిపాడు, ఆంధ్రజ్యోతి

దసరా సినీ సందడి

చాలా రోజుల తర్వాత మళ్లీ దసరా పండుగ తెలుగు చిత్ర పరిశ్రమలో జోష్ నింపింది. పలు చిత్రాల ప్రారంభోత్సవాలతో ఇండస్ట్రీ కళకళలాడింది. వర్ధమాన కథానాయకుల నుంచి స్టార్ హీరోల వరకు నటిస్తోన్న చిత్రాల తాజా అప్డేట్స్‌తో నిర్మాణ సంస్థలు సినీ ప్రేమికులకు ఆనందాన్ని కలిగించాయి.

విభిన్న కథాంశంతో..



బ్లాక్ బస్టర్ హిట్ 'సామజవరగమన' తర్వాత కథానాయకుడు శ్రీవిష్ణు, దర్శకుడు రామ్ అబ్బరాజు కాంబినేషన్ మరోసారి విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో సాయి దుర్గాతేజ్ క్లాప్ కొట్టారు. కథానాయకుడు నారా రోహిత్‌తో కలసి స్క్రిప్ట్‌ని నిర్మాతలకు అందజేశారు. సీనియర్ నటుడు వీకే నరేశ్, వెన్నెల కిశోర్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

రాగ్ మయూర్ 'అనుమాన పక్షి'



రాగ్ మయూర్ కథానాయకుడిగా విమల్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'అనుమాన పక్షి' అని మేకర్స్ టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని చిలక ప్రొడక్షన్స్ బేనర్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. సినిమా త్వరలోనే థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'అనుమాన పక్షి' అనే పేరు రాగ్‌మయూర్ పాత్ర విచిత్ర స్వభావాన్ని సూచిస్తోంది.

ఈతరానికి నచ్చే కథ



అభిరామ్ కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. అభిరామ్ రెడ్డి దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. అనూరాధ దేవి సమర్పిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు సీనియర్ జర్నలిస్ట్ భగీరథ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో అభిరామ్ క్లాప్ కొట్టారు. 'సినిమా రెగ్యులర్ షూటింగ్ దీపావళి తర్వాత ప్రారంభమవుతుందని, ఈ తరానికి నచ్చే కథతో నిర్మిస్తున్నామని, త్వరలోనే నటీ నటులను ఎంపిక చేస్తామని' నిర్మాత అభిరామ్ రెడ్డి దాసరి చెప్పారు.

సరికొత్త ప్రేమ కథ



చైతన్య రావు మదాడి హీరోగా క్రాంతి మాధవ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సరికొత్త ప్రేమ కథా చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. కథానాయికగా ఐరా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రాన్ని పూర్ణ నాయుడు, శ్రీకాంత్ వి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దేవ కట్టా క్లాప్ కొట్టగా, కె.ఎల్.దామోదర ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి సన్నివేశానికి వర ముళ్లపూడి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు క్రాంతి మాధవ్ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ లవ్ స్టోరీగా ఈ చిత్రం రాబోతోంది. అందమైన లోకేషన్లలో చిత్రీకరిస్తున్నాం' అని చెప్పారు. హీరో చైతన్య రావు మాట్లాడుతూ 'మయసభ', 'ఘాటీ' తర్వాత ఇంత మంచి సినిమా చేస్తుండటం నా అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు.

కామ్రేడ్ కల్యాణ్



శ్రీవిష్ణు టైటిల్ రోల్ పోషిస్తోన్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. మహిమా నంబియార్ కథానాయిక. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ చిత్ర టైటిల్‌తో పాటు టీజర్ విడుదల చేశారు. 1992లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల గ్రామ నేపథ్యంలో సాగే కథ ఇది. నక్సలైట్ ముప్పు పెరుగుతోందని రేడియోలో అనౌన్స్ చేసే సన్నివేశంతో మొదలైన టీజర్ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో శ్రీవిష్ణు డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారు. రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విభిన్న మనస్తత్వాల 'ఉత్తర'



నటుడు శివాజీ ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మిస్తోన్న చిత్రంలో నటి లయ ముఖ్య పాత్ర పోషిస్తోన్న విషయం తెలిసిందే. శివాజీ ప్రొడక్షన్స్ బేనర్‌పై రానున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈటీవి విన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు. తాజాగా లయ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. లయ 'ఉత్తర' అనే గృహిణి పాత్రను పోషిస్తున్నారు. బయటికి సాధారణ మహిళగా కనిపిస్తూనే, లోపల నేర ప్రవృత్తిని దాచిపెట్టుకుంటూ, రెండు రకాల మనస్తత్వాలతో సాగే పాత్రలో లయ తన నట విశ్వరూపాన్ని చూపించబోతున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది.

కొత్త అధ్యాయానికి నాంది



'మిరాయ్' భారీ విజయం తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ 'రాజు గారి గది 4: శ్రీచక్రం' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రాజు గారి గది సిరీస్‌లో నాలుగో భాగంగా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి ఓంకార్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ఎర్రటి చీరలో ఒక మహిళ ఉగ్రరూపంలో, కాళిమాతని గుర్తుచేసే దేవతా విగ్రహం ముందు ఎగురుతోంది. 'ఏ డివైన్ హారర్ బిగిన్స్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో 'శ్రీచక్రం' ఓ కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని మేకర్స్ ప్రకటించారు.

'మావా' ఆరంభం



ప్రేమ్, వాసంతిక జంటగా నూతన దర్శకుడు ఏ.ఆర్.ప్రభావ్ తెరకెక్కించనున్న 'మావా' చిత్రం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. దీన్ని వెంకటేశ్ బాలసాని నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా వెంకటేశ్ బాలసాని క్లాప్ కొట్టగా, ఆయన సతీమణి పద్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. "మావా' స్నేహం మీద సాగే ఒక భావోద్వేగ ప్రయాణమని, దర్శకుడు ప్రభావ్ ఓ సరికొత్త పాయింట్‌తో తెరకెక్కించబోతున్నారని చిత్ర బృందం పేర్కొంది.



మన ఆర్థికం పటిష్ఠం

అంతర్జాతీయ ఆటుపోట్లపై బేఫికర్ • ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు ఆటుపోట్లున్నప్పటికీ మన ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి ఢోకా లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భరోసా ఇచ్చారు. ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు స్థిరీకరణ శక్తిలా మారిందన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన చర్యలతో మన ఆర్థిక వ్యవస్థ ఎలాంటి సవాళ్లనైనా తట్టుకునే స్థితికి చేరిందన్నారు. ఢిల్లీలో జరుగుతున్న 'కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్, 2025' సదస్సులో సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశీయ వినియోగం, పెట్టుబడులే మన ఆర్థిక వ్యవస్థకు శ్రీరామరక్షగా మారాయన్నారు. పలు సానుకూల అంశాలున్నా ఎలాంటి అలసత్వానికి తావు లేదని హెచ్చరించారు. ఆర్థిక ఆంక్షలు, సుంకాలు, పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలను మార్చివేస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆమె గతంలో ఎన్నడూ లేని అనిశ్చితి, ఆటుపోట్ల యుగమని ఆమె అభివర్ణించారు.

ప్రైవేటు పెట్టుబడులు: పెరుగుతున్న వ్యాపారావకాశాలతో ప్రైవేటు రంగం పెట్టుబడులపై దృష్టి కేంద్రీకరించిందని, ముఖ్యంగా ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టులపై ఆసక్తి చూపిస్తోందని చెప్పారు. గత ఐదేళ్లలో తమ ప్రభుత్వం ఏటికేటికీ ప్రభుత్వ మూలధన పెట్టుబడులను పెంచుకుంటూ పోతున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.11.21 లక్షల కోట్ల ప్రభుత్వ పెట్టుబడుల లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

నెల రోజుల్లో వెండి రూ.24,500 అప్

న్యూఢిల్లీ: పెట్టుబడి లాభాల కోసం చూసే వారిని బంగారం కంటే వెండి మెరిపిస్తోంది. గత నెల కిలో వెండి ధర రూ.24,500 (19.4%) పెరిగి రూ.1,50,500కు చేరి మదుపరులకు మంచి లాభాలు పంచింది. ఇదే సమయంలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) పసిడి ధర రూ.14,300 (13.56 శాతం) లాభంతో రూ.1.2 లక్షలకు చేరింది. సరఫరా అడ్డంకులతో పాటు వెండికి పారిశ్రామిక రంగం నుంచి డిమాండ్ పెరగడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వెండి ఉత్పత్తిలో 60 నుంచి 70 శాతం వరకు పారిశ్రామిక అవసరాలకే వినియోగమవుతోంది. దీనికి తోడు గత ఆరేళ్లుగా వెండి ఉత్పత్తి, సరఫరా డిమాండ్‌కు తగ్గట్టు లేదు. సౌర విద్యుత్, విద్యుత్ వాహనాలు, 5జీ అవసరాలతో వచ్చే ఏడాది వెండికి మరింత గిరాకీ ఏర్పడుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దీంతో ఔన్స్ వెండి ధర వచ్చే ఏడాది జూన్‌కల్లా 1980 జనవరి 17న నమోదైన 49.95 డాలర్ల రికార్డు స్థాయిని అధిగమించి 52-55 డాలర్లకు చేరుతుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా శుక్రవారం బంగారం ధరల 5 రోజుల రికార్డు ర్యాలీకి బ్రేక్ వేసింది. ఢిల్లీలో మేలిమి బంగారం 10 గ్రాములు రూ.500 తగ్గి రూ.1,20,600 పలికింది. ఆభరణాల బంగారం సైతం అదే మొత్తంలో తగ్గి రూ.1,20,000 వద్ద స్థిరపడింది. వెండి కూడా రూ.500 తగ్గి రూ.1.50 లక్షలు పలికింది

అణు రియాక్టర్ల ఏర్పాటు రేస్‌లో
అదానీ, రిలయన్స్

న్యూఢిల్లీ: దేశంలో భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల (బీఎస్ఎంఆర్) ఏర్పాటుపై అదానీ, రిలయన్స్ కంపెనీలతో పాటు మరో నాలుగు ప్రైవేటు కంపెనీలు ఆసక్తిని ప్రదర్శించాయి. ఇందుకోసం ఆరు రాష్ట్రాల్లో 16 ప్రదేశాలను గుర్తించారు. రియాక్టర్ల ఏర్పాటుకు ఆసక్తి గల కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానిస్తూ భారత అణు ఇంధన సంస్థ (ఎన్‌పీసీఐఎల్) చేసిన ప్రకటనకు అదానీ, రిలయన్స్‌తో పాటు జిందాల్ స్టీల్ అండ్ పవర్, టాటా పవర్, హిండాల్కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ స్పందించాయి. ఇలాంటి రియాక్టర్లు ఏర్పాటు చేసేందుకు అనువైన 16 సైట్లను గుర్తించిన ఆయా కంపెనీలు ఆ ప్రదేశాలకు సంబంధించిన ప్రాథమిక నివేదికలను కూడా ఎన్‌పీసీఐఎల్‌కు సమర్పించాయి. ఆ సైట్లలో రెండు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	520
వరంగల్	502	గోదావరి	520
చిత్తూరు	528	విశాఖపట్నం	510
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	119
వరంగల్	110	గుంటూరు	125
కరీంనగర్	110	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	114
కర్నూలు	110	నెల్లూరు	119
విశాఖపట్నం	122	అనంతపురం	119
గోదావరి	119		

'నవరాత్రి' అమ్మకాల జాతర



ఇటు పండుగ సందడి, అటు ధరల తగ్గింపు
కొనుగోళ్లకు పోటెత్తిన కస్టమర్లు

న్యూఢిల్లీ: గురువారంతో ముగిసిన దసరా నవరాత్రులు విభిన్న రంగాలకు చెందిన కంపెనీలకు హర్షాతిరేకాన్ని పంచాయి. నిత్యావసర వస్తువులతో పాటు ఆటోమొబైల్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, వినియోగ వస్తువుల కంపెనీలు రికార్డు అమ్మకాలు నమోదు చేశాయి. గత నెల 22 నుంచి అమలులోకి వచ్చిన జీఎస్‌టీ రేట్ల తగ్గింపు పండుగ కొనుగోళ్లకు కొత్త ఉత్తేజం అందించిందని కంపెనీలు చెబుతున్నాయి. దీనికి తోడు బడ్జెట్లో ప్రకటించిన ఆదాయపు పన్ను మార్పులు కూడా వినియోగవృద్ధికి దోహదపడ్డాయి. జీఎస్‌టీ రేట్లు అమలులోకి వచ్చిన తొలి రోజు నుంచే ప్రజలు తమకు కావలసిన వస్తువులు, గృహోపకరణాలు, కార్ల కొనుగోలుకు పరుగులు తీసినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాదిలో విలువ, పరిమాణంపరంగా రెండంకెల వృద్ధికి ఈ అమ్మకాలు దోహదపడతాయని పలు కంపెనీలు భావిస్తున్నాయి. కేరళలో ఓనం నుంచి ప్రారంభమై దీపావళితో ముగిసే 45 రోజుల పండుగల సీజన్‌లో మిగిలిన రోజుల్లో కూడా ఇదే ఉత్సాహం కొనసాగవచ్చునని ఆశ పడుతున్నాయి.

పెద్ద స్ర్కీన్ టీవీలపై మోజు

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగంలోని ఎల్‌జీ, హేయర్, గోద్రెజ్ అప్లయెన్సెస్ కూడా గత నవరాత్రితో పోల్చితే ఈ సీజన్‌లో భారీగా రెండంకెల అమ్మకాల వృద్ధిని నమోదు చేసినట్టు ప్రకటించాయి. తగ్గిన జీఎస్‌టీ రేట్లను పరిగణనలోకి తీసుకుని ఇప్పటివరకు చిన్న తెర టీవీలను వినియోగిస్తున్న వారు పెద్ద స్ర్కీన్ టీవీలు కొనేందుకు ఆసక్తి చూపారు. అలాగే ఇంధన సామర్థ్యం గల ఎయిర్ కండిషనర్ల కొనుగోలు చేశారు. రెండున్నర లక్షలకు పైగా ధర గల 85-100 అంగుళాల టీవీలు భారీగా అమ్ముడుపోయినట్టు హేయర్ ప్రకటించింది. దేశంలోని అతి పెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ అమ్మకాలు 20-25% పెరిగినట్టు తెలుస్తోంది. విజయ్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలు సైతం 20% పెరిగాయి.

మారుతి అమ్మకాలు పదేళ్ల గరిష్ఠం



కార్ల దిగ్గజం మారుతి పదేళ్ల కాలంలో గరిష్ఠ అమ్మకాలు నమోదు చేసింది. నవరాత్రి తొలి ఎనిమిది రోజుల కాలంలో 1.65 లక్షల కార్లను విక్రయించింది. గత ఏడాది నవరాత్రి పర్వదినాల్లో కంపెనీ 85 వేల కార్లు మాత్రమే విక్రయించింది. ఈ సీజన్‌లో 2 లక్షల అమ్మకాల మైలురాయి చేరగలమన్న ఆశతో ఉంది. దీనికి తోడు ప్రస్తుతం కంపెనీ చేతిలో రెండున్నర లక్షల బుకింగ్‌లున్నాయి. కాగా సెప్టెంబర్ నెలలో తమ ఉత్పత్తి 26% పెరిగి 2,01,915 యూనిట్లకు చేరినట్టు మారుతి తెలిపింది. గత ఏడాది ఇదే నెలలో సంస్థ 1,59,743 యూనిట్లు ఉత్పత్తి చేసింది. కాంపాక్ట్ కార్లు, యుటిలిటీ వెహికల్స్, ఎంట్రీ లెవెల్ మోడళ్లకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ వృద్ధి సాధ్యమైందని కంపెనీ తెలిపింది. టాటా మోటార్స్ మహీంద్రా, హ్యుండయ్ కంపెనీలు కూడా భారీ అమ్మకాలు నమోదు చేసినట్టు ప్రకటించాయి.

త్వరలో వైజాగ్‌లో హెచ్ఎస్‌బీసీ బ్యాంకు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలోని అతి పెద్ద విదేశీ బ్యాంకుల్లో ఒకటైన హెచ్ఎస్‌బీసీ, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు విస్తరిస్తోంది. వైజాగ్‌తో పాటు దేశంలో మరో 20 చోట్ల బ్రాంచ్‌లు ప్రారంభించేందుకు ఆర్‌బీఐ తమకు అనుమతి ఇచ్చిందని హెచ్ఎస్‌బీసీ ఇండియా ఇంటర్నేషనల్ అండ్ ప్రీమియం బ్యాంకింగ్ విభాగం హెడ్ సందీప్ బాత్రా వెల్లడించారు, ఇందులో నాలుగు శాఖలను ఈ ఏడాది చివరిలోగా ఏర్పాటు చేస్తామన్నారు. సరైన ప్రాంతంలో, సరైన భవనం దొరికిన వెంటనే వైజాగ్ బ్రాంచ్ కూడా ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డులోని హెచ్ఎస్‌బీసీ బ్రాంచ్‌ను హైటెక్ సిటీ సమీపంలోకి మార్చిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆంధ్రజ్యోతి బిజినెస్‌తో ఈ విషయం వెల్లడించారు. ఈ 20 కొత్త శాఖలు ప్రారంభమైతే భారత్‌లో తమ శాఖల సంఖ్య 46కు చేరుతుందన్నారు. హెచ్ఎస్‌బీసీ ఇండియాకు హైదరాబాద్ అత్యంత కీలక మార్కెట్ అని బాత్రా చెపారు. తమ జీసీసీ కూడా ఇక్కడే ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోని సంపన్న భారతీయులకు ప్రీమియం బ్యాంకింగ్, సంపద నిర్వహణ సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు ఊరట

న్యూఢిల్లీ: ప్రముఖ జువెలరీ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు బొంబాయి హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. కంపెనీ పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఉన్న వార్తలు, విషయాలను వెంటనే తొలగించాలని బొంబాయి హైకోర్టు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, మీడియా సంస్థలను ఆదేశించింది. జస్టిస్ సందీప్ వీ మర్నే ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, సంస్థ లండన్ బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా అక్కడి స్థానిక సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సేవలను ఉపయోగించుకుంది. దాన్ని విమర్శిస్తూ ఇటీవల మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌పై అనేక ప్రతికూల వార్తలు, కథనాలు మీడియాలో వచ్చాయి. ఆ వార్తలు తమ పరువుప్రతిష్ఠలకు భంగం కలిగించే రీతిలో ఉన్నందున వెంటనే వాటిని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కంపెనీ హైకోర్టును కోరింది. కంపెనీ వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

రెండో రోజూ లాభాల్లో మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 223.86 పాయింట్ల లాభాలతో 81,207.17 వద్ద క్లోజ్ కాగా నిఫ్టీ 57.95 పాయింట్ల లాభంతో 24,894.25 వద్ద ముగిసింది. మెటల్ స్టాక్స్‌లో ర్యాలీతో పాటు, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవడం శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ ఒక దశలో 81,251.99 పాయింట్ల ఇంట్రా డే హైని తాకింది. శుక్రవారం సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్ షేరు అత్యధికంగా 3.4 శాతం లాభంతో రూ.173.20 వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,18,040 ▼	1,08,200 ▼	1,61,000 ▲
విజయవాడ	1,20,050 ▼	1,14,000 ▼	1,50,000 ▲
విశాఖపట్నం	1,20,620 ▲	1,08,200 ▼	1,61,000 ▲
రాజమండ్రి	1,18,530 ▼	1,08,650 ▼	1,49,800 ▲
ప్రొద్దుటూరు	1,21,900 ▼	1,12,150 ▼	1,50,000 ▲
ముంబై	1,16,954 ▼	1,07,130 ▼	1,45,610 ▲

స్పోర్ట్స్

ఇంగ్లండ్..అదిరే బోణీ

- 10 వికెట్లతో దక్షిణాఫ్రికాపై గెలుపు
- మహిళల వన్డే వరల్డ్ కప్



నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఆస్ట్రేలియా X శ్రీలంక

గువాహటి: వన్డే ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ మహిళలు ఏకంగా 10 వికెట్లతో దక్షిణాఫ్రికాను చిత్తు చేశారు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన సఫారీలు ఇంగ్లండ్ స్పిన్నర్ల ధాటికి కేవలం 20.4 ఓవర్లలోనే 69 పరుగులకు కుప్పకూలారు. తద్వారా ఇంగ్లండ్‌పై అత్యల్ప స్కోరు నమోదు చేశారు. ఇంకా..వరల్డ్ కప్‌లో రెండో అత్యల్ప స్కోరును, ఓవరాల్‌గా మూడో అత్యల్ప స్కోరు సాధించిన చెత్త రికార్డును సౌతాఫ్రికా మహిళలు మూట గట్టుకున్నారు. సినాలో జఫ్టా (22) మినహా మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం స్వల్ప ఛేదనను ఇంగ్లండ్ 14.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 73 పరుగులతో పూర్తి చేసింది.

సంక్షిప్తస్కోర్లు: దక్షిణాఫ్రికా: 20.4 ఓవర్లలో 69 ఆలౌట్ (సినాలో జఫ్టా 22, లిన్సీ స్మిత్ 3/7, బ్రంట్ 2/5, చార్లీ 2/14, ఎకిల్‌స్టోన్ 2/19); **ఇంగ్లండ్:** 14.1 ఓవర్లలో 73/0 (అమీ 40 నాటౌట్).

పాకిస్థాన్‌కు షాకిచ్చిన బంగ్లాదేశ్

కొలంబోలో గురువారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు బంగ్లాదేశ్ 7 వికెట్లతో షాకిచ్చింది. మొదట పాకిస్థాన్ 38.3 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌటైంది. రమీన్ (23), ఫాతిమా సనా (22) రాణించారు. షోర్నా 3, నహీదా, మరుఫా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 31.1 ఓవర్లలో 131/3 స్కోరు చేసి గెలుపొందింది. రుబియా (54 నాటౌట్) హాఫ్ సెంచరీ చేసింది.

అమ్మాయిల పోరులోనూ కరచాలనం లేనట్టే!

న్యూఢిల్లీ: మహిళల ప్రపంచకప్‌లో భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం కీలక పోరు జరగనున్న నేపథ్యంలో కరచాలన అంశం మరోసారి తెర పైకొచ్చింది. ఇటీవలి ఆసియా కప్‌లో సూర్యకుమార్ సేన వ్యవహరించినట్టే భారత అమ్మాయిలు కూడా పాక్ క్రికెటర్లతో కరచాలనం చేయబోరని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తొలుత జరిగే ఫొటో షూట్, అలాగే టాస్ సమయంలోనూ పాక్ కెప్టెన్‌తో షేక్‌హ్యాండ్‌కు భారత సారథి హర్మన్‌ప్రీత్ దూరంగా ఉంటుందని బోర్డు వర్గాలు తెలిపాయి.


జడేజా (104 బ్యాటింగ్)


రాహుల్ (100)

త్రిశతక మోత

జురెల్, జడేజా, రాహుల్ సెంచరీలు

286 పరుగుల ఆధిక్యం

భారత్ తొలి ఇన్నింగ్స్ 448/5

వెస్టిండీస్ మొదటి ఇన్నింగ్స్ 162 ఆలౌట్

అహ్మదాబాద్: వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ రెండో రోజే భారత్ పూర్తిగా పట్టు బిగించింది. ప్రత్యర్థిని మొదటి ఇన్నింగ్స్‌లో 162 పరుగులకే కూల్చిన ఆతిథ్య జట్టు..ముగ్గురు బ్యాటర్లు జురెల్ (125), జడేజా (104 బ్యాటింగ్), కేఎల్ రాహుల్ (100) శతక మోత మోగించడంతో భారీ స్కోరు చేసింది. శుక్రవారం ఆట ఆఖరికి తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లకు 448 పరుగులు సాధించింది. 286 పరుగుల ఆధిక్యం కూడగట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 121/2తో భారత్ రెండోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించగా, కిందటిరోజు బ్యాటర్లు గిల్, రాహుల్ విండీస్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. అర్ధ శతకం సాధించిన వెంటనే కెప్టెన్ గిల్ (50) స్పిన్నర్ చేజ్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ కొట్టబోయి నిష్క్రమించాడు. గిల్, రాహుల్ రెండో వికెట్‌కు 98 పరుగులు జోడించారు. మరోవైపు 57 పరుగుల వద్ద లైఫ్ దక్కించుకున్న రాహుల్ ఆపై జాగ్రత్తగా ఆడుతూ సెంచరీ పూర్తి చేశాడు. ఒక చేతితో బ్యాటు పైకెత్తి, మరో చేతి రెండు వేళ్లను నోటిలో ఉంచుకోవడం ద్వారా ఇటీవల పుట్టిన కుమార్తెకు ఈ సెంచరీని రాహుల్ అంకితమిచ్చాడు. కానీ వెంటనే స్పిన్నర్ వారికన్ బౌలింగ్‌లో రాహుల్ పెవిలియన్ చేరాడు.

జడేజా, జురెల్ ద్విశతక భాగస్వామ్యం: రక్షణాత్మక ధోరణిలో బ్యాటింగ్ చేసిన జురెల్ తొలుత మూడంకెల మార్క్ చేరుకున్నాడు. అయితే జురెల్‌ను అవుట్ చేయడం ద్వారా 206 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి లెఫ్టామ్ స్పిన్నర్ పియరీ ముగింపు పలికాడు. మరోవైపు వికెట్ స్పిన్నర్లకు అనుకూలిస్తున్నా జడేజా పరుగులు రాబట్టాడు. స్పిన్నర్ల బౌలింగ్‌లో క్రీజు బయటకు వచ్చి భారీ షాట్లతో అలరించాడు. ఈక్రమంలో అతడు శతకం పూర్తి చేశాడు. రెండోరోజు ఆట ఆఖరికి జడేజాతోపాటు సుందర్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.


జురెల్ (125)

3 ఒక ఇన్నింగ్స్‌లో ముగ్గురు భారత బ్యాటర్లు శతకాలు చేయడం ఈ ఏడాది ఇది మూడోసారి. గత పర్యటనలో ఇంగ్లండ్‌పై లీడ్స్, మాంచెస్టర్‌లో ఈ ఘనత సాధించారు.

10 ఓపెనర్‌గా కేఎల్ రాహుల్‌కి పదో శతకం. ఈక్రమంలో తొమ్మిది సెంచరీలు చేసిన రోహిత్‌ను దాటాడు.

80 టెస్టులలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన భారత బ్యాటర్ జడేజా. ఈక్రమంలో ధోనీని (79)ని అధిగమించాడు. పంత్ (90) టాప్‌లో ఉన్నాడు.

12 సెంచరీ చేసిన 12వ భారత కీపర్ జురెల్.

సైన్యానికి అంకితం

తన టెస్ట్ తొలి శతకాన్ని భారత సైన్యానికి అంకితమిస్తున్నట్టు జురెల్ ప్రకటించాడు. మూడంకెల స్కోరుకు చేరుకోగానే ఆర్మీకితో పాటు కార్గిల్ యుద్ధ యోధుడైన తన తండ్రికి గౌరవ సూచకంగా అతడు సెల్యూట్ చేశాడు.

స్టేడియంలో ప్రేక్షకులేరీ..?

తొలి టెస్ట్‌కు ప్రేక్షకులు కరువయ్యారు. తొలిరోజు గురువారమేకాదు.. రెండోరోజైన శుక్రవారం కూడా స్టాండ్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. రెండ్రోజులు సెలవు దినాలున్నప్పటికీ ప్రేక్షకులు స్టేడియం వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. విండీస్ లాంటి చిన్న జట్టుతో ఆడే మ్యాచ్‌లను ప్రపంచంలోనే అతి పెద్ద (లక్షా 32వేల సీటింగ్) స్టేడియంలో నిర్వహించడమేమిటని క్రికెట్ ప్రేమికులు బీసీసీఐని తప్పుపడుతున్నారు.

స్కోరుబోర్డు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) జురెల్ (బి) బుమ్రా 8, చందర్‌పాల్ (సి) జురెల్ (బి) సిరాజ్ 0, అథనజె (సి) రాహుల్ (బి) సిరాజ్ 12, బ్రండన్ (బి) సిరాజ్ 13, చేజ్ (సి) జురెల్ (బి) సిరాజ్ 24, హోప్ (బి) కుల్దీప్ 26, గ్రీవ్స్ (బి) బుమ్రా 32, పియరీ (ఎల్బీ) వాషింగ్టన్ 11, వారికన్ (సి) జురెల్ (బి) కుల్దీప్ 8, జొహాన్ (బి) బుమ్రా 1, సీల్స్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 44.1 ఓవర్లలో 162 ఆలౌట్; వికెట్లపతనం:** 1-12, 2-20, 3-39, 4-42, 5-90, 6-105, 7-144, 8-150, 9-153; **బౌలింగ్:** బుమ్రా 14-3-42-3, సిరాజ్ 14-3-40-4, నితీశ్ కుమార్ 4-1-16-0, జడేజా 3-0-15-0, కుల్దీప్ 6.1-0-25-2, వాషింగ్టన్ 3-0-9-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) హోప్ (బి) సీల్స్ 36, కేఎల్ రాహుల్ (సి) గ్రీవ్స్ (బి) వారికన్ 100, సాయి సుదర్శన్ (ఎల్బీ) చేజ్ 7, గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 50, జురెల్ (సి) హోప్ (బి) పియరీ 125, జడేజా (బ్యాటింగ్) 104, సుందర్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 128 ఓవర్లలో 448/5; వికెట్లపతనం:** 1-68, 2-90, 3-188, 4-218, 5-424; **బౌలింగ్:** సీల్స్ 19-2-53-1, జొహాన్ లేన్ 15-0-38-0, జస్టిన్ గ్రీవ్స్ 12-4-59-0, జొమెల్ వారికన్ 29-5-102-1, ఖారీ పియరీ 29-1-91-1, చేజ్ 24-3-90-2.



ఔరా..మీరా!

ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రజతం కైవసం

ఫోర్డె (నార్వే): భారత స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మూడోసారి పతకాన్ని కొల్లగొట్టింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోటీల్లోని 48 కిలోల విభాగంలో మీరా రజతం సాధించింది. స్నాచ్‌లో 84 కిలోలు ఎత్తిన మీరా.. క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కిలోలతో కలిపి ఓవరాల్‌గా 199 కేజీలతో రజతం అందుకుంది. లిఫ్ట్ చేసే సమయంలో బొటనవేలి గాయం ఇబ్బందిపెట్టినా, మీరా పతకం నెగ్గడం విశేషం. ఇక రీ సోంగ్ గమ్ (ఉత్తర కొరియా) సరికొత్త ప్రపంచ రికార్డుతో స్వర్ణం దక్కించుకుంది. 2017లో స్వర్ణం, 2022లో రజతం గెలిచిన 31 ఏళ్ల మీరాబాయికి తాజా ప్రదర్శనతో మూడో ప్రపంచ పతకం ఖాతాలో చేరింది.

విదేశీ కోచ్‌లకు కుక్కకాటు



న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇస్తున్న దేశ రాజధాని ఢిల్లీలో ఇద్దరు విదేశీ కోచ్‌లు శునకాల బారిన పడ్డారు. కెన్యా స్ప్రింట్ కోచ్ డెన్నిస్ మరాగియా, జపాన్ జట్టు అసిస్టెంట్ కోచ్ మెయికో ఒకుమట్సును వీధి కుక్కలు కరిచాయి. శుక్రవారం ఉదయం జవహర్‌లాల్ స్టేడియంలోని వామప్ ట్రాక్ వద్ద మెయికోపై, కాల్‌రూమ్ వద్ద డెన్నిస్‌పై కుక్కలు దాడి చేశాయని నిర్వాహకులు వెల్లడించారు. అయితే, అప్రమత్తమైన అక్కడి సిబ్బంది వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్లారని వివరించారు. చికిత్స అనంతరం కోచ్‌లను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారని తెలిపారు. ఢిల్లీలో వీధి కుక్కల సంఖ్యను తగ్గించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

సిమ్రన్, నిషద్‌కు స్వర్ణాలు

ప్రపంచ పారా అథ్లెటిక్స్

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో శుక్రవారం భారత్ ఖాతాలో నాలుగు పతకాలు చేరాయి. ఇందులో రెండు స్వర్ణాలుండడం విశేషం. మహిళల 100 మీటర్ల టీ12 విభాగంలో సిమ్రన్ శర్మ 11.9 సెకన్లలో రేసును పూర్తి చేసి పసిడి పతకం అందుకుంది. పురుషుల హైజంప్ టీ47 కేటగిరిలో నిషద్ కుమార్ 2.15 మీటర్ల దూరం లంఘించి ఆసియా రికార్డుతో స్వర్ణం కొల్లగొట్టాడు. మహిళల 200 మీటర్ల టీ35 రేసులో ప్రీతిపాల్, పురుషుల డిస్కస్ త్రో ఎఫ్64లో పర్దీప్ కుమార్ కాంస్యాలు గెలిచారు. గురువారం పోటీల్లో ధరంబీర్ క్లబ్ త్రో ఎఫ్51లో రజతం, డిస్కస్ త్రో ఎఫ్57లో అతుల్ కౌశిక్ కాంస్యం సాధించారు. తాజా ప్రదర్శనతో భారత్ 6 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 15 పతకాలతో నాలుగోస్థానంలో నిలిచింది. 37 పతకాలతో బ్రెజిల్ టాప్‌లో ఉంది.

టీ20 ప్రపంచ కప్‌కు జింబాబ్వే, నమీబియా క్వాలిఫై

హరారే: వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 ప్రపంచకప్‌నకు జింబాబ్వే, నమీబియా అర్హత సాధించాయి. మెగా ఈవెంట్ అర్హతలో భాగంగా జరిగిన ఆఫ్రికా రీజనల్ టోర్నీలో ఈ రెండుజట్లు ఫైనల్ చేరి ప్రపంచ కప్ బెర్త్ దక్కించుకున్నాయి. తొలి సెమీస్‌లో నమీబియా 63 పరుగుల తేడాతో టాంజానియాపై గెలిచింది. రెండో సెమీస్‌లో జింబాబ్వే 7వికెట్లతో కెన్యాను ఓడించింది.

6 బంతుల్లో ఫోర్లు


బ్రియాన్

జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ ప్రపంచ కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో రెండు ప్రపంచ రికార్డులతో సంచలనం సృష్టించాడు. కెన్యాతో సెమీస్ పోరులో అర్ధ సెంచరీ (51) చేసిన బ్రియాన్.. తన ఇన్నింగ్స్‌లో ఆరు బంతుల్లో ఆరు ఫోర్లు బాదాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఓవర్‌లో ఆరు ఫోర్లు కొట్టిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇక, గతనెల 30న టాంజానియాపై జింబాబ్వే గెలిచిన మ్యాచ్‌లో 111 పరుగులు చేసిన బ్రియాన్.. తన కెరీర్‌లో తొలి టీ20 సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలోనూ శతకాలు చేసిన పిన్న వయస్కుడిగా 21 ఏళ్ల బ్రియాన్ రికార్డుకెక్కాడు.

రెండో వన్డేలో ఇండియా-ఎ ఓటమి

కాన్పూర్: ఆస్ట్రేలియా-ఎతో అనధికార రెండో వన్డేలో ఇండియా-ఎ జట్టుకు నిరాశ ఎదురైంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆసీస్-ఎ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 9 వికెట్లతో గెలిచింది. మొదట ఇండియా-ఎ.. తిలక్ వర్మ (94), పరాగ్ (58) అర్ధ సెంచరీలతో సత్తా చాటడంతో 45.5 ఓవర్లలో 246 పరుగులు చేసింది. అనంతరం వర్షం కారణంగా ఆసీస్-ఎ ఛేదనను 25 ఓవర్లలో 160 రన్స్‌గా నిర్దేశించారు. మెకెంజీ (70 నాటౌట్), కూపర్ (50 నాటౌట్) అదరగొట్టడంతో ఆసీస్ 16.4 ఓవర్లలోనే 160/1 స్కోరు చేసి గెలిచింది.


కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక వర్సిటీ చాన్స్‌లర్ ఆచార్య రుద్రాన్షు ముఖర్జీ

గాంధీజీ ఆనాడే చెప్పారు!

తన ఫొటో గోడకు తగిలించి ఓ నిరుపయోగమైన వ్యక్తిగా ఉంచడానికి ప్రయత్నిస్తారని కమ్యూనిస్టు నేతలతో అన్నారు

- అశోక వర్సిటీ చాన్స్‌లర్ రుద్రాన్షు ముఖర్జీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు తనను ఒక నిరుపయోగమైన వ్యక్తిగా ఉంచడానికి ప్రయత్నిస్తారంటూ.. మహాత్మా గాంధీ తనను కలిసిన కమ్యూనిస్టు నాయకులకు చెప్పారని అశోక వర్సిటీ చాన్స్‌లర్ ఆచార్య రుద్రాన్షు ముఖర్జీ తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మాదాపూర్‌లోని శిల్ప కళావేదికలో మంతన్ సంవాద్ 14వ సమావేశం జరిగింది. అందులో.. 'ఠాగూర్-గాంధీ: ఎ లెగసీ ఆఫ్ పబ్లిక్ రీజనింగ్' అనే అంశంపై రుద్రాంషు ముఖర్జీ కీలకోపన్యాసం చేశారు. క్రమశిక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ, సమాజ నియమాల వంటి చాలా విషయాలలో రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మాగాంధీ మధ్య భేదాభిప్రాయాలు తలెత్తినా, ఇద్దరూ పరస్పర గౌరవంతో మెలిగారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. మహాత్మా గాంధీ హత్యకు రెండు వారాల ముందు ఆనాటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పీసీ జోషితో పాటు మరో ఇద్దరు నాయకులు బాపూజీని కలిసి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా కోరగా.. "నేను ఇప్పుడు ఒక అప్రాధాన్యమైన వ్యక్తిని. త్వరలోనే నా ఫొటో గోడకు తగిలించి, పూలహారాలు, మంగళహారతులతో నన్ను ఒక నిరుపయోగమైన వ్యక్తిగా ఉంచడానికి ప్రయత్నిస్తారు" అని గాంధీజీ చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో.. రక్షణ రంగ విశ్లేషకుడు, 'ఫోర్స్' ఎడిటర్ ప్రవీణ్ సాహ్ని, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది కోలిన్ గోన్సాల్వెస్, 'ది వైర్' సీనియర్ ఎడిటర్ అర్ఫా ఖానుమా షేర్వానీ, ఆర్థికవేత్త ఆచార్య రతిన్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.


రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

మాజీ మంత్రి దామన్నకు అశ్రునివాళి

- కన్నీరు పెట్టిన పాత తరం నేతలు
- సూర్యాపేటలో వాహనాలతో భారీ ర్యాలీ

సూర్యాపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రజలు, అభిమానులు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ నెల 1వ తేదీన ఆయన కన్నుమూయగా జూబ్లీహిల్స్‌లోని నివాసం నుంచి భౌతికకాయాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో సూర్యాపేటకు తరలించారు. అభిమాన నేతను కడసారి చూసేందుకు మార్గమధ్యంలో నాయకులు, కార్యకర్తలు రహదారులపైకి వచ్చారు. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, అయిటిపాముల, నకిరేకల్, కేతేపల్లి, సూర్యాపేట మండలాల్లో సెవెన్‌స్టార్ కూడలి, పిల్లలమర్రి క్రాస్‌రోడ్డు, తాళ్లగడ్డ వద్ద అభిమానులు కడసారి నివాళులర్పించారు. పాత తరం కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రెడ్డి భౌతికకాయాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. రాత్రి 9గంటలకు సూర్యాపేటకు చేరుకోగా దామోదర్‌రెడ్డి నివాసంలో భౌతికకాయానికి ప్రజలు నివాళులర్పించారు.

జాతీయ రహదారులపై ప్రయాణం

మరింత ఈజీ!

- క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్న ఎన్‌హెచ్ఏఐ
- వాటి స్కాన్‌తో రహదారులు, ముఖ్యమైన సమాచారం పొందొచ్చు



న్యూఢిల్లీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారులపై ప్రయాణం మరింత సులభతరంగా, సౌకర్యవంతంగా మారనుంది. క్యూఆర్ కోడ్ స్కాన్‌తో జాతీయ రహదారులు, వాటి వెంబడి ఉండే సదుపాయాలకు సంబంధించిన సమగ్ర సమాచారం లభించనుంది. ఈ మేరకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు సౌకర్యార్థం క్యూఆర్ కోడ్‌ను సిద్ధం చేసింది. రహదారి సూచికతోపాటు ఫీల్డ్ ఆఫీసు, ఆస్పత్రులు, పెట్రోల్ పంపులు, టాయిలెట్లు, పోలీస్ స్టేషన్లు, రెస్టారెంట్లు, టోల్ ప్లాజాలు, ట్రక్-లే-బైలు, పంక్చర్ రిపేర్ దుకాణాలు, వాహన సర్వీస్ స్టేషన్లు, ఈ-చార్జింగ్ స్టేషన్ల సమాచారం దీంతో తెలుసుకోవచ్చు. అలాగే వీటికి ఎంత దూరంలో ఉన్నాం, ఏ సమయంలో అక్కడ సేవలు అందుబాటులో ఉంటాయి? వంటి సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. ఈమేరకు క్యూఆర్ కోడ్‌లతో కూడిన సమాచార సైన్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. ఈ క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు జాతీయ రహదారులకు ఇరువైపులా ఉండే విశ్రాంతి ప్రాంతాలు, టోల్ ప్లాజాలు, ట్రక్ లే బైలు, హైవే ప్రారంభ, ముగింపు పాయింట్లు, సంకేత పిల్లర్లు, బోర్డుల వద్ద అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది. జాతీయ రహదారి నంబర్, హైవే మార్గ్గు, రహదారి పొడవు, నిర్మాణం, మెయింటనెన్స్ టైం, హైవే పెట్రోలింగ్ వంటి సమాచారం, సంబంధిత కాంటాక్టు నంబర్లు, టోల్, ప్రాజెక్టు మేనేజర్లు, రెసిడెంట్ ఇంజనీరు, ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ 1033 సమాచారాన్ని కూడా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పొందవచ్చని ఎన్‌హెచ్ఏఐ వివరించింది.

బంధువులే రాబందులు

మహిళలపై అఘాయిత్యాల్లో రెండో స్థానంలో తెలంగాణ

- 817 అత్యాచారం, సామూహిక అత్యాచార కేసుల నమోదు
- ఆత్మహత్యల్లో 6, ఎస్సీ, ఎస్టీలపై దాడుల్లో ఐదో స్థానం
- ఆహార కల్తీ కేసుల నమోదులో దేశంలోనే అగ్రస్థానం
- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు

దేశవ్యాప్తంగా జరిగిన దారుణాలు ఇవీ..


గృహ హింస కేసులు 1,33,676


యువతుల అపహరణలు 88,605


మహిళలపై దాడులు 83,891


అత్యాచారాలు 29,670


యాసిడ్ దాడులు 113


వరకట్న మృతులు 6,156

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల పాలిట భర్త, అతని బంధువులే రాబందులుగా మరారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి 2022లో 22,065 కేసులు నమోదైతే.. 2023లో అవి 23,679 కేసులకు పెరిగాయి. దేశవ్యాప్తంగా మహిళలపై జరిగిన అఘాయిత్యాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడైంది. ప్రతి లక్ష మంది మహిళల్లో 189.6 మందిపై అఘాయిత్యాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. దీనికి సంబంధించిన జాతీయ సగటు 66.2 మాత్రమే. అంటే, తెలంగాణలో మూడింతలు ఎక్కువ కావడం గమనార్హం. భర్త, అతని బంధువుల వేధింపుల కారణంగా 10,518 కేసులు నమోదైతే.. మహిళల మర్యాదను, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే ఉద్దేశంతో వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడానికి సంబంధించి 5,024 కేసులు, మహిళలను కిడ్నాప్ చేసి హింసించారంటూ 2,152 కేసులు నమోదయ్యాయి. పోక్సో చట్టం కింద 3,128 కేసులు నమోదైతే.. వాటిలో హైదరాబాద్‌లోనే 508 కేసులు నమోదు కావడం గమనార్హం. ఇక, 817 రేప్ కేసులు నమోదు కాగా.. వాటిలో 14 హత్య, సామూహిక అత్యాచార కేసులు నమోదయ్యాయి. ఇక చార్జ్‌షీట్ రేటు చూసుకుంటే 88.1 శాతంగా ఉండగా, ఇది జాతీయ సరాసరి 77.6 శాతం కంటే ఎక్కువని నివేదిక వెల్లడించింది.

ప్రతి లక్ష జనాభాకు 27.7 ఆత్మహత్యలు

తెలంగాణలో 2023లో మొత్తం 10,580 ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయని ఎన్‌సీఆర్‌బీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం 1,71,418 ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 6.2 శాతంగా ఉంది. ఆత్మహత్యలకు సంబంధించి 2022లో 9,980 కేసులు నమోదవగా, 2023లో మరింత పెరిగాయి. ప్రతి లక్ష జనాభాకు 27.7 ఆత్మహత్యలు జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇది దేశ సగటు 12.3 కంటే రెట్టింపు స్థాయిలో ఉంది. పెద్ద రాష్ట్రాల వారీగా చూస్తే.. మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ తర్వాత తెలంగాణ ఆరో స్థానంలో నిలిచింది. ఈ ఆత్మహత్యలకు ప్రధాన కారణం కుటుంబ సమస్యలేనని తెలుస్తోంది. మొత్తం కేసుల్లో 4,680 మంది అంటే 44.2 శాతం ఈ కారణంగానే ప్రాణాలు తీసుకున్నారని తెలుస్తోంది. ఇది దేశ సగటు 31.9 శాతం కంటే ఎక్కువ. ఆత్మహత్య చేసుకున్న వారిలో రోజువారీ కూలీలు 4,835, స్వయం ఉపాధి చేసుకునే వారు 1,705, వ్యవసాయ కార్మికులు 564, విద్యార్థులు 582 కేసులుగా గణాంకాలు నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీలపై జరిగిన దాడులు, దురాగతాల్లో బిహార్, యూపీ, ఒడిసా, పంజాబ్ తర్వాత తెలంగాణ ఐదో స్థానంలో ఉందని గణాంకాలు చెబుతున్నాయి.

ఆహార కల్తీ కేసుల్లో అగ్రస్థానం

ఆహార భద్రతకు సంబంధించి తెలంగాణలో ఆందోళనకర వాస్తవాలు వెలుగుచూశాయి. ఎన్‌సీఆర్‌బీ 2023 నివేదిక ప్రకారం.. ఆహార కల్తీ కేసుల విషయంలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. 382 ఆహార, ఔషధ కల్తీ ఘటనల్లో 387 మంది బాధితులు. ఈ కేసుల్లో ఒక్క హైదరాబాద్‌లోనే 218 కేసులు నమోదయ్యాయి. విశేషం ఏమిటంటే.. వీటిలో ఒక్కటి కూడా ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 కింద నమోదు కాలేదు. అంటే చట్టం ఉన్నా అమలు ఏ రీతిన ఉందో స్పష్టమవుతోంది. 2022లో ఈ సంఖ్య మరింత ఎక్కువ. ఆ సంవత్సరంలో 1,631 కేసులు నమోదయ్యాయి.

ఆన్‌లైన్ మనీ గేమింగ్‌లో నిబంధనల ఉల్లంఘనకు

సిబ్బంది అంతా బాధ్యులే

- అది బెయిల్‌కు వీల్లేని నేరం, వారెంట్ లేకుండా అరెస్టు
- కొత్త రూల్స్ ప్రతిపాదించిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 3: ఆన్‌లైన్ మనీ గేమింగ్‌పై కేంద్రం నూతనంగా నిబంధనలు రూపొందించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదాను గురువారం విడుదల చేసిన కేంద్రం వాటిపై ఈ నెల 31లోగా అభిప్రాయాలు చెప్పాలని కోరింది. ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహం, నియంత్రణ చట్టం (పీఆర్‌ఓజీ)-2025 ప్రకారం వీటిని జారీ చేసింది. ఈ నిబంధనల ఉల్లంఘనను బెయిల్‌కు వీల్లేని నేరంగా ప్రభుత్వం గుర్తిస్తుంది. ఉల్లంఘన జరిగితే కంపెనీలోని మొత్తం సిబ్బందిని బాధ్యులుగా పరిగణిస్తుంది. అధీకృత అధికారి ఆ కంపెనీకి సంబంధించిన ఏ ప్రదేశాన్నయినా ప్రత్యక్షంగాగానీ, డిజిటల్ రూపంలోగానీ తనిఖీలు చేయవచ్చు. నేరం చేశారని అనుమానం వచ్చినప్పుడు ఎవరినైనా ఎటాంటి వారెంటు లేకుండానే అరెస్టు చేయవచ్చు. తనిఖీలు చేసే అధికారులకు చట్టపరంగా పూర్తి రక్షణ ఉంటుంది. వారిపై ఎలాంటి కేసులు పెట్టడానికి అవకాశం ఉండదు. ఆ చట్టంలోని సెక్షన్-5 ప్రకారం ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను నిర్వహించడం, సహకరించడం నేరం. సెక్షన్-7 ప్రకారం బ్యాంకులుగానీ, ఇతర ఆర్థిక సంస్థలుగానీ ఆన్‌లైన్ మనీ గేమ్‌ల లావాదేవీలకు అవకాశం ఇవ్వకూడదు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హమైన, బెయిల్‌కు వీల్లేని నేరంగా పరిగణిస్తుంది.


ఎర్రవల్లిలో ఆయుధ, దుర్గామాత పూజలో మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్

దుర్గామాత పూజలో కేసీఆర్

- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో విజయదశమి వేడుకలు

గజ్వేల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ విజయదశమి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో కుటుంబసభ్యులతో కలసి దుర్గామాత పూజ, ఆయుధపూజ, వాహన పూజలను నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయంగా విజయదశమిని ప్రజలు జరుపుకొంటారని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి అభ్యర్థి నిర్మల

- ఆమెకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తున్నాను
- దసరా వేడుకల వేదిక నుంచే స్పష్టతిస్తున్నా
- 3సార్లు గెలిపించిన ప్రజలకు శక్తి కొద్దీ చేశా
- పదేళ్ల తర్వాత ఇక్కడి నుంచి పోటీ: జగ్గారెడ్డి
- సంగారెడ్డి మునిసిపల్ చైర్మన్ అభ్యర్థి కూన సంతోష్ అని ప్రకటన
- సంగారెడ్డిలోని అంబేడ్కర్ గ్రౌండ్స్‌లో ఘనంగా దసరా వేడుకలు

సంగారెడ్డి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నిర్మలా జగ్గారెడ్డి పోటీ చేస్తారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ప్రకటించారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో గురువారం దసరా వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సంగారెడ్డి నియోజకవర్గానికి కావాల్సిన అన్ని పనులూ చేయిస్తానని హామీ ఇచ్చారు. తనను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, తన శక్తి కొద్దీ వారికి అన్నీ చేశానని గుర్తు చేశారు. సంగారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన పూర్తి బాధ్యతలు నిర్మలకే అప్పగిస్తున్నానని అన్నారు. దసరా వేడుకల వేదికపై నుంచే ఈ మేరకు స్పష్టత ఇస్తున్నట్లు చెప్పారు. ఇక, సంగారెడ్డి మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూన సంతోష్ ఉంటారని వెల్లడించారు. కాగా, గంజాయి, డ్రగ్స్, మద్యం బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. వాహనాలు అతివేగంగా నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావొద్దని, తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చొద్దని పిలుపునిచ్చారు.


సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిర్మలను ప్రకటిస్తున్న జగ్గారెడ్డి

రహదారి గుంతల్లాంటి అహంకారాన్ని సరిచేసుకోండి

- లేకుంటే ప్రయాణం అర్థాంతరంగా ముగుస్తుంది
- కర్ణాటక మంత్రికి లోకేశ్ ఘాటు జవాబు
- రెండు రాష్ట్రాల ఐటీ మంత్రుల 'ఎక్స్' వార్



అమరావతి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు క్రిస్టిన్ మాథ్యూ ఫిలిప్ అక్టోబరు 1న బెంగళూరు ఔటర్ రింగు రోడ్డు దుస్థితిపై ఓ ట్వీట్ చేశారు. 'అధ్వానపు రోడ్డు కారణంగా మరిన్ని స్టార్టప్స్, సంస్థలు నార్త్ బెంగళూరు, వైట్‌ఫీల్డ్ వైపు మారేందుకు సిద్ధమవుతున్నాయి' అని ఫిలిప్ పేర్కొన్నారు. తన సందేశానికి ఆయన మారబోతున్న కంపెనీల జాబితాను జత చేశారు. ఈ సందేశం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఐటీ మంత్రుల మధ్య ఎక్స్‌లో యుద్ధానికి కారణమయింది. పాత్రికేయుని పరిశోధనాత్మక సంక్షిప్త సందేశంపై ఏపీ మంత్రి లోకేశ్ స్పందిస్తూ... 'ఉత్తరం అనే పదం వినడానికి బాగుంది. ఇంకాస్త ఉత్తరం వైపుగా వస్తే అనంతపురం ఉంది. అక్కడ ప్రపంచ శ్రేణి ఏరోస్పేస్, డిఫెన్స్ ఎకో సిస్టమ్‌ను రూపొందిస్తున్నాం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. దానిపై కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రతిస్పందిస్తూ... 'బలహీన పర్యావరణ వ్యవస్థలు బలమైన వ్యవస్థలపై ఆధారపడటం సహజం. అది తప్పేమీ కాదు. కానీ అది నిరాశాజనకంగా మారితే... బలాన్ని కాదు, మరింత బలహీనతను చూపుతుంది' అని పేర్కొన్నారు. దీనిపై మంత్రి లోకేశ్ ఘాటుగా స్పందించారు. 'దేశంలోనే అతి చిన్న వయసు కల రాష్ట్రంగా మేం ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోవాలనుకుంటున్నాం. తద్వారా అభివృద్ధి చెందాలని, మరిన్ని ఉద్యోగాలను కల్పించాలని ఆకాంక్షిస్తున్నాం. పెట్టుబడుల కోసం, ఉద్యోగాల కల్పన కోసం రాష్ట్రాలు పోటీ పడినప్పుడే భారతదేశం మరింత అభివృద్ధి చెందుతుందని నేను నమ్ముతాను. మన ప్రయాణం అర్థాంతరంగా ముగిసిపోకముందే... రోడ్లపై గుంతలు లాంటి అహంకారాన్ని సరిచేసుకోవడం మంచిదని నా వినయపూర్వక సలహా' అంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు.

నేటి సాయంత్రానికల్లా టీపీసీసీకి జాబితాలు!

ఒక్కో స్థానానికి ముగ్గురేసి అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు

- గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చేందుకు కసరత్తు
- కరీంనగర్ నేతలతో మంత్రి తుమ్మల భేటీ
- నేడు వరంగల్ నేతలతో మంత్రి పొంగులేటి, నల్లగొండ నేతలతో అడ్లూరి సమావేశాలు

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చేందుకు ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఒక్కో స్థానానికి ముగ్గురేసి అభ్యర్థులతో కూడిన జాబితాలను శనివారం సాయంత్రంలోగా టీపీసీసీకి అందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. రాష్ట్రంలో సర్పంచ్, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన విషయం విదితమే. తొలిసారి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిన ప్రభుత్వం... ఇప్పటికే ఆయా స్థానాల రిజర్వేషన్లు సైతం ఖరారు చేసిన సంగతి తెలిసిందే. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు దశల్లో జరగనుండగా... పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులకు మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 9వ తేదీ నుంచి తొలి దశ, 13వ తేదీ నుంచి రెండో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను జిల్లా ఇన్‌చార్జి మంత్రులు వేగవంతం చేశారు. క్షేత్ర స్థాయిలో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సైతం కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, పరస్పర సమన్వయంతో అభ్యర్థులను ఎంపిక చేయాలన్న టీపీసీసీ ఆదేశాల మేరకు ఒక్కో స్థానానికి ముగ్గురేసి అభ్యర్థులో చిట్టా రూపొందిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తీరును పరిశీలిస్తే.. సాధారణంగానే అధికార పార్టీకి ఎక్కువ స్థానాలు దక్కుతుంటాయి. అధికార పార్టీతో ఉంటేనే స్థానికంగా అభివృద్ధి పనులు చేసుకోవచ్చని అభ్యర్థులు భావిస్తుంటారు. ఇదే అనుకూలత ఆధారంగా అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ దృష్టి సారించింది. గట్టి పట్టు ఉన్న ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో 90శాతంపైగా స్థానాలను గెలుచుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అభ్యర్థుల ఎంపికపై స్థానిక నేతలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సమావేశమయ్యారు. ఇందులో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తామని, గెలుపు గుర్రాలకే సీట్లు దక్కుతాయని స్పష్టం చేశారు. అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పని చేయాలని నేతలకు సూచించారు. మరోవైపు.. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి, ఉమ్మడి నల్లగొండ నేతలతో ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం సమావేశం కానున్నారు. ఏదేమైనా శనివారం సాయంత్రం కల్లా అన్ని జిల్లాల నుంచి ఆశావహుల జాబితాలు టీపీసీసీకి అందనున్నాయి.

బీసీ రిజర్వేషన్లపై చాలా మంది డబుల్ డ్రామాలాడుతున్నారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంలో చాలా మంది డబుల్ డ్రామాలాడుతున్నారని, రిజర్వేషన్లు సాధ్యమా అంటూ బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శాసన సభలో అన్ని రాజకీయ పార్టీలు బిల్లుకు ఆమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పది శాతం పెంచడంతో రిజర్వేషన్లపై ఉన్న 50శాతం పరిమితి ఎప్పుడో దాటిందన్నారు. కాగా సీపీఐకి బలమున్న జెడ్పీటీసీ, సర్పంచు స్థానాలను గుర్తించి పోటీకి సిద్ధమవ్వాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్, సీపీఎం, వామపక్ష పార్టీలతో కలిసి ముందుకెళ్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఈ నెల 8న సుప్రీం కోర్టు తీర్పు వెలువడుతుందని, సీపీఐ ఇంప్లీడ్ అయ్యే విషయంపై ఈ నెల 5న జరిగే సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న సామాజిక కార్యకర్త సోనంను అరెస్టు చేయడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసే తప్పులపై ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడటంలేదని ఆయన ప్రశ్నించారు. అమెరికాలో భారత వ్యాపార సంస్థలపై పన్నులు విధించినట్లే.. దేశంలోని అమెరికా వ్యాపార సంస్థలపై పన్నులు విధించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల బాధ్యత ఎంపీడీఓ, ఎంపీఓలకు.. 'కోడ్' బాధ్యత తహసీల్దార్లకు..

- స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సర్వం సిద్ధం చేసుకుంది. ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ కోసం, ఎన్నికల కోడ్‌ను క్షేత్ర స్థాయిలో పటిష్ఠంగా అమలుచేసేందుకు ఎంపీడీఓలు, తహసీల్దార్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీచే సింది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ప్రత్యేక జీవోపై ఈ నెల 8న జరిగే విచారణలో హైకోర్టు ఏం చెబుతుంది? అసలు ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న సందేహాలున్నా... ఎస్ఈసీ మాత్రం ఎన్నికల నిర్వహణలో నిమగ్నమైంది. పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో.. సర్పంచులు, వార్డు సభ్యులకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. మొత్తంగా ఈ నెల 9 నుంచి నవంబర్ 11 వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), మండల పంచాయతీ అధికారుల (ఎంపీవో)కు అప్పగించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలుకోసం తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమించాలని జిల్లాల కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. తహసీల్దార్లు రోజువారీగా కోడ్‌ను పర్యవేక్షణ నివేదికలను జిల్లా అధికారులకు అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఆ గ్రామాల్లో ఎన్నికల్లేవు

కారణాలతో కోర్టు స్టేలు ఉండటంతో ములుగు, కరీంనగర్ జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం లేదు. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ, 25 సర్పంచ్, 230 వార్డుసభ్యుల స్థానాలకు.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రెండు సర్పంచు, 16 వార్డు స్థానాలకు ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదని ఎస్ఈసీ ఇప్పటికే ప్రకటించింది.



మంత్రి పొంగులేటి గృహప్రవేశానికి హాజరైన మంత్రి తుమ్మల, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

మంత్రి పొంగులేటి స్వగ్రామంలో సందడి

» గృహప్రవేశ వేడుకలకు మంత్రి తుమ్మల సహా పలువురి రాక

» దసరా ఉత్సవాల్లో భట్టి, తుమ్మల, పొంగులేటి

ఇల్లెందు/కల్లూరు/ఖమ్మం సాంస్కృతికం/మధిర, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో గురువారం గృహప్రవేశం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు కావడం.. గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఓ వైపు దసరా.. మరోవైపు గృహ ప్రవేశం ఉండడంతో గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది. మరోవైపు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో గురువారం సాయంత్రం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన వేడుకలకు మంత్రి పొంగులేటి హాజరయ్యారు. దసరా సందర్భంగా ఖమ్మం నగరంలోని జమ్మిబండ వద్ద నిర్వహించే పారువేట కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఖమ్మం జిల్లా మధిరలో జరిగిన దసరా ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం బంజారా కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం శమీ పూజలో పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్ భూములు కబ్జా కాకుండా చట్టం తేవాలి

» మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మార్పీఎస్ వినతిపత్రం

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని తోళ్ల పరిశ్రమాభివృద్ధి సంస్థ(లిడ్‌క్యాప్)కు చెందిన భూములను కబ్జా కాకుండా హైడ్రా తరహాలో చట్టం తీసుకురావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. లిడ్‌క్యాప్ సంస్థకు చెందిన భూములను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)కు కేటాయించడం పట్ల ఎమ్మార్పీఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ.. గచ్చిబౌలిలోని లిడ్‌క్యాప్ పరిధిలో 43 ఎకరాల భూములుంటే అందులో 5.16 ఎకరాల్లో యూనిట్ మాల్ నిర్మిస్తామని ప్రకటించారని, కానీ ఆ మాల్‌లో లెదర్ ఉత్పత్తుల కోసం వాణిజ్య సముదాయాన్ని కేటాయిస్తామని ఎక్కడా చెప్పలేదన్నారు. ఈ భూములు మాదిగల ఆర్థిక, ఉపాధి అభివృద్ధికి కేటాయించినవని, వాటిని ఇతర అవసరాలకు వినియోగించడం వారి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందన్నారు. అందుకే కార్పొరేట్ వాణిజ్య సముదాయాల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలన్నారు. ఆ భూములను ఐఓసీఎల్‌కు బదలాయించే నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లిడ్‌క్యాప్‌ను, తెలంగాణ లెదర్ ఇండస్ట్రీ ప్రమోషన్ ఆఫ్ కార్పొరేషన్(టీజీఎల్ఐపీసీ)ను కలిపి కార్పొరేషన్‌గా పునరుద్ధరించి ఛైర్మన్, డైరెక్టర్లను నియమించాలని కోరారు.. ప్రస్తుతమున్న టీజీఎల్ఐపీసీ వీసీ ఎండీ శ్రీనివాస నాయక్‌ను తొలగించి, తమ మాదిగ కులానికి చెందిన గ్రూప్ 1 అధికారిని నియమించి, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలన్నారు. ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలో రెండు మెగా పార్కులను ప్రారంభించి నిరుద్యోగ మాదిగ యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

గిరిజన సంక్షేమ శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు

» రూ.83.07 కోట్లు విడుదల: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి



గిరిజన సంక్షేమశాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ఎట్టకేలకు ఊరట లభించింది. రూ.83.07 కోట్లను ప్రభుత్వం బుధవారం విడుదల చేసి చెల్లించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డైట్ బిల్లులు రూ.55.19 కోట్లు, హాస్టల్ కార్మికుల వేతనాలు రూ.9.44 కోట్లు, ఆశ్రమ పాఠశాలలు/ హాస్టళ్లలో దినసరి వేతన సిబ్బందికి రూ.8.84 కోట్లు, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్టీ)లకు రూ.9.60 కోట్లు విడుదల అయ్యాయని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల వల్ల ఇబ్బంది పడుతున్న సిబ్బందికి ఇది ఉపశమనమని, విద్యార్థుల భోజన సరఫరా, సిబ్బంది వేతనాలు, విద్యా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ఇది దోహదం చేస్తుందని మంత్రి తెలిపారు. నిధులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టి విక్రమార్కకు అడ్లూరి కృతజ్ఞతలు తెలిపారు.

నైనీ బ్లాక్ నుంచి తమిళనాడు జెన్‌కోకు బొగ్గు

» ఏటా 2.88 మిలియన్ టన్నుల సరఫరాకు ఓకే

» సింగరేణి సీఎండీతో తమిళనాడు జెన్‌కో ఎండీ చర్చలు

హైదరాబాద్/కొత్తగూడెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఒడిసాలోని నైనీ బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్‌కు ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు సింగరేణి సూత్రప్రాయంగా ఓకే చెప్పింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాంతో తమిళనాడు జెన్‌కో ఎండీ ఎం.గోవిందరావు చర్చలు జరిపారు. తమిళనాడులోని తుత్తుకూడి జిల్లా ఉడింగిడిలో ఉన్న 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ఏటా2.88 మిలియన్ టన్నుల జీ-11 బొగ్గు అవసరమని గోవిందరావు పేర్కొనగా, నైనీ బ్లాక్ నుంచి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు బలరాం తెలిపారు. పది రోజుల్లోగా సరఫరా ఒప్పందం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని బొగ్గు రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సింగరేణి నుంచి తమిళనాడులోని నార్త్ చెన్నై విద్యుత్ ప్లాంట్‌కు ఏటా 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా జరుగుతోంది. ఇప్పుడు నైనీ బ్లాక్ నుంచి ఉడింగిడి విద్యుత్ ప్లాంట్‌కు 2.88మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా దిశగా అడుగులు పడుతున్నాయి.

ఈఈఎస్ఎల్ జాతీయ సలహాదారుగా చంద్రశేఖర్‌రెడ్డి



ఈఈఎస్ఈఈ సీఈవో నుంచి నియామక పత్రం అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) జాతీయ సలహాదారుగా ఎ.చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఈఈఎస్ఎల్ సీఈవో అఖిలేశ్‌కుమార్ నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈఈఎస్ఎల్ కార్యక్రమాలపై ప్రచారం చేయడం, ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రచురణ/ప్రసార మాధ్యమాల్లో ప్రచారం కల్పించడం ఈయన బాధ్యత. ఇంధన సామర్థ్య రంగంలో అధునాతన సాంకేతికతలపై ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ బాధ్యతలు చూడనున్నారు. చంద్రశేఖర్‌రెడ్డికి విద్యుత్ రంగంలో మూడు దశాబ్దాలకుపైగా అనుభవం ఉంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ)కి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు మీడియా సలహాదారుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్‌కు దశాబ్దానికిపైగా సీఈవోగా పనిచేశారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళ్లేదిలా..!

(మొదటిపేజీ తరువాయి)

ముగిసి.. ఏపీ భూభాగంలోకి ప్రవేశించిన తర్వాత కృష్ణా, గుంటూరు (అమరావతి క్యాపిటల్ సిటీ), పల్నాడు జిల్లాల మీదుగా బందరు పోర్టు వరకు 60 గ్రామాల పక్క నుంచి రహదారి ఉండనుంది. దీని మొత్తం పొడవు 297 కిలో మీటర్లుగా అలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు. పూర్తిస్థాయి అలైన్‌మెంట్ ఖరారులో వీటిలో కొన్ని మార్పులు ఉండొచ్చని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాగా అడవి దేవులపల్లి, గొట్టిముక్కల దగ్గర్లో తెలంగాణ సరిహద్దు ఉండనుంది. మార్గమధ్యలో వ్యవసాయ, వ్యవసాయేతర, అటవీ భూములు, చెరువులు, కుంటలు ఎన్ని ఉన్నాయనే వివరాలను కూడా ప్రాథమికంగా తేల్చారు. కానీ, పూర్తిస్థాయి అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే వీటి వివరాలు కూడా తేలనున్నాయి. ప్రాథమికంగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం.. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) - రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యలో ప్రభుత్వం ప్రతిపాదించిన భారత్ ఫ్యూచర్ సిటీకి (ముచ్చర్ల) దగ్గర్లో ఉన్న తిప్పారెడ్డిపల్లికి కొంత దూరంలో కుడివైపు నుంచి ఈ రహదారి ప్రారంభమై అమరావతి క్యాపిటల్ సిటీకి పక్క నుంచి లంకెలపల్లి మీదుగా బందరు పోర్టుకు అనుసంధానం కానుంది.

కారిడార్ దూరం.. కిలోమీటర్లు ఇలా..

ఫ్యూచర్ సిటీ - బందరు పోర్టు	ఫ్యూచర్ సిటీ - అమరావతి	ఫ్యూచర్ సిటీ - తెలంగాణ సరిహద్దు
297.82	212.5	118

తెలంగాణ సరిహద్దు అడవిదేవులపల్లి - అమరావతి (తాడికొండ)	తెలంగాణ సరిహద్దు - బందరు పోర్టు	అమరావతి - బందరు పోర్టు
94.5	179.82	85.32

తెలంగాణ పరిధిలోని గ్రామాలివే..

ప్రాథమికంగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం.. 40 గ్రామాల పక్క నుంచి ఈ రోడ్డు ఉండనుంది. అవి..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా: మీర్‌ఖాన్‌పేట, తాడిపర్తి, సింగారం, నందివనపర్తి, నక్కెర్త, మేడిపల్లి, యాచారం, మల్కీజ్‌గూడ, మంది గౌరెల్లి, తక్కెళ్లపల్లి, చింతపట్ల, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, మాల్, మంతన్ గౌరెల్లి,

ఉమ్మడి నల్లగొండ జిల్లా: తమ్మడపల్లి, అజిలాపూర్, ఏరుగండ్లపల్లి, కొండూరు, మర్రిగూడ, రామ్‌రెడ్డి పల్లి, వట్టిపల్లి, లింగోటం, భీమనపల్లి, దామెర, చిట్టెంపహాడ్, నాంపల్లి, మొహమ్మదా పురం, ఊట్లపల్లి, తేనెపల్లె, గుర్రంపోడ్, చేపూర్, మోసంగి, తెప్పలమడుగు, హాలియా, మాచర్ల, కొంపల్లి, బోయగూడెం, రాజవరం, అడవి దేవులపల్లి.

ఏపీ పరిధిలోని 60 గ్రామాలు ఇవే..

ఏపీ పరిధిలో 60 గ్రామాల మీదుగా హైవే వెళ్లనుంది. అవి.. కల్లేపల్లి, దైద, వజీరాబాద్, పులిపాడు, దాచేపల్లి, ముత్యాలంపాడు, పిన్నెల్లి, వేమవరం, మాచవరం, తురక పాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, శ్రీరుక్మిణీపురం, పాపాయ పాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు, అమరావతి, పెరికపాడు, దొడ్లేరు, హస్సన్ బండ, అనంతారం, గుడిపాడు, తళ్లూరు, పెసపాడు, రెంటపల్లి, పండితాపురం, అమరావతి, పాటిబండ్ల, వేమారం, సిరిపురం, మందెపూడి, పాములపాడు, పొన్నెకల్లు, నిడుముక్కల, తాడికొండ, లామ్, గోరంట్ల, గుంటూరు, కంతేరు, కాజ, నంబూరు, చిలువూరు, పెర్కలపుడి, దుగ్గిరాల, వల్లభాపురం, మున్నంగి, వల్లూరు, భద్రిరాజుపాలెం, కుమ్మమూరు, కపిలేశ్వరపురం, లంకపల్లి, చల్లపల్లి, నిమ్మకూరు, నిడుమూరు, గూడూరు, పెడన, మచిలీపట్నం. ప్రస్తుతానికి ఏపీ పరిధిలో ఈ గ్రామాల పక్కగా అలైన్‌మెంట్ ఉన్నప్పటికీ దీనిపై ఇంకా ఏపీ ప్రభుత్వం ఎలాంటి అభిప్రాయాలు తెలపలేదు. డీపీఆర్ కన్సల్టెన్సీ ఎంపికైన తర్వాత పూర్తిస్థాయి అలైన్‌మెంట్ ఖరారు సమయానికి వీటిలో కొంతమేర మార్పులు ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

న్యాయవాదుల భద్రతపై

లా కమిషన్ నివేదిక తర్వాతే నిర్ణయం

» త్వరలో న్యాయవాదులకు 'వైద్య బీమా'

» కేంద్ర మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని న్యాయవాదుల భద్రత అంశంపై లా కమిషన్‌కు నివేదించామని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ తెలిపారు. లా కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత ఈ విషయమై కేంద్రం తగు చర్యలు తీసుకుంటుందని శుక్రవారం బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చెప్పారు. ఇక, త్వరలో దేశవ్యాప్తంగా న్యాయవాదులకు వైద్య బీమా పథకాన్ని అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ఇందుకు బార్ కౌన్సిల్ కొంత ప్రీమియం చెల్లిస్తే.. కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుందన్నారు. దేశవ్యాప్తంగా న్యాయవాదుల సంఖ్యపై ఖచ్చితమైన వివరాలు అందుబాటులో లేవని ఆయన పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే అందరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరముందన్నారు. వచ్చే మూడేళ్లలో పలు శాఖల్లో సంస్కరణలు రాబోతున్నాయని, బ్రిటిష్ చట్టాల స్థానే.. వర్తమాన, సామాజిక పరిస్థితులకనుగుణంగా సమూల మార్పులు చేయాలని మోదీ సర్కారు భావిస్తోందన్నారు. బీజేపీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు అర్ధరాత్రి నిర్ణయం కాదని, వాటితో పేదలు, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ త్వరితగతిన న్యాయం కోసం మోదీ సర్కారు.. భారత న్యాయ సంహిత చట్టాలు అమల్లోకి తెచ్చిందన్నారు. పెద్దపల్లి జిల్లాలో న్యాయవాద దంపతులను పట్ట పగలు హత్య చేశారని, న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు రావాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఎంపీలు ఎం.రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు సునీల్ గౌడ్, బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

6న ఆర్ఆర్ఆర్ నిర్వాసితుల ధర్నా

» భూ సేకరణపై స్పష్టత ఇవ్వాలి: జాన్ వెస్లీ

హైదరాబాద్, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్, నిర్వాసితుల సమస్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండు చేస్తూ ఆందోళన చేయనున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6న హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వాసితులతో కలిసి ధర్నా చేస్తామని తెలిపారు. రైతులతో మాట్లాడకుండా, భూ సేకరణపై స్పష్టత ఇవ్వకుండా బలవంతంగా భూములు తీసుకోవాలని ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నట్లు హెచ్ఎండీఏ ప్రకటనలో తెలిపిందని, రైల్వే ట్రాక్ కోసం మరో 40 అడుగుల మేర వెడల్పు పెంచుతామని ప్రభుత్వం చెబుతోందని పేర్కొన్నారు. పలుకుబడి ఉన్న వారి భూముల జోలికి వెళ్లకుండా అర ఎకరా, ఎకరా ఉన్న రైతుల భూములనే సేకరించనున్నారని ఆరోపించారు.

సొంతూరిలో దసరా వేడుకల్లో సీఎం

కొండారెడ్డిపల్లిలో రేవంత్‌కు ఘనస్వాగతం .. గ్రామస్థులతో కలిసి కాలినడకన జమ్మికి వెళ్లిన ముఖ్యమంత్రి





నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో గ్రామస్థులతో కలిసి జమ్మికి వెళుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న రేవంత్

కల్వకుర్తి/వంగూరు/కొడంగల్/పరిగి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో గురువారం జరిగిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం 3:26 గంటలకు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో సీఎం తన కుటుంబ సభ్యులతో కలసి దిగారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు పూలవర్షం కురిపిస్తూ గజమాలతో ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ తమ ఇష్టదైవమైన ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి దర్శించుకున్నారు. అనంతరం తన నివాసానికి వెళ్లారు. సాయంత్రం 6:8 గంటలకు కోటమైసమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి కాలినడకన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆయన బంధువులు, గ్రామస్థులు డప్పు చప్పుళ్ల నడుమ గ్రామానికి కొద్ది దూరంలో ఏర్పాటు చేసిన జమ్మి చెట్టు వద్దకు చేరుకుని శమీపూజ చేశారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీ సమీపంలో మహిళల బతుకమ్మ కార్యక్రమాన్ని తిలకించారు. అక్కడి నుంచి ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికలో గ్రామస్థులు, పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపు సీఎం తన ఇంట్లో విశ్రాంతి తీసుకొని రాత్రి 8:20 గంటలకు ప్రత్యేక వాహనంలో రోడ్డు మార్గాన తన అసెంబ్లీ నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు వెళ్లారు. శుక్రవారం ఉదయం నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కొడంగల్‌కు తరలివచ్చారు. అందరికీ అభివాదం చేస్తూ సీఎం ముందుకు కదిలారు. కొడంగల్ పట్టణంలో టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్ నివాసంలో స్థానిక నేతలతో కలిసి భోజనం చేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ వెళ్తున్న క్రమంలో పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో జనం నానా ఇబ్బందులు పడ్డారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో జైనులది కీలక పాత్ర

రక్షణ రంగంలో తగ్గిన దిగుమతులు.. పదేళ్లలో రక్షణ రంగాన్ని బలోపేతం చేశాం

» 2029 నాటికి 50 వేల కోట్లకు రక్షణ ఎగుమతులు

» జీటో సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్



సదస్సులో పాల్గొన్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జైనులు దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, దేశంలో 0.5 శాతం ఉన్న జైనులు చెల్లించే పన్నుల శాతం 24 వరకు ఉందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. దేశానికి ఏ అవసరం వచ్చినా జైన్ సామాజిక వర్గం అండగా నిలిచిందని గుర్తు చేశారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీటో) ఆధ్వర్యంలో శుక్రవారం హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల జీటో కనెక్ట్ 2025 సదస్సుకు ముఖ్య అతిథిగా రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో చోరీకి గురైన 20 జైన తీర్థంకుల విగ్రహాలను తిరిగి తెప్పించామని తెలిపారు. భారత్ ఎప్పుడూ శాంతిని కోరుకుంటుందని, కానీ.. దేశంపై దాడికి యత్నించిన వారిని ఉపేక్షించేదిలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో శత్రుదేశానికి గట్టి జవాబిచ్చామన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాక్ ఉగ్రమూక స్థావరాలపై దాడులు చేశామే తప్ప పౌరులను టార్గెట్ చేయలేదని తెలిపారు. రక్షణ రంగంలో విదేశాలపై ఆధారపడే అవసరాన్ని తగ్గించామని, గత పదేళ్లలో రక్షణ రంగాన్ని బలోపేతం చేశామని పేర్కొన్నారు. రక్షణ రంగంలో దిగుమతులు తగ్గించి, ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగామన్నారు. మన దేశం నుంచి 11ఏళ్ల క్రితం రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు రూ.600 కోట్లు ఉండగా.. ఇప్పుడు రూ.24వేల కోట్లకు చేరాయని, 2029కల్లా ఇవి రూ.50 వేల కోట్లకు చేరుకుంటాయన్నారు. కొత్తగా 97 లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ కాంట్రాక్టును హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు అప్పగించామని.. వీటి తయారీలో వాడే విడిభాగాల్లో 64శాతం దేశీయంగా తయారు చేస్తున్నారని తెలిపారు. తేజస్, ఆకాష్ మిస్సైల్స్, అర్జున్ ట్యాంక్ వంటి వాటిని స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ రానున్నకాలంలో మూడో స్థానానికి చేరుతుందన్నారు. దానికోసం స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేలా సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపులతో 350 ఉత్పత్తుల ధరలు తగ్గాయన్నారు. ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలతో రానున్న కాలంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా భారత్ మారబోతుందన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్ తెలంగాణ : మంత్రి శ్రీధర్‌బాబు

విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా, ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా తెలంగాణ మారిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న జైన్ వ్యాపారవేత్తలు ముందుకురావాలని కోరారు. తెలంగాణ అవకాశాల గని అని, పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూల ప్రాంతమన్నారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే ముందు తెలంగాణలో పరిస్థితులు పరిశీలించాలన్నారు. సదస్సులో ప్రముఖ యోగా గురువు రామ్‌దేవ్‌బాబా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, జీటో హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, చోప్రా తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఎయిమ్స్ నంబర్ 1

» తెలుగు రాష్ట్రాలకు నిరాశే

» మొదటి 50ల్లో ఉస్మానియా



గుంటూరు మెడికల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ వైద్య బోధన సంస్థగా న్యూఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో 91.80 పాయింట్లతో న్యూఢిల్లీ ఎయిమ్స్ దేశంలోనే మొదటి స్థానం దక్కించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు కొంత నిరాశే ఎదురైంది. ఏపీ, తెలంగాణ నుంచి కేవలం ఉస్మానియా వైద్యకళాశాల ఒక్కటే టాప్ 50లో చోటు దక్కించుకుంది. 51.46 పాయింట్లతో ఉస్మానియాకు 48వ ర్యాంకు దక్కింది. గుంటూరు వైద్య కళాశాల 42.10 పాయింట్లు సాధించింది. వైద్య పరిశోధనలో కొంత వెనుకబడటంతో జీఎంసీ టాప్ 50లో స్థానం పొందలేకపోయింది. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలకు వాటి పని తీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకులు ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా వైద్య బోధన సంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీకి ఈ ర్యాంకులు దోహదపడతాయని, వైద్య విద్యార్థులు కూడా తాము చదివే కళాశాలను ఎంచుకొనేందుకు ఈ ర్యాంకులు తోడ్పడతాయని భావించి ఎన్ఐఆర్ఎఫ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కళాశాలలో బోధన, వైద్య సిబ్బంది పని తీరు, వైద్య పరిశోధనలు, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత తదితర పలు అంశాలను పరిగణలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించారు. మొత్తం 100 పాయింట్లకు కనీసం 50 పాయింట్లు సాధించిన మెడికల్ కాలజీలకు ర్యాంకులు కేటాయించారు. దేశంలో మొదటి 10 స్థానాల్లో ఉన్న కళాశాలలు... 1) ఎయిమ్స్, న్యూఢిల్లీ(91.80 పాయింట్లు), 2) పిగ్మర్, చండీగఢ్(82.58), 3) సీఎంసీ, వెల్లూరు(76.48), 4) జవహర్ లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ అండ్ రీసెర్చ్, పాండిచ్చేరి(73.30), 5) సంజయ్‌గాంధీ పోస్టు గ్రాడ్యుయేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, లక్నో(70.09), 6) బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారాణసి(70.05), 7. నిమ్‌హ్యాన్స్, బెంగళూరు(69.77), 8) కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీ, లక్నో(68.77), 9) అమృత విశ్వ విద్యాపీఠం, కోయంబత్తూరు(68.52), 10) కస్తూర్బా మెడికల్ కాలేజ్, మణిపాల్(68.05).



గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

బాపూఘాట్‌లో ఘనంగా గాంధీ జయంతి

- నివాళులర్పించిన గవర్నర్, ముఖ్యమంత్రి తదితరులు

కార్వాన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని గాంధీజీ సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనల్లో గవర్నర్, సీఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో ముగ్గురు దొంగల అరెస్టు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు కోసం హైవేలపై దారి దోపిడీలకు పాల్పడుతూ ఓ లారీ డ్రైవర్‌ను హత్య చేసిన ముగ్గురిని సంగారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని జాతీయ రహదారిపై సెప్టెంబరు 29వ తేదీ రాత్రి జరిగిన మూడు దారి దోపిడీలు, ఓ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించి సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ, మల్కాజిగిరి ప్రాంతాలకు చెందిన తిల్‌పిత్యా విజయ్ సింగ్(20), ఈశ్వర్‌సింగ్(21), మరో బాలుడు కలిసి వెల్డింగ్ దుకాణంలో పని చేసేవారు. మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో జైలుకెళ్లిన వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే, జల్సాలకు అలవాటుపడిన నిందితులు జాతీయ రహదారులపై దారి దోపిడీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో సెప్టెంబరు 29వ తేదీ అర్ధరాత్రి నిందితులు ముగ్గురూ కలిసి ఒకే ద్విచక్రవాహనంపై సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వైపు జాతీయ రహదారిపై వెళ్లారు. తొలుత పటాన్‌చెరు దగ్గర ఓఆర్ఆర్ వద్ద బ్రిడ్జి కింద ఆగి ఉన్న లారీల వద్దకు వెళ్లి డ్రైవర్, క్లీనర్‌ను కత్తితో బెదిరించి రూ.25వేలు, సెల్‌ఫోన్ దొంగలించారు. అక్కడి కొండాపూర్ మండలం మల్కాపూర్ చౌరస్తా వద్ద హైవేపై ఆగి ఉన్న లారీ వద్దకు వెళ్లి.. లారీ డ్రైవర్ మహ్మద్ ఆషమ్ అలియాస్ ఆసిఫ్‌ను కత్తితో పొడిచి పారిపోయారు. వీరి దాడిలో గాయపడిన ఆసిఫ్ మరణించాడు. అనంతరం రుద్రారం పరిధిలోని ప్యాలెస్ హోటల్ వద్ద ఆగి ఉన్న లారీకి చెందిన డ్రైవర్‌ను బెదిరించి రూ.5వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఈ కేసులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి ఓ ద్విచక్ర వాహనం, రూ.18,800 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఓ కత్తి, చేతి కడియం స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు యువకులను రిమాండ్‌కు, బాలుడిని జువెనైల్ హోంకు తరలించారు.

భారత సింధీల్లో తూర్పుఆసియా జన్యుమూలాలు

- ఇనుప యుగం లేదా ఆ తర్వాతి కాలంలో వలసలు
- సీసీఎంబీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ సింధీలలో తూర్పు ఆసియా దేశాల జన్యు మూలాలను గుర్తించామని సీఎస్ఐఆర్-సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సింధు నాగరికత విరాజిల్లిన ప్రాంతం నుంచి వచ్చిన వారిని సింధీలని అంటుంటారు. భారతదేశపు పశ్చిమ తీరం మరీ ముఖ్యంగా మహారాష్ట్ర పశ్చిమ తీరం, గుజరాత్ ప్రాంతంలో అధికంగా కనిపించే ఈ సింధీలు ఎక్కడి వారు అనే దానిపై భిన్న వాదనలు ఉన్నాయి. ఈ వాదనలు ఎలాగున్నా.. అసలు సింధీల జన్యుమూలాలు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో సీఎస్ఐఆర్- సీసీఎంబీ, హైదరాబాద్ శాస్త్రవేత్తలు డాక్టర్ కుమార స్వామి తంగరాజ్, డాక్టర్ లోమోస్ కుమార్ అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా సాధారణ వంశపారంపర్యత, సింధీ ప్రజల వలస చరిత్ర, స్థానిక సమీకరణాలు, దాదాపు 6 లక్షలకు పైగా సింధీ ప్రజల జన్యు సమాచారాన్ని విశ్లేషించారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు హ్యూమన్ జినోమిక్స్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనంపై డాక్టర్ కుమారస్వామి తంగరాజ్ మాట్లాడుతూ.. భారతదేశపు పశ్చిమ తీరంలోని సింధీల జన్యువుల తీరు విభిన్నంగా ఉందని, మరీ ముఖ్యంగా పాకిస్తానీ సింధీలకు భిన్నంగా ఉందని కనుగొన్నామన్నారు. పాకిస్థానీ సింధీలలో పాక్‌లోని బురుషో లేదా హజారా తరహా గ్రూపుల జన్యు మూలాలతో పాటుగా మంగోలియా వలసలు, కొంకణి ప్రజల జన్యు సమ్మేళన నమూనాలు కనుగొన్నారని తెలిపారు. అయితే, భారతీయ సింధీలలో తూర్పు ఆసియా దేశాల జన్యు మూలాలు కనబడుతున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ లోమోస్ కుమార్ మాట్లాడుతూ భారతీయ సింధీ సమూహం, తూర్పు ఆసియా నుంచి వచ్చిన ఒక చిన్న, ప్రత్యేకమైన జన్యు భాగాన్ని కలిగి ఉందన్నారు. ఇనుప యుగం లేదా ఆ తరువాత జరిగిన వలసలు మంగోల్ జన్యువుల ద్వారా కూడా జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ అధ్యయన ఫలితాలు పశ్చిమ భారతదేశంలో వలసలతో ముడిపడి ఉన్న జనాభా మార్పులను వివరిస్తాయని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె నందికూరి తెలిపారు. ఈ వలసలలో కొన్ని ఇనుప యుగం లేదా మధ్యరాతి యుగాలలోనే జరిగి ఉండవచ్చని, మరికొన్ని స్వాతంత్య్రం తరువాత జరిగి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.



టెస్లా కారుతో డాక్టర్ ప్రవీణ్ కోడూరు

హైదరాబాద్‌కు తొలి టెస్లా కారు!

- ముంబైలో కొని హైదరాబాద్‌కు లాంగ్ డ్రైవ్
- ఎలక్ట్రిక్ వాహనమే అయినా ఇతర రాష్ట్రాలలో కొన్నందుకు 22% పన్ను వేశారన్న యజమాని

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తొలి టెస్లా కారు అడుగుపెట్టింది. కొంపల్లిలోని శ్రీనందక అడ్వాన్స్‌డ్ సర్జరీ సెంటర్‌లో అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపిక్, లేజర్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్ కోడూరు దీనిని కొనుగోలు చేశారు. మన దేశంలో రోడ్డెక్కిన 6వ టెస్లా కారు ఇదే కావడం గమనార్హం. ముంబైలో టెస్లా షోరూమ్ ఏర్పాటు చేశాక కారును బుక్ చేసుకున్నానని.. గత నెల 27న మధ్యాహ్నం 3 గంటలకు ముంబైలో కారు డెలివరీ తీసుకున్నానని ప్రవీణ్ కోడూరు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీవారు కూడా టెస్లా కారును బుక్ చేసుకున్నా.. తొలుత డెలివరీ తీసుకున్నది తానేనని తానేనని తెలిపారు. ముంబై నుంచి ఆ కారు నడుపుకొంటూ బయలుదేరామని, పుణెలో ఒకసారి, షోలాపూర్‌లో మరోమారు ఆగి చార్జింగ్ చేసుకున్నామని.. 770 కిలోమీటర్లు వచ్చామని వివరించారు. అయితే తెలంగాణలో వాహన పన్ను గురించి తెలిసి షాక్ అయ్యానని చెప్పారు. ఈ మోడల్ వై టెస్లా కారు రూ.63 లక్షలకే రావాలని, కానీ తెలంగాణలో పన్నులతో ఖర్చు పెరిగిందన్నారు. విద్యుత్ వాహనాలపై తెలంగాణలో పన్ను లేకున్నా.. ఇతర రాష్ట్రాలలో కొనుగోలు చేసినదన్న కారణంతో 22శాతం పన్ను వసూలు చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

కులమతాల పేరుతో ప్రజల్లో

చీలికకు కొందరి యత్నాలు!

నేపాల్‌లాంటి దేశాల్లో జరిగిందే ఇక్కడా జరుగుతుందనుకుంటున్నారు

- వారికి నిరాశ తప్పదు.. భిన్నత్వంలో ఏకత్వమే భారత్ బలం: వెంకయ్య
- హైదరాబాద్‌కు అలయ్ బలయ్ ప్రత్యేకం: కిషన్‌రెడ్డి
- సామాజిక ఐక్యత మరింత బలోపేతం: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- ధూంధాంగా దత్తన్న అలయ్ బలయ్

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, న్యూఢిల్లీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అలయ్ బలయ్ కార్యక్రమం ధూంధాంగా సాగింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, శ్రీధర్ బాబుతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ.. కులం, మతం, వర్గం, వర్ణం, జాతి పేరిట కొంతమంది దేశ ప్రజల్లో చీలిక తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. నేపాల్ వంటి దేశాల్లో ఏదో జరిగిందని, భారత్‌లో కూడా అలా జరగవచ్చునని కొంతమంది ఆశలు పెట్టుకున్నారని చెప్పారు అయితే అలాంటి వారు నిరాశ చెందక తప్పదని.. ఎందుకంటే.. వేషభాషలు వేరైనా భిన్నత్వంలో ఏకత్వం అనేది భారత్ విశిష్టత అని.. చిన్నచిన్న విభేదాలు ఏర్పడినా వాటిని పరిష్కరించుకొని అంతా భారతీయులం అనే భావన దేశప్రజల్లో ఉందని వివరించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అలయ్ బలయ్ కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదని.. హైదరాబాద్‌కు ప్రత్యేకం అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జీఎస్టీ తగ్గించడం ద్వారా ప్రజలకు మోదీ అలయ్ బలయ్ ఇచ్చారని పేర్కొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, దేశంలో భిన్న సంస్కృతి సంప్రదాయాలు ఉన్నా, అన్ని పండుగల ఉద్దేశం.. అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నదేనన్నారు. 'మానవ సేవే మాధవ సేవ అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఉపదేశించినట్లుగా మానవీయ విలువలతో కూడిన సేవ అవసరం అని పేర్కొన్నారు. మన సంప్రదాయం, సంస్కృతి, ఆచార వ్యవహారాలను ముందుతరాలు తెలుసుకోవడానికి అలయ్ బలయ్ ఒక చక్కటి కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. దసరా పండుగ మరుసటి రోజు అలయ్ బలయ్ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతరంగా నిర్వహిస్తున్నారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ అలయ్ బలయ్ అంటే హృదయ పూర్వకగా ప్రేమను పంచుకోవడమేనన్నారు. హనుమంతుడిని శ్రీరాముడు అలింగనంచేసుకున్నారని, ఆ కాలం నుంచే ఈ అలయ్ బలయ్ ఉందని వివరించారు. రాజకీయాలకు అతీతంగా నేతలంగా ఒకే వేదికపై రావడం తమలో నమ్మకం, ఆత్మవిశ్వాసం పెంచిందని సినీనటుడు నాగార్జున అక్కినేని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు వస్తే అందరూ మద్దతుగా నిలుస్తారనే నమ్మకం ఏర్పడిందన్నారు. వచ్చే దసరాకు అలయ్ బలయ్ కార్యక్రమాన్ని రాయసీమ, ఉత్తర ప్రదేశ్‌లో నిర్వహించాలని, అక్కడి సంస్కృతిని మార్చాల్సిన అవసరముందని మాజీ ఎంపీ వీహెచ్ అన్నారు. దత్తాత్రేయ అందరిని ప్రేమిస్తారని, ఆయన అజాత శత్రువని, భిన్నప్రాయాలున్న వారిని ఒక వేదిక మీదకు తీసుకువస్తున్నారని మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. అలయ్ బలయ్‌ని గిన్నిస్ బుక్‌లో రికార్డు చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం సమానత్వానికి ప్రతీక అని అన్నారు. బండారు దత్తాత్రేయకు ఎవరు సాటి రారని సీపీఐ నేత నారాయణ పేర్కొన్నారు. ఇది అద్భుత కార్యక్రమం అని కాంగ్రెస్ సీనియర్ నేత కేశవరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మానవ సంబంధాలకు ప్రతీక అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల్లో, రాజకీయ పరంగా నేతలుగా ఒకరికొకరం తిట్టుకుంటామని, కానీ అలయ్ బలయ్ వేదిక మాత్రం అందరిని కలిసికట్టుగా ఉంచుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను బండారు దత్తాత్రేయ సత్కరించారు. అలయ్ బలయ్‌ని 2005లో ప్రారంభించామని, 21 ఏళ్లుగా కొనసాగుతోందని వివరించారు. ఇది సంప్రదాయం కాదని, తెలంగాణ ఆత్మ, జీవన విలువ ప్రతికగా అభివర్ణించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి అర్జున్ రాయ్ మేఘ్వాల్, విశ్రాంత సీజేఐ ఎన్వీ రమణ, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, బీజేపీ ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రఘునందన్‌రావు, జితేందర్‌రెడ్డి అజీజ్‌పాషా, కోదండరాం, అంజిరెడ్డి, మందకృష్ణ మాదిగ, కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను బహూకరిస్తున్న దత్తాత్రేయ



అలయ్‌బలయ్‌లో వెంకయ్యనాయుడితో దత్తాత్రేయ



విశ్రాంత సీజేఐ ఎన్వీ రమణతో ఆత్మీయ ఆలింగనం

సోదరభావాన్ని పెంపొందించే వేడుక

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశం

తెలంగాణలో ఏటా నిర్వహిస్తున్న అలయ్‌బలయ్ సోదరభావాన్ని పెంపొందించే వేడుక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ వార్షిక ఉత్సవం, తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతోందని తెలిపారు. అలయ్ బలయ్ వేడుక సందర్భంగా, రాష్ట్రపతి సందేశం పంపించారు. ఐక్యత, సామాజిక విలువల వ్యాప్తికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

నాటుకోడి పులుసు, చికెన్ కర్రీ

అలయ్ బలయ్ కార్యక్రమంలో వివిధ రకాల వంటలు ఘుమఘుమలాడాయి. శాకాహారుల కోసం రాగి సంగటి, పాలకూర పప్పు, వంకాయ కుర్మా, దోసకాయ, టమాటా పచ్చడి, గోబిఫ్రై, పాలక్‌పన్నీర్, బటర్ పన్నీర్, పచ్చిపులుసు, పప్పుచారు, సర్వపిండి, గారెలు, డబల్‌కామీఠా ఏర్పాటు చేశారు. మాంసాహార ప్రియుల కోసం నాటుకోడి పులుసు, బోటీ కర్రీ, లీవర్ కర్రీ, పాయ, మటన్ బిర్యానీ, తలకాయ కూర, చేపలు, రొయ్యల ఫ్రై, హలీమ్ వండారు. వంటల్లో 12 క్వింటాళ్ల చికెన్, 40క్వింటాళ్ల మటన్ ఉపయోగించారు. కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

11 జీవ ఉత్ప్రేరకాల అనుమతుల రద్దు

- హిందు, జైన ప్రతినిధుల ఫిర్యాదులతో కేంద్రం నిర్ణయం
- జంతు ఉత్పత్తుల నుంచి తయారు కావటమే కారణం

న్యూఢిల్లీ, అక్టోబరు 3: కోడి ఈకలు, పంది కణజాలం వంటి జంతు ఉత్పత్తుల నుంచి సేకరించే 11 జీవ ఉత్ప్రేరకాల విక్రయాల అనుమతిని కేంద్రం ఉపసంహరించుకుంది. హిందూ, జైన వర్గాలకు చెందిన ప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో కేంద్ర వ్యవసాయశాఖ ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు వెల్లడించారు. జీవ ఉత్ప్రేరకాలు ఎరువులు, పురుగుమందులకు భిన్నమైనవి. ఎరువులు పంటకు కావల్సిన పోషకాలను ప్రత్యక్షంగా అందిస్తాయి. పురుగుమందులు కీటకాలను నిర్మూలిస్తాయి. కాగా జీవ ఉత్ప్రేకాలు మాత్రం పంటమొక్కల్లో పోషకపదార్థాలను తీసుకునే సామర్థ్యం పెంచి దిగుబడి, నాణ్యత పెంచుతాయి. అంతేకాదు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి. మన దేశంలో జీవ ఉత్ప్రేరకాల మార్కెట్ విలువ 2024లో 3,156 కోట్లుగా నమోదైంది. 2032 నాటికి ఇది 10,085 కోట్లకు పెరుగుతుందని అంచనా. కేంద్రం అనుమతి ఉపసంహరించుకున్న జీవ ఉత్ప్రేరకాలన్నీ కూడా ప్రోటీన్ హైడ్రోలిసేట్స్‌తో తయారయ్యేవే. ప్రస్తుతం రైతులు అత్యధికంగా వినియోగిస్తున్నది వీటినే. ప్రోటీన్ హైడ్రోలిసేట్స్‌ను జంతు ఉత్పత్తుల నుంచే కాకుండా.. సోయా, మొక్కజొన్న వంటి పంట ఉత్పత్తుల నుంచి తయారు చేయవచ్చు. ఇకపై ఇవే ప్రత్యామ్నాయంగా రూపొందుతాయా అన్న ఆసక్తి నెలకొంది.

ఆరోగ్యశ్రీలో 99.50లక్షల కుటుంబాలు

రెండేళ్ల వ్యవధిలో 17% పెరిగిన కేసులు.. 'ప్రైవేటు'లో రోజూ 1200 కేసుల నమోదు

- గతంలో ఈ సంఖ్య 800-950 మాత్రమే
- పథకంలోకి కొత్తగా 9.5లక్షల కుటుంబాలు
- పెరిగిన ప్రొసీజర్లు, ఎంప్యానెల్ ఆస్పత్రులు
- ప్రభుత్వానికి వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక

హైదరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కేసుల సంఖ్య రెండేళ్ల వ్యవధిలో 17శాతం పెరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. 2023 వరకు రోజూ సగటున ప్రైవేటు ఆస్పత్రుల్లో 800-950 మధ్య ఆరోగ్యశ్రీ కేసులు రాగా... ప్రస్తుతం ఆ సంఖ్య 1150-1200కు పెరిగింది. సర్కారీ దవాఖానాల్లోని ఆరోగ్యశ్రీ కేసులను కూడా కలిపితే అది 2200 వరకు వస్తున్నట్లు వైద్య శాఖ పేర్కొంది. ఆరోగ్య శ్రీ పరిధిలోకికొత్తగా మరో పది లక్షల కుటుంబాలు రాగా.. మొత్తం కుటుంబాల సంఖ్య 99.50లక్షలకు చేరింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద ప్రభుత్వం ఇప్పటివరకు రూ.12,890 కోట్లు ఖర్చు పెట్టింది. లబ్ధిదారులు, పెరిగిన ప్రొసీజర్ల సంఖ్య, నెట్‌వర్క్ ఆస్పత్రులు, పెట్టిన ఖర్చు తదితర అంశాలపై తాజాగా ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య శాఖ ఓ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలో 2014 నుంచి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీలో చోటు చేసుకున్న మార్పులను వివరించింది. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ కింద ఇప్పటిదాకా మొత్తం 52.97 లక్షల మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నట్లు వెల్లడించింది.

ఏటా పెరుగుతోన్న రోగులు, ఆస్పత్రులు...

2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. నాడు ఒక్కో కుటుంబానికి వైద్య చికిత్సల పరిమితి రూ.2 లక్షలుగా నిర్ణయించగా.. ఉమ్మడి రాష్ట్రంలో 79 లక్షల కుటుంబాలు ఈ పథకం పరిధిలోకి వచ్చాయి. మొత్తం 120 ఎంప్యానెల్ ఆస్పత్రులు ఉండగా, ఈ పథకం కింద 533 ప్రొసీజర్లు ఉండేవి. 2012లో ఆరోగ్యశ్రీలోని ప్రొసీజర్ల సంఖ్యను 898కు పెంచగా, ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్య కూడా 338కి పెరిగింది. ఇక, తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీని యథాతథంగా కొనసాగించింది. 2014 నాటికి రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ లబ్ధి పొందే కుటుంబాల సంఖ్య 87.5 లక్షలుగా ఉంది. 2016లో కేసీఆర్ ప్రభుత్వం మరో 91 ప్రొసీజర్లను ఆరోగ్య శ్రీలోకి చేర్చింది. బడ్జెట్‌ను సైతం రూ.423 కోట్లకు పెంచింది. ఆతర్వాత 2021 నాటికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను 1356కి పెంచడంతో పాటు మరో 3 లక్షల కుటుంబాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చింది. వైద్య చికిత్సల పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడంతోపాటు బడ్జెట్‌ను రూ.973కోట్లకు పెంచింది. ప్రొసీజర్ల సంఖ్యను 1672కు పెంచింది.

కాంగ్రెస్ సర్కారు వచ్చాక మరిన్ని మార్పులు.

2023 చివరిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వైద్య చికిత్సల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారు. గత ఏడాది జూలైలో కొత్తగా మరో 163 ప్రొసీజర్లను పథకం పరిధిలోకి తెచ్చారు. దీంతో మొత్తం ప్రొసీజర్ల సంఖ్య 1835కు చేరింది. ఎంప్యానెల్ ఆస్పత్రుల సంఖ్య 1502కు పెరిగింది. అలాగే, ఆరోగ్యశ్రీ బడ్జెట్‌ను రూ.1443 కోట్లకు పెంచారు. లబ్ధి పొందే కుటుంబాల సంఖ్య 99.50 లక్షలకు చేరింది. ఇక 2022-23లో 5.59 లక్షల మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. 2023-24లో 6.21 లక్షలు, 2024-25లో 6.57 లక్షలు, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 3.02లక్షల మంది వైద్య సేవలు పొందారు. పరిమితి పెంచడంతో పాటు ప్రొసీజర్లు, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య పెంచడం వల్లే ఆరోగ్యశ్రీ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని వైద్య వర్గాలు వెల్లడించాయి. అలాగే, ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) కింద 5.46 లక్షల మంది వైద్య చికిత్సలు పొందారు.

ఆరోగ్యశ్రీ ప్రస్థానమిది...

	2007	2014	2025
కవరేజీ	రూ.2లక్షలు	రూ.2లక్షలు	రూ.10లక్షలు
ప్రొసీజర్స్	533	898	1835
ఆస్పత్రులు	120	264	1502
కుటుంబాలు	79.03లక్షలు	87.5లక్షలు	99.50లక్షలు
బడ్జెట్	రూ.50కోట్లు	రూ.323కోట్లు	రూ.1443కోట్లు

పరీక్ష రాశాక ప్రశ్న పత్రం, జవాబులు చూసుకోవచ్చు

- ఎస్ఎస్‌సీ అభ్యర్థులకు నూతన అవకాశం
- మార్కులకు బదులుగా పర్సంటైల్ విధానం
- ఆధార్ ఆధారిత హాజరు విధానం
- లీకేజీల నిరోధానికి డిజిటల్ వాల్ట్‌లు
- అమలులోకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కీలక సంస్కరణలు
- అభ్యర్థులకు అందుబాటులో ఉండేందుకు ఎక్స్‌లోకి 'ఎస్ఎస్‌సీ'

న్యూఢిల్లీ, అక్టోబరు 3 : కేంద్ర ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాల్లో నాన్ గెజిటెడ్ పోస్టులను భర్తీ చేసే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) తాను నిర్వహించే పరీక్షలకు సంబంధించి కీలక సంస్కరణలు చేసింది. పరీక్ష అనంతరం అభ్యర్థులు తమ ప్రశ్న, జవాబు పత్రాలు చూసుకునే అవకాశం కల్పించిన ఎస్ఎస్‌సీ.. ఇకపై మార్కుల ఆధారంగా కాక పర్సంటైల్ విధానంలో అభ్యర్థుల మెరిట్ జాబితాను నిర్ణయించనుంది. ప్రశ్నపత్రం లికేజీలు నిరోధానికి డిజిటల్ వాల్ట్‌ల వినియోగించనున్న ఎస్ఎస్‌సీ.. పరీక్ష కేంద్రాల్లో ఆధార్ గుర్తింపు ఆధారంగా అభ్యర్థుల హాజరు తీసుకోనుంది. పరీక్షల నిర్వహణ మరింత పకడ్బందీగా, అభ్యర్థుల ఎంపిక మరింత పారదర్శకంగా జరిగేలా ఈ సంస్కరణలను అమలులోకి తెచ్చామని ఎస్ఎస్‌సీ శుక్రవారం ప్రకటించింది. ప్రశ్నపత్రాన్ని బహిర్గతం చేయడం, అందరికీ అందుబాటులో ఉండేలా చేయడం తాము అమలులోకి తెచ్చిన సంస్కరణల్లో అత్యంత కీలకమైనదని ఎస్ఎస్‌సీ పేర్కొంది. ఇకపై, అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే తమకు వచ్చిన ప్రశ్న పత్రం, దానికి తామిచ్చిన సమాధానాలతోపాటు కీని కూడా చూసుకోవచ్చునని, వాటిని డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చని ఎస్ఎస్‌సీ అధికారులు పేర్కొన్నారు. వాటి ఆధారంగా అభ్యర్థులు ఏదైనా ప్రశ్నపై బోర్డును సవాలు చేయవచ్చని వివరించారు. అయితే, ఏదైనా పరీక్ష వేర్వేరు షిఫ్ట్‌ల్లో జరుగుతుంటే మాత్రం.. ఆ పరీక్షలన్నీ పూర్తయిన తర్వాతే ప్రశ్నపత్రాలు, సమాధానాలు కనిపిస్తాయని, ఆ తర్వాతే సవాలు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ప్రశ్నపత్రం బహిర్గతం కాకూడదనే ఈ నిబంధన అని తెలిపారు. ఓ ప్రశ్నను సవాలు చేసేందుకు గతంలో రూ.100గా ఉన్న రుసుమును కూడా ఎస్ఎస్‌సీ రూ.50కి తగ్గించింది. అంతేకాక, ఎంపిక చేసిన పలు పరీక్షల పాత ప్రశ్నపత్రాలను ఇక నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతామని ఎస్ఎస్‌సీ ప్రకటించింది. దీని ద్వారా పరీక్ష సిలబస్, మోడల్ ప్రశ్నపత్రం తదితర అంశాలపై అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపింది.

పర్సంటైల్ విధానం..

ఎస్ఎస్‌సీ అమలులోకి తెచ్చిన సంస్కరణల్లో భాగంగా ఇకపై అభ్యర్థుల ర్యాంకింగ్ లేదా మెరిట్ జాబితాను నిర్దేశిత పరీక్షలో వారు సాధించిన మార్కుల ఆధారంగా కాక పర్సంటైల్ విధానంలో నిర్ణయించనున్నారు. ప్రస్తుతం ఏదైనా ఉద్యోగానికి వేర్వేరు షిఫ్ట్‌ల్లో నిర్వహించే పరీక్షలకు వేర్వేరు ప్రశ్నపత్రాలు ఇస్తున్నారు. పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. ఓ షిఫ్ట్‌లో ప్రశ్న పత్రం సులువుగా ఉందని, మరో షిఫ్ట్‌లో ఇచ్చిన ప్రశ్న పత్రం కఠినంగా ఉందని అలాంటప్పుడు మార్కుల ఆధారంగా ఎంపిక ఎలా చేపడతారని విమర్శలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు పర్సంటైల్ విధానంతో ఆ విమర్శలకు ముగింపు పలకవచ్చని ఎస్ఎస్‌సీ అధికారులు పేర్కొన్నారు. ఇక, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయడం, ఒక అభ్యర్థి ఒకే పరీక్షను పలుమార్లు రాయడం వంటి వాటిని నిరోధించేందుకు ఆధార్ అథెంటికేషన్ హాజరు విధానాన్ని కూడా అమలులోకి తెచ్చామని బోర్డు ప్రకటించింది. ప్రశ్నపత్రాల లీకేజీ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇకపై డిజిటల్ వాల్ట్‌ల ద్వారా ప్రశ్నపత్రాలను ట్రాన్స్‌ఫర్ చేయనున్నామని ఎస్ఎస్‌సీ పేర్కొంది. డిజిటల్ వాల్ట్‌లో ఉన్న ప్రశ్నపత్రాలు హ్యాకింగ్ లేదా వేరే ఏదైనా మార్గంలో లీక్ అవ్వకుండా చూసేందుకు ఐటీ ఏజెన్సీల సేవలను వినియోగించుకుంటామని వెల్లడించింది. కాగా, అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల స్వీకరణకు ప్రస్తుతం 1800 309 3063 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ అందుబాటులో ఉండగా.. దీనికి అదనంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని ఎస్ఎస్‌సీ తెలిపింది. అలాగే, అభ్యర్థులకు అందుబాటులో ఉండేందుకుగాను ఎక్స్(ట్విటర్)లో తమ అధికారిక ఖాతాను కూడా ప్రారంభించామని ఎస్ఎస్‌సీ శుక్రవారం ప్రకటించింది. ఆ ఖాతా ద్వారా అభ్యర్థులు ఎస్ఎస్‌సీకి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చునని పేర్కొంది.

వాళ్లకి 14న పునఃపరీక్ష

ఎస్ఎస్‌సీ ఇటీవల నిర్వహించిన సీజీఎల్ఈ-2025(కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్) పరీక్షకు 125 నగరాల్లోని 255 కేంద్రాల్లో 13.5 లక్షల మంది హాజరయ్యారు. సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఇందులో కొన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి అందిన విజ్ఞప్తులకు స్పందించిన ఎస్ఎస్‌సీ.. సమస్య తలెత్తిన కేంద్రాల్లో పరీక్ష రాసిన వారికి అక్టోబరు 14న మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించింది. అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించింది. ఈ పరీక్ష రాసిన అభ్యర్థులు కొత్త విధానం ప్రకారం అక్టోబరు 15 నుంచి ప్రశ్నలను సవాలు చేయవచ్చు. ఇక, 2025 అక్టోబరు నుంచి 2026 మార్చి మధ్యలో తాము నిర్వహించే పలు ముఖ్యమైన పరీక్షల ప్రణాళికలను కూడా ఎస్ఎస్‌సీ శుక్రవారం విడుదల చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.